
ఈనాడు
యాదాద్రి భువనగిరి

గురువారం 4 జనవరి 2018 | 16 పేజీలు



పాతాళానికి గంగ.. యాసంగిపై బెంగ

- గత నెలతో పోలిస్తే మూడు జిల్లాల్లోనూ పడిపోయిన జల మట్టాలు
- నిరంతర విద్యుత్ సరఫరాతో తగ్గిపోతున్న నీటి లభ్యత
- భూగర్భజల శాఖ తాజా నివేదికలో వెల్లడి

ఈనాడు, యాదాద్రి

ఉమ్మడి నల్గొండ జిల్లాలో రోజురోజుకూ భూగర్భజలాలు పడిపోతున్నాయి. నిరంతర విద్యుత్ సరఫరాతో రైతులు ఏకబిగిన పంపు సెట్లు నడిపిస్తుండటంతో గంగ పాతాళానికి పరుగులు తీస్తోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి మూడు జిల్లాల్లోనూ గతేడాది నవంబరు నెలతో పోలిస్తే డిసెంబరులో మీటరుకు పైగా మట్టాలు పడిపోవడం ఆందోళన కలిగించే పరిణామమే. డిసెంబరులోనే పరిస్థితి ఇలాగుంటే రానున్న కాలంలో జల సంక్షోభం తప్పదని భూగర్భజల శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈ సంక్షోభం యాసంగి పంటల సాగుపై తీవ్రంగా ప్రభావం చూపనుంది. నల్గొండ జిల్లాలో నవంబరులో సగటు భూగర్భ జల లభ్యత 8.64 మీటర్లుండగా.. అది డిసెంబరుకు 9.17 మీటర్లకు పడిపోయింది. యాదాద్రి జిల్లాలో నవంబరులో 9.58 మీటర్లు ఉండగా డిసెంబరులో 10.31 మీటర్లుగా నమోదైంది. సూర్యాపేట జిల్లాలో నవంబరులో 8.11 మీటర్లలో నీటి లభ్యత ఉండగా.. డిసెంబరులో 8.82 మీటర్లకు పడిపోయింది.

సూర్యాపేట జిల్లాలోనే పరిస్థితి సానుకూలం

నల్గొండ, యాదాద్రి జిల్లాలతో పోలిస్తే భూగర్భ జలమట్టాల స్థాయి సూర్యాపేట జిల్లాలోనే ఆశాజనకంగా ఉందని నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఆయకట్టు ప్రాంతానికి సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో కాలువ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జల లభ్యత కొంత ఆశాజనకంగా ఉంది. అయితే రానున్న కాలంలో నీటి విడుదల ఆపివేయడం... వరినాట్లు ముమ్మరం కానుండటంతో భూగర్భ జలమట్టాల పరిస్థితి తీవ్రం కానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాసంగిలో దాదాపు 3.80 లక్షల ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ ఆయకట్టులోని మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలతో పాటూ నల్గొండ, భువనగిరి నియోజకవర్గంలోని మూసీ పరివాహక ప్రాంతం, మూసీ ప్రాజెక్టు పరిధిలోని కేతేపల్లి, సూర్యాపేట ప్రాంతాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 2.5 లక్షల ఎకరాల్లో (మిగతా 7లో)

ఇక్కడ దయనీయం


కరవు ప్రాంతమైన దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మునుగోడులోని మునుగోడు, చండూరు, నారాయణపురం, చౌటుప్పల్, నకిరేకల్ నియోజకవర్గంలోని రామన్నపేట, నార్కట్‌పల్లి, చిట్యాల ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరు, రాజపేట, ఆత్మకూరు(ఎం), తుంగతుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్, ఆత్మకూరు (ఎస్), చివ్వెంల కోదాడ నియోజకవర్గంలోని మోతె మండలాల్లో భూగర్భజల లభ్యత ప్రమాదకర స్థాయిలో ఉందని నివేదిక పేర్కొంది.



జూనియర్స్ విభాగం విజేత కేఎల్ఎన్ జూనియర్ కళాశాల జట్టుకు జ్ఞాపిక, పారితోషికం, ధ్రువపత్రాలను అందజేస్తున్న జేసీ నారాయణరెడ్డి, స్వామి రామానందతీర్థ విద్యాసంస్థల డైరెక్టర్ యారాల ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ పీవీసీ పైపుల సంస్థ ప్రతినిధి కె.చంద్రమోహన్, నారాయణ కళాశాల డీన్ వెంకటేశ్వర్లు, ఎస్ఆర్‌టీఐఎస్‌టీ కళాశాల ప్రిన్సిపల్ హరినాథ్‌రెడ్డి, 'ఈనాడు' సూర్యాపేట మేనేజర్ జి. వెంకటపతిరావు

ముగిసిన క్రికెట్ పండగ

నల్గొండలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి 'ఈనాడు' ఛాంపియన్ క్రికెట్ కప్-2017 పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు ఉత్సవానికి నల్గొండ జేసీ నారాయణ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో 'ఈనాడు' క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మొత్తం 42 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో మిర్యాలగూడ కేఎల్ఎన్ జూనియర్ కళాశాల.. సీనియర్స్ విభాగంలో భువనగిరి వాత్సల్య కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ జట్లు విజేతగా నిలిచాయి. వివరాలు.. 3లో



అతిథుల నుంచి బహుమతులు అందుకుంటున్న సీనియర్స్ విభాగం విజేత వాత్సల్య కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, భువనగిరి జట్టు



చౌటుప్పల్ బంగారుగడ్డలో వక్ఫ్ భూములుగా నమోదైన కట్టడాల ప్రాంతం

అక్షరం మార్పుతో భూములు తారుమారు

- గట్టుప్పల్‌కు బదులు చౌటుప్పల్‌గా గెజిట్
- గందరగోళంలో రూ.కోట్ల విలువైన 71.6 ఎకరాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే

'ఒక్క ఆంగ్ల అక్షరం' తారుమారు కావడంతో 71.6 ఎకరాల విస్తీర్ణంలోని రూ.కోట్ల విలువైన భూముల పరిస్థితి గందరగోళంలో పడింది. 1990 ఫిబ్రవరిలో వెలువడిన ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన రాజపత్రం (గెజిట్)లో నల్గొండ తాలూకా చౌటుప్పల్‌లోని 327, 332, 333, 334, 336, 337, 338 సర్వే నెంబర్లలోని 68.10 ఎకరాల మెట్ట, 2.36 ఎకరాల తరి భూములు వక్ఫ్‌బోర్డుకు సంబంధించినవిగా పేర్కొన్నారు. ఈ రాజపత్రం ప్రతులను జిల్లా అధికార యంత్రాంగం ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరాయి. దీంతో ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. వాస్తవానికి స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లోని కాస్రా పహాణీల్లో ఇవి పట్టా భూములుగానే నమోదై ఉన్నాయి. గెజిట్‌లో మాత్రం వీటిని వక్ఫ్ భూములుగా పేర్కొనడంతో ఈ సర్వే నెంబర్లలో ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసినా సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్లు చేయడానికి నిరాకరిస్తున్నారు.

పట్టాభూములు వక్ఫ్‌గా ఎలా నమోదయ్యాయి?

చౌటుప్పల్, గట్టుప్పల్ రెండూ మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాలు. ఈ రెండు గ్రామాల్లోనూ భూముల (మిగతా 7లో)

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

చౌటుప్పల్ బంగారుగడ్డ ప్రాంతంలో సుమారు 500 భవనాలు నిర్మాణమయ్యాయి. ఖాళీ ఇంటి స్థలాలు కూడా ఉన్నాయి. 327, 332, 333, 334, 336, 337, 338 సర్వే నెంబర్లలోని ఈ స్థలాలను స్థానిక పట్టాదారుల నుంచి కొనుగోలు చేసి గృహాలు నిర్మాణం చేసుకుని ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్నారు. ఈ ఇళ్లను, స్థలాలను అమ్మకాలు, కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వీటికి రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. ఎందుకంటే... ఈ భూములు వక్ఫ్ బోర్డుకు సంబంధించినవని పేర్కొంటూ 1990 ఫిబ్రవరిలో 22న వెలువడిన రాజపత్రాన్ని (గెజిట్) సబ్ రిజిస్ట్రార్ చూపిస్తున్నారు.

సాగర్ ఎడమకాల్వలో విద్యార్థి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ నేరవార్తలు, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాలువలో గల్లంతైన ఇంటర్మీడియట్ విద్యార్థి అనాస్(16) మృతదేహం బుధవారం ఉదయం సాగర్ ఎడమ కాలువలో లభ్యమైంది. మృతదేహాన్ని వన్‌టౌన్ పోలీసులు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అనాస్ తన స్నేహితులతో కలిసి బయటకు వెళ్లగా ఈత కోసం వెళ్లి కాల్వలో గల్లంతయ్యారు. దీనిపై విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో స్నేహితులను విచారించగా మృతదేహం లభ్యమైంది.


సాగర్ ఎడమకాలువలో లభించిన అనాస్ మృతదేహం

★ ప్రాంతీయ ఆసుపత్రిలో అనాస్ మృత దేహాన్ని ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు బుధవారం పరిశీలించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనాస్ కాల్వలో గల్లంతైన విషయమై సమగ్రంగా విచారణ జరిపించాలని డీఎస్పీని ఆదేశించారు. పరామర్శించిన వారిలో తెరాస పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్ర విష్ణు, ఐలా వెంకన్న, జావెద్, అలీం, నాగరాజు తదితరులు ఉన్నారు.

రైలు పట్టాలపై బీటెక్ యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ నేరవార్తలు, న్యూస్‌టుడే: 'అమ్మా ఎన్ని జన్మలెత్తినా నీ రుణం తీర్చుకోలేను... నా కోసం ఎన్నో బాధలు పడ్డావు. వీలైతే మరోజన్మ ఉంటే నీ కడుపున పుట్టి నిన్ను మంచిగా చూసుకుంటాను అమ్మా.. మన ఇంటికి మంచి పేరు తెస్తానమ్మా...'


సురేష్ మృతదేహం

అంటూ బాధాతప్త హృదయంతో లేఖ రాసి ఓ బీటెక్ యువకుడు బుధవారం రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా రాయక పోయినప్పటికీ తన కుటుంబ సభ్యులకు మంచి కలగాలని మాత్రం లేఖలో రాసి పెట్టాడు. మిర్యాలగూడ పట్టణంలోని రైలు పట్టాలపై బీటెక్ యువకుడు ఎలిజెర్ల సురేష్ (25) బుధవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై అచ్యుతకుమార్ తెలిపారు. పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన ఎలిజెర్ల యాదయ్య, యాదమ్మ దంపతుల కుమారుడు ఎలిజెర్ల సురేష్ బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఎంతసేపటికి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం సమీపంలోని రైలు పట్టాలపై యువకుడి మృతదేహం తల ఛిద్రమై ఉండగా రైల్వేసిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించగా రైల్వే పోలీసులు పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎలిజెర్ల సురేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, విచారణ జరుపుతున్నామని ఎస్సై అచ్యుతకుమార్ తెలిపారు.


సురేష్ (దాచిన చిత్రం)

పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ) న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి - విశాఖపట్నం - తిరుపతి (ఏసీ ప్రత్యేక రైలు): రైలు నెంబరు 07487 ఏసీ ప్రత్యేక రైలు ఈ నెల 7, 14, 21, 28 ఫిబ్రవరి 4, 11, 18, 25 తేదీల్లో తిరుపతిలో రాత్రి 10.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.45కి విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 07488 నెంబరుతో ఈ నెల 8, 15, 22, 29 ఫిబ్రవరి 5, 12, 19, 26 తేదీల్లో విశాఖపట్నంలో రాత్రి 7.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10కి తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

కాచిగూడ - విశాఖపట్నం: రైలు నెంబరు 07016 ప్రత్యేక రైలు ఈ నెల 6, 13, 20, 27 తేదీల్లో కాచిగూడలో సాయంత్రం 6.45కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.50కి విశాఖపట్నం చేరుకోనుంది. ఈ రైలు మల్కాజిగిరి, చల్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

విశాఖపట్నం - తిరుపతి: రైలు నెంబరు 07479 ప్రత్యేక రైలు విశాఖపట్నంలో ఫిబ్రవరి 7, 14, 21, 28వ తేదీల్లో రాత్రి 7.05కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.25కి తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగనుంది.

తిరుపతి - కాచిగూడ: రైలు నెంబరు 07146 ప్రత్యేక రైలు ఈ నెల 8, 15, 22 మార్చి 1వ తేదీల్లో తిరుపతిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కి కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైలు రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, మధిర, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, ఖాజీపేట, జనగాం స్టేషన్లలో ఆగుతుంది.

హైదరాబాద్ - విశాఖపట్నం - హైదరాబాద్: రైలు నెంబరు 07148 ప్రత్యేక రైలు ఈ నెల 10, 12 తేదీల్లో హైదరాబాద్‌లో సాయంత్రం 5.45కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.15కి విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 07147 నెంబరుతో ఈ నెల 11, 13 తేదీల్లో విశాఖపట్నంలో సాయంత్రం 6.50కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.45కి హైదరాబాద్ చేరుకోనుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్ స్టేషన్లలో ఆగుతుంది.

ప్రైవేటుకు రోగుల పరుగు

★ పనిచేయని స్కానింగ్ మిషన్ ★ అవస్థలు పడుతున్న రోగులు



నిరుపయోగంగా మారిన స్కానింగ్ మిషన్

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే:

జిల్లా కేంద్రాసుపత్రిలో స్కానింగ్ మిషన్ 25 రోజులుగా పనిచేయడం లేదు. రూ.కోటికి పైగా ఖర్చు చేసి ఏర్పాటు చేసిన యంత్రం నిరుపయోగంగా మారడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. మెదడు, ఎముకలు, ఛాతి సమస్యలు, మూత్రపిండాలు, నడుము నొప్పి బాధితులతో పాటు రోడ్డు ప్రమాదాలకు గురైన వారు రోజుకు పది మంది చొప్పున స్కానింగ్ యంత్రం పరీక్షలను వినియోగించుకుంటున్నారు. యంత్రం ద్వారా పరీక్షలు చేయించుకునే బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తున్నారు. ప్రస్తుతం యంత్రం పనిచేయకపోవడంతో బాధితులు ప్రైవేటు సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు సెంటర్ల నిర్వాహకులు ఒక్కో బాధితుడి నుంచి రూ. 1,500 నుంచి రూ. 2వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో కొంతమంది వైద్యులు ప్రైవేటు సెంటర్లతో ఉన్న ఒప్పందాల కారణంగా చిన్న చిన్న కారణాలతో యంత్రాన్ని మూలన వేస్తూ కమీషన్లకు కక్కుర్తి పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెదడువాపు వ్యాధితో

సుఖ్యానాయక్, పోలెపల్లితండా, దేవరకొండ

నాలుగు రోజుల క్రితం నా కుమారుడు గౌతంకుమార్‌కు మెదడువాపు వ్యాధితో జిల్లా కేంద్రాసుపత్రిలో చేరాం. పరీక్షించిన వైద్యులు తలను స్కానింగ్ చేయాలని చెప్పారు. నివేదికను బట్టి వైద్యం అందిస్తామన్నారు. స్కానింగ్ మిషన్ ప్రాంతానికి వెళ్తే రోజూ పనిచేయడం లేదని చెబుతున్నారు. ప్రైవేటుగా వెళ్తే రూ.2వేలకు పైగా ఖర్చు అయ్యే అవకాశం ఉంది. నా వద్ద అంత డబ్బులేదు. ప్రభుత్వ ఆసుపత్రి అని వస్తే పట్టించుకునే వారు లేరు. ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

చెప్పినా పట్టించుకోరు..:

శ్రీనివాసులు

రెండు రోజుల క్రితం నడుము నొప్పులతో ఆసుపత్రిలో చేరాను. వైద్యులు పరీక్షించి స్కానింగ్ రాశారు. కానీ మిషన్ పనిచేయడం లేదు. ఆసుపత్రి అధికారులకు చెప్పినా ఎటువంటి ఫలితం లేదు. ఆసుపత్రి ముందు భాగంలో ఉన్న ఫిర్యాదుల పెట్టెలో చీటీ రాసి వేశాం. దానివైపు కూడా ఎవరూ వెళ్లట్లేదు. ఇక్కడ పనిచేస్తున్న వారు ప్రైవేటు సెంటర్లకు వెళ్లి స్కానింగ్ తీసుకు రమ్మని చెబుతున్నారు. చేతుల్లో డబ్బులు లేవు. ఇప్పటికైనా యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

పనిచేయనిది వాస్తవమే..:

డా.నర్సింగరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్

జిల్లా కేంద్రాసుపత్రిలో స్కానింగ్ మిషన్ పనిచేయని మాట వాస్తవమే. రాష్ట్ర వ్యాప్తంగా యంత్రాల మరమ్మతులను ఓ ప్రైవేటు ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. ఏజెన్సీ నిర్వాహకులకు ఎప్పుడు అడిగినా వారం.. వారం అంటూ జాప్యం చేస్తున్నారు. మా చేతిలో ఉన్న పని చేశాం. వారి కోసం వేచి చూడాల్సిందే.

దాడి కేసులో మూడేళ్ల జైలుశిక్ష

మిర్యాలగూడ లీగల్, న్యూస్‌టుడే: ఇంటిపై దాడి చేసి కర్రలు, గొడ్డలితో కొట్టి గాయపర్చిన కేసులో నిందితులపై నేరం రుజువుకావడంతో మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామానికి చెందిన అనుముల వెంకటయ్య, సతీష్‌లకు మూడేళ్ల జైలు, రూ. 500 జరిమానా విధిస్తూ మిర్యాలగూడ అసిస్టెంట్‌సెషన్స్ జడ్జి ఐ. శైలజాదేవి బుధవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... 25 మార్చి 2014న అదే గ్రామానికి చెందిన అనుముల శ్రీను, అతని భార్య విజయలక్ష్మి ఇంటిపై నిందితులు దాడి చేసి కొట్టి గాయపర్చారు. బాధితుల ఫిర్యాద మేరకు అప్పటి రూరల్ ఏఎస్సై వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేయగా ఎస్సై రాహుల్‌దేవ్ కేసు విచారణ జరిపి ఛార్జిషీటు దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో పై శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎడిషనల్ పీపీ తాజొద్దీన్ వాదించగా కోర్టు పీసీ కిషన్ ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

ప్రధానోపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: విధులకు సరిగా హాజరు కావడం లేదని నారాయణపురం మండలంలోని ఓ ప్రధానోపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు పడింది. సంస్థాన్ నారాయణపురం మండలంలోని కడిలబావితండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశం ఇటీవలగా తరుచూ విధులకు గైర్హాజరు అవుతున్నారు. వారం రోజుల క్రితం నారాయణపురం ప్రత్యేక అధికారి కడిలబావితండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో పాఠశాలకు తాళం వేసి ఉండడంతో దీనిపై ఎలాంటి సమాచారం లేకుండా విధులకు హాజరుకాకపోవడంతో ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి జిల్లా పాలనాధికారిణి అనితారామచంద్రన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా పాలనాధికారిణి అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో డీఈవో రోహిణి ఆదేశాల మేరకు సంబంధిత ఎంఈవో వెంకటేశ్వర్లు సీఆర్‌పీ ద్వారా సస్పెన్షన్ ఉత్తర్వును ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. మండలంలోని మారుమూల గిరిజన తండాల్లో పలువురు ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని విమర్శలున్నాయి.

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

ఆలేరు, న్యూస్‌టుడే: భువనగిరి ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్‌రెడ్డి బుధవారం ఆలేరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరయ్యారు. 2014లో జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ప్రజలకు నీటి క్యాన్లను పంపిణీ చేశారని ఆలేరు పోలీసు స్టేషన్లో కేసును నమోదైంది. ఈ కేసు విషయమై న్యాయస్థానంలో బుధవారం హాజరయ్యారు. కేసు ఈనెల 19కి వాయిదా పడింది.

ఏపీజీవీబీ కుంభకోణం కేసులో నలుగురి అరెస్టు

● బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, మెప్మా మహిళా సంఘాల ప్రతినిధుల రిమాండ్

● రూ.25 లక్షల ఆస్తులు సీజ్

మిర్యాలగూడ నేరవార్తలు, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పట్టణంలోని టాకారోడ్డు ఏపీజీవీబీలో రూ. 2.86 కోట్ల కుంభకోణం కేసులో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ తాళ్ల సంతోష్‌కుమార్ సహా మెప్మా మహిళా సంఘాల ప్రతినిధులు ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు.

బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ తాళ్ల సంతోష్‌కుమార్ 2016 అక్టోబరు నుంచి 2017 అక్టోబరు వరకు మెప్మా సంఘాలకు చెందిన కందిబండ రేవతి, ఆకారపు జానకి, బత్తిన సోమిదేవిల సహకారంతో రూ. 2.86 కోట్లు ఆయా మహిళల అకౌంట్లలో జమచేశారు. 1997లో సంఘాలుగా ఏర్పడి బ్యాంకులో ఖాతాలు తెరిచి ఆ తరువాత వినియోగించకుండా వదిలి వేసిన కొన్ని ఖాతాలను గుర్తించారు. ఆయా ఖాతాలను తనకున్న అధికారంతో తిరిగి తెరిచి వారికి రూ.7 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. మహిళా సంఘాల ప్రతినిధుల సహకారంతో బ్యాంకు ఖాతాలు ఉన్న మహిళలను తీసుకు వచ్చి వారి ఖాతాల నుంచి జమ చేసిన డబ్బు తీసుకునే వాడు. ఇందుకు సహకరించినందుకు గాను సంఘాల ప్రతినిధులకు కొంత డబ్బు అందించే వాడు.

★ ఫీల్డ్ ఆఫీసర్ తాళ్ల సంతోష్‌కుమార్ ఖమ్మం జిల్లాకు చెందిన వరప్రసాద్, అనంతరాములు, ఖాజా మోహినుద్దీన్‌లతో కలిసి పాత నోట్లు రూ.11 లక్షలు మార్పిడి చేశారు. ఖాజా మోహినుద్దీన్ విజయవాడకు చెందిన దుర్గ అనే మహిళను పరిచయం చేయగా ఆమె విశాఖకు చెందిన చిరంజీవిని పరిచయం చేసింది. 'రైస్‌పుల్లింగ్ కాయిన్ ' వ్యాపారంలో బాగా లాభాలు సాధించవచ్చని చెప్పటంతో నమ్మిన తాళ్ల సంతోష్ విడతల వారీగా బ్యాంకు నుంచి సేకరించిన డబ్బును ఆయా వ్యక్తుల ఖాతాల్లో జమచేశారు. ఈక్రమంలో రూ.71 లక్షలు చిరంజీవికి, రూ.57 లక్షలు వాసుకు, రూ.50 లక్షలు దుర్గ ఖాతాలో జమ చేసినట్లు గుర్తించామని డీఎస్పీ తెలిపారు.

★ తనకు బ్యాంకు ఖాతాలు ఇచ్చి సహకరించినందుకు గాను కందిబండ రేవతికి రూ.48లక్షలు , ఆకారపు జానకి రూ.26 లక్షలు , బత్తిని సోమిదేవికి రూ. 3లక్షలు ఇచ్చినట్లు విచారణలో తేలిందన్నారు.

ఈకేసులో ప్రస్తుతం నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు విధించారన్నారు.


బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, ముగ్గురు మెప్మా ప్రతినిధులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ పి.శ్రీనివాస్, సీఐలు సాయిఈశ్వర్‌గౌడ్, ధనుంజయ, వెంకటేశ్వర్‌రెడ్డి

కేసుతో సంబంధం ఉన్న ఎవరినీ వదిలి పెట్టేది లేదని డీఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు.

★ కుంభకోణం విషయం వెలుగు చూడకుండా పత్రికల్లో రాకుండా చూస్తానంటూ ఓ దళారీ(ఓ పత్రిక ప్రతినిధి) రూ. 2లక్షలు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించగా ఈ మేరకు విచారణ జరుపుతున్నామన్నారు. ప్రజలు వైట్ కాలర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పురాతన నిధులు, వ్యాపారాల పేరిట చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సమావేశంలో సీఐలు సాయి ఈశ్వర్‌గౌడ్, ధనుంజయ, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్సై శేఖర్, వెంకట్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మట్టయ్య, కానిస్టేబుళ్లు మట్టయ్య, నాగరాజు పాల్గొన్నారు. దర్యాప్తు బృందాన్ని డీఎస్పీ శ్రీనివాస్ అభినందించారు.

సత్తా ఉంటే.. సమరం కూడా సయ్యాటే: జేసీ

నల్గొండలో ముగిసిన స్ప్రైట్, ఈసీసీ కప్ - 2017 పోటీలు

నల్గొండ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండ పరిధిలోని స్వామి రామానంద తీర్థ ఇంజినీరింగ్ కళాశాలలో నారాయణ విద్యాసంస్థల సహకారంతో 'ఈనాడు'-'స్ప్రైట్' సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఈనాడు' ఛాంపియన్ క్రికెట్ కప్ పోటీలు ముగిశాయి. బుధవారం నిర్వహించిన పోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ నారాయణ రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశ చెందకుండా గెలిచేందుకు కృషి చేయాలన్నారు. విద్యాపరంగా, క్రీడల పరంగా విద్యార్థుల ఉన్నతికి 'ఈనాడు' ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో నల్గొండలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సాధించే సత్తా ఉంటే.. సమరం కూడా సయ్యాటే అని క్రీడాకారులకు సూచించారు. 'ఈనాడు' సూర్యాపేట యూనిట్ మేనేజర్ వెంకటపతిరావు మాట్లాడుతూ 'ఈనాడు' క్రికెట్ టోర్నమెంట్‌కు రెండు రాష్ట్రాల్లో ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని చెప్పారు. నల్గొండలో నిర్వహించిన 'ఈనాడు' క్రికెట్ కప్ టోర్నమెంట్‌లో ఎందరో క్రీడాకారులు ప్రతిభ చాటారని తెలిపారు. ఇక్కడ జరిగిన 'ఈనాడు' ఛాంపియన్ క్రికెట్ పోటీల్లో 42 జట్లు పాల్గొన్నాయని, తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 1,700 జట్లు పాల్గొన్నాయని వెల్లడించారు. స్వామి రామానందతీర్థ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ యారాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈనాడు' ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జేసీ నారాయణ రెడ్డి తదితరులు బహుమతులను అందజేశారు. నారాయణ కళాశాలల డీన్ వెంకటేశ్వర్లు, సుధాకర్ పీవీసీ పైప్స్ ప్రతినిధి కె. చంద్రమోహన్, స్వామి రామానందతీర్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న భువనగిరి వాత్సల్య కళాశాల, యాదగిరిగుట్ట ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల జట్లు



మాట్లాడుతున్న జేసీ నారాయణరెడ్డి, పక్కన స్వామి రామానందతీర్థ విద్యాసంస్థల డైరెక్టర్ యారాల ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్ పీవీసీ పైపుల సంస్థ ప్రతినిధి కె.చంద్రమోహన్, నారాయణ కళాశాలల డీన్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ హరినాథ్‌రెడ్డి, 'ఈనాడు' సూర్యాపేట యూనిట్ మేనేజర్ వెంకటపతిరావు

'ఈనాడు' ఛాంపియన్స్ క్రికెట్ కప్ ఫైనల్ పోటీల ఫలితాలు

'కేఎల్ఎన్' జట్టు జయహో..

కోదాడ జూనియర్స్ విభాగంలో అనురాగ్ పాలిటెక్నిక్ కళాశాల, మిర్యాలగూడ కేఎల్ఎన్ జూనియర్ కళాశాల జట్లు తలపడగా 8 వికెట్ల తేడాతో కేఎల్ఎన్ జూనియర్ కళాశాల జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనురాగ్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 43 పరుగులు మాత్రమే చేసింది. సాయిప్రసాద్ 13 పరుగులతో రాణించారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన కేఎల్ఎన్ జూనియర్ కళాశాల జట్టు కేవలం 5.3 ఓవర్లలోనే 44 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. కేఎల్ఎన్ జట్టులోని సౌమిత్ బౌలింగ్‌లో 3 పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.



విజయానందంలో మిర్యాలగూడ కేఎల్ఎన్ జూనియర్ కళాశాల జట్టు

'వాత్సల్య' జయకేతనం

సీనియర్స్ విభాగంలో భువనగిరి వాత్సల్య కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, యాదగిరిగుట్ట ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ, పీజీ కళాశాల జట్లు తలపడగా వాత్సల్య కళాశాల జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 70 పరుగులు సాధించింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన వాత్సల్య కళాశాల జట్టు 9.2 ఓవర్లలోనే 71 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.



గెలిచిన క్షణంలో.. భువనగిరి వాత్సల్య కాలేజ్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ జట్టు సభ్యులు

అంతర్గత పైప్‌లైన్ పనులు ఫిబ్రవరిలోగా పూర్తిచేయాలి: కలెక్టర్

భువనగిరి, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ కార్యక్రమంలో అంతర్గత పైపులైన్ నిర్మాణ పనులను ఫిబ్రవరి లోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనితారామచంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో జరుగుతున్న పనుల ప్రగతిని సమీక్షించారు. 207 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఈ పనుల పూర్తికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాజపేట, వలిగొండ, బొమ్మలరామారం, తుర్కపల్లి, పోచంపల్లి మండలాల్లో అసంపూర్తిగా మిగిలిన పనులను జనవరి 26లోగా నూరు శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఈ కార్యక్రమాన్ని సవాల్‌గా తీసుకొని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 45వేల గృహాలకు సంబంధించి ఇంట్రా పైప్‌లైన్ పనులు మిగిలి ఉన్నందున వారానికి 5వేల చొప్పున కనెక్షన్లు ఇచ్చి ఏడు వారాల్లో పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని వివరించారు. అదనంగా వంద బృందాలను ఏర్పాటుచేసి పనులు వేగిరం చేస్తేనే లక్ష్యం మేరకు గడువులోగా తాగునీరు అందిస్తామన్నారు. 343 ట్యాంకుల నిర్మాణానికిగాను 247 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనులను సంక్రాంతిలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. యాదాద్రి పుణ్యక్షేత్రంలో నిర్దేశించిన పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో ఆర్డీవో భూపాల్‌రెడ్డి, ఈఈ రాజేందర్ పాల్గొన్నారు.



భువనగిరిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనితారామచంద్రన్

కళాజాతాను ప్రారంభించిన కలెక్టర్

భువనగిరి: పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కళారూపాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ అనితారామచంద్రన్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి ఈ నెల 24 వరకు గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కళాజాతా ప్రచార రథాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొని మలవిసర్జన రహిత(ఓడీఎఫ్) జిల్లాగా ప్రకటించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జేసీ రవి, డీఆర్‌వో మహేందర్‌రెడ్డి, పీఆర్‌వో జగదీశ్, ఆలేరు జడ్పీటీసీ సభ్యుడు పరమేశ్, డీఆర్‌డీఏ ఏపీడీ శ్యామల, తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు పాల్గొన్నారు.

తుదిదశలో శుద్ధీకరణ కార్యక్రమం

ఆత్మకూర్(ఎం): రెవెన్యూ దస్త్రాల శుద్ధీకరణ కార్యక్రమం తుదిదశకు చేరిందని జిల్లా పాలనాధికారి అనితా రామచంద్రన్ తెలిపారు. రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అసైన్డ్ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రక్షాళన కార్యక్రమంలో చేసిన సవరణలను ఇతర అంశాలను తుదిగా సరిచూసేందు తన బృందంతో పాటు జేసీ బృందాన్ని ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ప్రక్షాళన కార్యక్రమంలో ఏర్పడిన సమస్యలను ఈ బృందాలు పరిశీలించనున్నట్లు ఆమె వివరించారు. జిల్లాలో ప్రక్షాళన 92 శాతం పూర్తయ్యిందని, 42 వేల ఎకరాల భూముల్లో సమస్యలున్నాయని ఆమె వివరించారు. బునాదిగాని, ధర్మారం, పిలాయిపల్లి కాల్వల నిర్మాణానికి సర్వే పనులు తుదిదశలో వున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ జె.నర్సింహ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వికలాంగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మర్రిగూడ, న్యూస్‌టుడే: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మర్రిగూడ మండలం చర్లగూడెం జలాశయాన్ని బుధవారం ప్రవాస భారతీయులు సందర్శించారు. కోదాడకు చెందిన సుధీర్ జలగం, వరంగల్‌కు చెందిన రమేష్ దేసి, శ్రీకాళహస్తికి చెందిన కిరణ్‌కుమార్‌లు ఇక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. డిసెంబర్ 17న కేసీఆర్‌తో సమావేశమైన సందర్భంగా ప్రాజెక్టులు పరిశీలించాలని సూచించిన మేరకు ఈ జలాశయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. డీఈ దేవేందర్ రెడ్డిని కలిసి పూర్తి వివరాలు తీసుకున్నారు. జలాశయం వద్ద పరిహారం పెంచాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్న భూనిర్వాసితులను కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం దృష్టికి తీసుకువెళ్తామని వారికి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా శివన్నగూడలో ఫ్లోరోసిస్ బాధితుడు అంశల స్వామిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వికలాంగులకు రూ. వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చౌటుప్పల్ వద్ద మంజూరైన ఫ్లోరోసిస్ పరిశోధన కేంద్రానికి రూ.100 కోట్లు కేటాయించి నిర్మాణ పనుల ప్రారంభించాలని కోరారు. వారి వెంట ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి అధ్యక్షుడు కంచుకట్ల సుభాష్, సద్గుర్‌ప్రసాద్ ఉన్నారు.



ధర్నా చేస్తున్న నిర్వాసితులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎన్ఆర్ఐలు

ఆలేరు

గ్రామ సభలు

రాంలింగంపల్లి(బొమ్మలరామారం), న్యూస్‌టుడే: మండలంలోని రాంలింగంపల్లి, మల్యాల, రంగపురం తదితర గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకారించాలని ఆయా గ్రామ సర్పంచులు రమాదేవి, జయమ్మ, వెంకటేశం కోరారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని, హరిత హారం కార్యక్రమంలో మొక్కలు నాటి వాటిని పూర్తి స్థాయిలో రక్షించాలని, గ్రామంలోని ప్రతి ఇంటికీ మరుగు దొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులో ఉన్న దివ్యాంగుల కాలనీలో ప్రత్యేక కౌంటర్ ద్వారా పింఛన్ పంపిణీ వెసులుబాటును కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి బబ్బూరి శ్రీధర్ కోరారు. బుధవారం ఆ కాలనీ దివ్యాంగులతో కలిసి గుట్ట పంచాయితీ కార్యదర్శి కె.నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాములు, నంది ఎల్లయ్య, బ్రహ్మచారి, యాదమ్మ, బాలమ్మ, లక్ష్మి, రాములమ్మ, సత్తెమ్మ, సుగుణమ్మ తదితరులున్నారు.

దర్పణం



ఇరుకుగా ఉన్న రహదారిపై వెళ్తున్న భారీ వాహనాలు



రహదారిపై గుంత



ప్రమాదకరంగా రోడ్డు మార్జిను



భారీ వాహనాలు వెళ్తే.. లేచే దుమ్ము

ప్రమాదకరంగా రహదారి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని యాదగిరిగుట్ట-మల్లాపురం ప్రధాన రహదారి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తోంది. ఈ రహదారిలో ప్రయాణించాలంటే భయం భయంగానే ఉటోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రధానంగా రెడ్డి సత్రం నుంచి బోధానంద గోసేవ ఆశ్రమం వెళ్లే దారి వరకు దాదాపు 4 కిలోమీటర్ల దూరం ఉన్న రహదారి నిర్వహణ దారుణంగా ఉంది. ఒకే వరుసగా ఉన్న ఈ రహదారి పక్కనే రెండు వైపులా, మొలిచిన పిచ్చిమొక్కలు, గుంతలతో అధ్వానంగా తయారైంది. యాదాద్రి దేవస్థానానికి కావల్సిన మట్టి, ఇతర అవసరాలను భారీ వాహనాల ద్వారా ఈ రోడ్డు నుంచి తరలిస్తుంటారు. దీంతో నిత్యం రహదారి రద్దీ, వాహనాలు వెళ్లడం వల్ల వచ్చే దుమ్ము ప్రయాణికుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్డు చివర కుంచించుకుపోయి మార్జిన్స్ ప్రమాదంగా మారాయి. రహదారి విస్తరణ అదిగో, ఇదిగో అని రెండు సంవత్సరాలు కావొస్తున్నా.. అమలు కాలేదు. కనీసం తాత్కలికంగానైన రహదారి మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని రహదారి భవనాల శాఖ ఉన్నతాధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలేరు, న్యూస్‌టుడే: బహద్దూరుపేట: ఆలేరు మండలంలో బహద్దూరుపేట ఓడీఎఫ్ గ్రామంగా ప్రకటితమైన నేపథ్యంలో గ్రామ సర్పంచి జంపాల ధశరథ బుధవారం ప్రభుత్వ పరంగా హైదరాబాదులోని టీఎస్ అపార్డ్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

శారాజీపేట: శారాజీపేట శ్రీదుర్గ ఆటో యూనియన్ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షునిగా మార్గం అశోక్, ఉపాధ్యక్షునిగా కె.నర్సింహచారి, కార్యదర్శిగా కె.సిద్దేశ్వర్, కోశాధికారిగా జి.క్రిష్ణమూర్తి ఎన్నికయ్యారు.

కొలనుపాక: కొలనుపాక మార్కండేయ పద్మశాలి మరమగ్గాల కార్మిక సంఘం ఎన్నిక బుధవారం జరిగింది. కమిటీ అధ్యక్షునిగా అంకం రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్, కోశాధికారిగా వల్లాల బాలనర్సయ్య ఎన్నికయ్యారు.

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు జెడ్పీటీసీ సభ్యుడు బొట్ల పరమేశ్వర్ బుధవారం జిల్లా పాలనాధికారి అనితారామచంద్రన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

☛ ఆలేరు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఆవరణలో బుధవారం షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థినులు, యువతులు ధైర్యంగా ఉండాలని ఏఎస్ఐ క్రిష్ణయ్య, పీసీ రమ విద్యార్థులకు చెప్పారు

పల్లె కబుర్లు

తుర్కపల్లి, న్యూస్‌టుడే:

❐ **వీరారెడ్డిపల్లి:** క్షేత్రస్థాయిలో గ్రామ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఎంపీటీసీ సభ్యుడు యేశబోయిన రాజయ్య విమర్శించారు. మౌలిక వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు ప్రకటనలకే తప్పా ఆచరణకు నోచుకోవటం లేదన్నారు.

❐ **గంధమల్ల:** పంట రుణాలు ఏకకాలంలో మాఫీ చేయకుండా రైతులను తెరాస ప్రభుత్వం నట్టేట ముంచిందని పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ జూపల్లి చంద్రయ్య ఆరోపించారు. రుణాలు మాఫీ కాక తీసుకున్న అప్పు అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏక కాలంలో మాఫీ చేస్తే ప్రయోజనం చేకూరేదని తెలిపారు.

❐ **కోనాపూర్:** దయ్యంబండతండాను నూతన గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేయాలని గిరిజన నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, కిషన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కోనాపూర్ పరిధిలోని మంచిరోని మామిళ్ల గ్రామన్ని పంచాయితీగా చేస్తే తమకు అన్యాయం జరుగుతుందన్నారు.

❐ **ఇబ్రహింపూర్:** ప్రాథమికోన్నత పాఠశాలలో గదుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. సరైన గదులు లేక ఆరుబయట, చెట్ల కింద విద్యార్థులు కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటకొండూరు, న్యూస్‌టుడే: చాడ: చాడ గ్రామపంచాయతీ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెంలో గత ఆరునెలలుగా మురుగు కాలువలు శుభ్రం చేయకపోవటంతో దోమలు పెరిగి ప్రజలు రోగాల భారిన పడుతున్నారని వెంటనే వాటిని శుభ్రపరచాలని ప్రజలు కోరుతున్నారు.

వర్టూరు: గ్రామంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణం ఆలస్యమౌతుందని వెంటనే దాని నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

విద్యుత్తు సమాచారం

తుర్కపల్లి న్యూస్‌టుడే: ఈనెల 5 వరకు గ్రామాలలో మీటరు రీడింగ్ నమోదు చేస్తారు. విద్యుత్తు సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ఏఈ సత్యాచారి కోరుతున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న తెరాస మండల అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ ఉమారాణి

తుర్కపల్లి, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ సర్కార్ ముందుకు వెళ్తుందని తెరాస మండల పార్టీ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ పేర్కొన్నారు. వాసాలమర్రి గ్రామానికి చెందిన గరుదాసు సక్కుబాయి, లకావత్ వినోద్‌లకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన వైస్‌ఎంపీపీ పలుగుల ఉమారాణితో కలిసి బుధవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తూ ఆరోగ్య భద్రత కల్పిసున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తలారి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఎండి యాకూబ్, తెరాస నాయకులు పలుగుల నవీన్‌కుమార్, బీమరి కుమార్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

గుండాల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎంపీపీ సంగి వేణుగోపాల్ అన్నారు. బుధవారం గుండాలలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్థోమతలేని పేదలను ముఖ్యమంత్రి సహాయనిధి ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెరాస మండలాధ్యక్షుడు బండ రమేష్‌రెడ్డి, తెరాస నాయకులు మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్తు రైతులకు మేలు

గుండాల, న్యూస్‌టుడే: వ్యవసాయానికి నిరంతర విద్యుత్తుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ సంగి వేణుగోపాల్ అన్నారు. బుధవారం గుండాల విద్యుత్తు సబ్‌స్టేషన్ ముందు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. 24 గంటల విద్యుత్తు సరఫరాతో వ్యవసాయోత్పత్తులు పెరిగి రాష్ట్రం ఆర్థికంగా ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంతో తెరాస మండలాధ్యక్షుడు బి.రమేష్‌రెడ్డి, నాయకులు దశరథ, షర్ఫుద్దీన్, ప్రకాష్, బిక్షమయ్య, అబ్బులు, మల్లయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.


ఈ పాస్ విధానం ప్రారంభం

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలంలో రేషన్ సరకులను ఈ పాస్ విధానంలో అందించే ప్రక్రియను బుధవారం నాయబ్ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆలేరు పట్టణంలోని ఏడు రేషన్ దుకాణాల్లో ఈవిధానాన్ని ఆయన ప్రారంభించారు. రేషన్ సరకుల పంపిణీలో పారదర్శకత కోసమే ఈవిధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కందు శంకర్, వంగరి శివకుమార్, గుజ్జ అశోక్, దీపకళ తదితరులు పాల్గొన్నారు.



ఆలేరులో ఈ పాస్ విధానాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి

తెరాసకు గుణపాఠం చెప్పాలి: ఎంపీపీ



ధర్మారంలో కర పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్

తుర్కపల్లి, న్యూస్‌టుడే: వచ్చే ఎన్నికల్లో తెరాసకు గుణపాఠం చెప్పాలని ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్ ప్రజలకు పిలుపు ఇచ్చారు. బుధవారం ధర్మారం గ్రామంలో ఎన్నికల కర పత్రాలను ప్రజలకు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. తెరాస అప్రజాస్వామికమైన పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయమని ఆయన పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గడ్డమీది సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానావత్ శంకర్‌నాయక్, ఎంపీటీసీ సభ్యులు గుగులోతు బద్దునాయక్, యేశమైన రాజయ్య, ఎలగల రాజయ్య, ధనావత్ భాస్కర్‌నాయక్, లకావత్ రాజునాయక్, మోతీరాం, శివలాల్, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి, న్యూస్‌టుడే: పీఆర్టీయూటీఎస్ నూతన కాలమానిని బుధవారం మండల పరిషతు కార్యాలయం ఆవరణలో ఎంపీపీ బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చి దిద్దాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూటీఎస్ ముందంజలో ఉందని సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుజీవన్‌రావు, మాధవి తెలిపారు. ఉత్తమ సేవలకు మంచి గుర్తింపు ఉంటుందని ఎంపీడీవో జలందర్‌రెడ్డి, విద్యాధికారి కృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఈగ శ్రీనివాస్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మధుప్రకాష్, గోవింద్, భానులత, తదితరులు పాల్గొన్నారు.

గుండాల, న్యూస్‌టుడే: తెరాస కాలమానిని బుధవారం గుండాలలో ఎంపీపీ సంగి వేణుగోపాల్, జడ్పీటీసీ సభ్యుడు ఎం.రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తెరాస పనిచేస్తుందన్నారు. పార్టీ మాజీ మండలాధ్యక్షుడు చిందం ప్రకాష్, నాయకులు షర్ఫుద్దీన్, అనసూర్య, యాదగిరి, దశరథ, రాంమల్లు, వి.రమేష్, ఎ.బిక్షం, కృష్ణ, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్తు ప్రత్యేక సమావేశం

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ హరితహారం, స్వచ్ఛ భారత్ మిషన్, ఉపాధి హామీ పథకం పలు అంశాలపై చర్చించడానికి గురువారం గుట్ట మండల పరిషత్తు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లుగా ఎంపీడీవో సాంబశివరావు బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి జరగనున్న ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఆలేరు

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



గుట్టలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘం శ్రేణులు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆమె జయంతి వేడుకలు ఏర్పాటు చేశారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీ-మాస్ మండల కన్వీనర్ పోతరాజు జంగీర్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎరుకల వెంకటేశ్‌గౌడ్, బానోతు బిచ్చునాయక్, గుగులోతు దూప్‌సింగ్, నాగపురి సాయితేజ, కొక్కొండ లింగయ్య, గడ్డమీది నర్సింహ, సిల్వేరు దుర్గయ్య, ఎక్బాల్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

రాజపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ కళాశాలలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతిని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సోమసాని సురేందర్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు గుర్రం పాండు, నగేశ్, శ్రీను, కృష్ణ, రవి, పున్‌రాజ్‌సింగ్, అనిల్, కరుణాకర్, మాధురి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం టీమాస్ ఫోరం మండల కన్వీనర్ కొల్లూరి పాండు అధ్యక్షతన సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురుపంగ శివలింగం మాట్లాడారు. ఆమె సేవలను కొనియాడారు. మోటె అంజయ్య, పాండురంగయ్య, జయరాములు, బిక్షపతి, నాగరాజు, శ్రీశైలం, రాములు, గణేష తదితరులు పాల్గొన్నారు.

సోలిపేట(బొమ్మలరామారం), న్యూస్‌టుడే: సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాలను మండలంలోని సోలిపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో రమేష్, వెంకటేశ్, శ్రవణ్, మహేష్, వంశీ, రాజ్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం గుట్టలో బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో, మండలంలోని చొల్లేరులో ప్రధానోపాధ్యాయుడు వెల్లంకి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో వేరు వేరుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలహారాలు వేసి నివాళి అర్పించారు. జడ్పీటీసీ సభ్యులు కమలమ్మ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షులు గుర్రం వసంత, టీ మాస్ ఫోరం జిల్లా కన్వీనర్ కల్లూరి మల్లేశం, కాదూరి అచ్చయ్య, వెంకటరత్నం, వెంకటేశ్, పర్వతాలు, కౌడె మహేందర్, సుధ, రుక్కమ్మ, పోశెట్టి, నాగరాజు, గణేష్, నర్సింగ్‌రావు, సాంబేష్, షరీఫ్, ఐలయ్య, హుస్సేన్, భాస్కర్, లతీఫ్ పాల్గొన్నారు.

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరులో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బీఎస్పీ, తెరాస, బీసీ సంఘాల ఆధ్వరంలో వేర్వేరుగా జరిగాయి. ఈసందర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూల మాలలు వేశారు. నేటి యువతులు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుంటూ చదువుల్లో రాణించాలని.. ఉన్నతంగా ఎదగాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.అనసూర్య, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు మొరిగాడి శ్రీశైలం, ఆకవరం మోహన్‌రావు, బీజని మధు, పంతం క్రిష్ణ, సీహెచ్.సోమరుషి, కె.అంజనేయులు, జి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల(బొమ్మలరామారం), న్యూస్‌టుడే: సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని జాతీయ మహిళా కన్వీనర్ అరుణ అన్నారు. మండలంలోని మల్యాల గ్రామంలో కస్తూర్బా గురుకుల పాఠశాలలో సావిత్రి బాయి జయంతి ఉత్సవాలను బుధవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి ఆర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలో పని చేస్తున్న మహిళ ఉపాధ్యాయులకు పాఠశాలలో కనీస వసతులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మాధవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆలేరులో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళి

విద్యార్థులకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎస్సై బీసన్న, పాఠశాల కరస్పాండెంట్ నిడమనాల్

రాజపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మాంటిస్సోరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల తెలంగాణ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై బీసన్న ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా విద్యార్థులు ఆయారంగాల్లో మరింత రాణించాలన్నారు. ఎస్సై నుంచి సీఐగా పదోన్నతి పొందిన బీసన్నను పాఠశాల కరస్పాండెంట్ జోసెఫ్ నిడమనాల్ సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిద్దులు, రవి, సినీ, శాంతి, రమాదేవి, రాజేశ్, శోభ, రంజన తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన నిర్మాణానికి భూమి కేటాయించాలి

ఆలేరు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందువరుసలో ఉంటూ పోరాడిన ముదిరాజ్‌లను విస్మరించడం ప్రభుత్వానికి తగదని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొల్పుల హరినాథ్ చెప్పారు. ఆలేరులో బుధవారం జరిగిన ఆసంఘం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాదులో ముదిరాజ్ సంక్షేమ భవన నిర్మానానికి పది ఎకరాల స్థలాన్ని కెటాయించి, నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా నాణ్యతలేని చేప పిల్లలను సరఫరా చేయడంతో ముదిరాజ్ సహకార సంఘాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని కోరుతూ తీర్మానించారు. సంఘం నాయకులు శాగంటి క్రిష్ణ, పొన్నం శంకర్, మాటూరు సతీష్, రాజు, జెలేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్ష



రాజపేటలో రిలేదీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజపేట, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ, నిరసనగా బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలేదీక్షను చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు ఎర్రగుంట ప్రభాకర్ మాట్లాడుతూ వర్గీకరణ విషయమై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా సీఎం కేసీఆర్ చొరవ చూపాలన్నారు. దశల వారీగా ఉద్యమాలు చేపడుతున్న తమ నాయకున్ని అరెస్టు చేయడం దారుణమని అన్నారు. ఈవిషయమై ప్రభుత్వం తీరును అన్ని వర్గాలవారు వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. దీక్షలో రాంగళ్ల శ్రీను, కోయ ఉపేందర్, ప్రభాకర్, కనకయ్య, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ సంచుల పంపిణీ

మోటకొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆ శాఖ మండల అధికారిణి సుబ్బూరి సుజాత ఆధ్వర్యంలో రైతులకు ప్లాస్టిక్ డ్రమ్స్, జ్యూట్ సంచుల పంపిణీ బుధవారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరంపరాగత్ కృషి వికాస్ యోజనా పథకం కింద సేంద్రీయ వ్యవసాయంలో భాగంగా వానపాముల ఎరువు తయారీకి, వర్మిబెడ్స్, జీవామృతాల తయారీకి వీటిని వాడుతారని అన్నారు. వీటితోపాటు బయో ఫర్టిలైజర్, సూడోమోనాస్‌ను కూడా అందించామని చెప్పారు. పరంపరాగత్ కృషి వికాస్ యోజనా కింద సేంద్రీయ వ్యవసాయం చేయటానికి 50 మంది రైతులకు 100 శాతం సబ్సిడీపై అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైసస మండల, గ్రామ కన్వీనర్‌లు భూమండ్ల ఐలయ్య, ఆర్.నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, బాలరాజు, ఎల్లారెడ్డి, ఏఈలు ప్రణయ్‌రెడ్డి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో సేంద్రియ వ్యవసాయానికి కావాల్సిన వస్తువులను అందిస్తున్న వ్యవసాయ మండల అధికారిణి సుబ్బూరి సుజాత, తదితరులు

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

మోటకొండూరు, న్యూస్‌టుడే: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు, పదోన్నతులు తప్పవని యాదాద్రి ఏసీపీ శ్రీనివాసాచార్యులు అన్నారు. స్థానిక ఎస్సై అశోక్‌కుమార్ పదోన్నతిపై వెళ్తుండగా ఆయనకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కొద్దికాలంలోనే మోటకొండూరులో శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చారని అన్నారు. యాదగిరిగుట్ట సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ వంగపల్లి వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని చేసిన ఉద్యమంలో మోటకొండూరు వాసులపై నమోదైన కేసులు ఎత్తివేసేలా పై అధికారులతో మాట్లాడాతానన్నారు. మండల కేంద్రంలో రక్షకభట నిలయానికి సొంత భవనం నిర్మాణానికి ప్రభుత్వ భూమి గుర్తించటానికి తహసీల్దార్‌తో మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు, ఆత్మకూరు, యాదగిరిగుట్ట, తుర్కపల్లి ఎస్సైలు ఎం.నర్సింహులు, యాదగిరి, నాగిరెడ్డి, వెంకటయ్య, మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి మహోన్నతమైంది



తుర్కపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

తుర్కపల్లి, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మహోన్నతమైనవని అవి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తుర్కపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం 'భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, తల్లిదండ్రులను పూజించాలి' అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లక్ష్మీదేవి స్వరూపమైన తల్లిని పూజించినప్పుడే మనిషి జన్మ సార్థకమవుతుందని పేర్కొన్నారు. మానవతా విలువలు రోజురోజుకీ తరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను పూజిస్తూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టాలని, భావి తరాలకు ఆదర్శంగా నిలపాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, కవులు పెసరు లింగారెడ్డి, మెరుగు సదానందం, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్నకిష్టయ్య, ఉపాధ్యాయులు షబానా, పావని, విజయలక్ష్మి, నిర్మల, శ్రీనివాస్, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న షిరిడీ సాయి శతాబ్ది ఉత్సవాలు



నాగిరెడ్డిపల్లిలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గల శివశక్తి షిరిడీ సాయి అనుగ్రహ పీఠం(రమణేశ్వరం)లో షిరిడి సాయి శతాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం సిద్ధగురు రమణానంద మహర్షి ఆధ్వర్యంలో యజ్ఞ, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి భక్తులకు 'ఆధ్యాత్మిక జీవితం-పూర్ణత్వం' అనే అంశంపై అనుగ్రహ భాషణం చేశారు. సిద్ధగురువు ద్వారానే ఆధ్యాత్మిక జీవితం పరిపూర్ణమవుతుందన్నారు. పుణ్య పురుషుడు మంచి కార్యాలు తలపెడుతూ దైవచింతనతో ఉంటారని బోధించారు. అనంతరం ధార్మిక సేవ కార్యక్రమంలో భాగంగా వంద మంది పేదలకు పరుపులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, భవాని, శివానితోపాటు శిష్య బృందం పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

శాస్త్రోక్త పర్వాలతో
అధ్యయనం ముగింపు



అలంకరణలో శ్రీస్వామి అమ్మవారలు, హారతి నివేదన

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే:

ఆళ్వారులు రచించిన ప్రబంధాల పఠనం.. భగవత్ రామానుజాచార్యుల జ్ఞానబోధ.. ఆలయ దేవుడి అలంకరణలో శ్రీ స్వామి దర్శనంతో యాదాద్రీశుడి ఆలయ అధ్యయన వేడుకలకు బుధవారం శాస్త్రోక్తంగా తెరపడింది. ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజే మొదలైన ఈ విశిష్ట పర్వాలు ఆరురోజులపాటు కొనసాగాయి. వైష్ణవ ఆలయాల్లో అధ్యయన వేడుకల నిర్వహణ తప్పనిసరి. వీటి నిర్వహణ వల్లే క్షేత్ర మనుగడకు దోహదపడుతుందని ఆలయ పూజారులు తెలిపారు. వేకువజామున సుప్రభాతం చేపట్టాక పూజారులు ఆలయ మండపంలో భగవత్ రామానుజాచార్యుల ఆవిర్భావ పర్వానికి శ్రీకారం చుట్టారు. దివ్యప్రబంధాల పఠనంతో రామానుజుల ఆవిర్భావం చేపట్టి జ్ఞానబోధ పర్వాన్ని నిర్వహించారు. స్వయాన మహావిష్ణువు నమ్మాళ్వార్లు పరమపదించాక తన రూపాన్ని రామానుజులలో చొప్పించి జ్ఞానబోధన పర్వానికి తెరతీశారని ఆలయ ఆచార్యులు వెల్లడించారు. దీంతో అధ్యయనోత్సవాలకు తెరపడిందని,

లక్ష్మీ నారసింహుల సేవోత్సవం

క్షేత్ర ప్రాధాన్యత కలిగిందని పెద్దపూజారి లక్ష్మీ నరసింహాచార్యులు తెలిపారు. ఈ పర్వాలలో స్వామిని తన నిజస్వరూపం (లక్ష్మీనరసింహుడి)గా అలంకరించి సేవోత్సవాన్ని చేపట్టారు. అలంకార సేవను భక్తుల సందర్శనార్థమై మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపచేశారు. ఈ వేడుకల్లో ధర్మకర్త నరసింహమూర్తి, పేష్కార్ భాస్కర్‌శర్మ, ఏఈవో చంద్రశేఖర్, రామ్మోహన్‌రావు, పర్యవేక్షకులు రఘు, శివకుమార్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

ధనుర్మాస వేడుకల్లో..

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వేకువజామున గోదాదేవి చేపట్టిన వ్రతాన్ని పూజారులు ఆలయ సంప్రదాయంగా చేపట్టారు. శ్రీ పాండురంగ నాధుడిని వరిస్తూ స్తుతించే పర్వాలను పూజారులు నిర్వహించారు. గోదాదేవి పాశురపఠనం చేస్తూ పూలమాలలతో తన మనోవల్లభుడిని ఆరాధించే తతంగాన్ని నిర్వహిస్తూ విశిష్టతను వివరించారు.

నిత్య కైంకర్యాలలో భాగంగా బాలాలయంలోని ప్రతిష్ఠామూర్తులను ఆరాధిస్తూ సుప్రభాతం చేపట్టిన పూజారులు అభిషేకించి అర్చించారు. స్వర్ణపుష్పాలతో దర్శన మూర్తులకు అర్చన నిర్వహించారు. మహామండపంలో సహస్రనామ పఠనాల మధ్య అష్టోత్తరం చేపట్టారు. పుష్కరిణి చెంత గల గుళ్లో ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ పూజించారు. సహస్రనామార్చన నిర్వహించారు.



అలంకార సేవోత్సవంలో అర్చకులు

నేటి నుంచి కల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: అధ్యయనోత్సవాల సందర్భంగా నిలిపివేసిన శ్రీ లక్ష్మీనరసింహుల నిత్యకల్యాణం గురువారం నుంచి మళ్లీ మొదలవుతుంది. అధ్యయన వేడుకల్లో కల్యాణం, హోమాది పూజలను నిర్వహించడం సంప్రదాయ విరుద్ధం. ఆ క్రమంలో రద్దుపరిచిన దేవస్థానం గురువారం నుంచి తిరిగి చేపట్టేందుకు సన్నాహాలు చేపట్టింది. గురువారం నుంచి యథావిధిగా నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, శాశ్వత కల్యాణాలతోపాటు శ్రీ సుదర్శన నారసింహహోమం నిర్వహించనున్నట్లు ఈవో గీత తెలిపారు.

నిత్యరాబడి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ఖజానాలో బుధవారం వివిధ విభాగాల ద్వారా రూ. 5,90,084 నిత్యరాబడి పద్దు కింద జమయ్యాయని దేవస్థానం ఈవో ఎన్.గీత తెలిపారు. ఈ రాబడిలో ప్రధాన పూజలతో రూ. 7,206 ప్రత్యేక దర్శనాలతో రూ. 28,200, వ్రతాలతో రూ. 19,000, కల్యాణకట్టతో రూ. 14,000, అద్దె గదులతో రూ. 19,290, శాశ్వత పూజలు రూ. 10,116, అన్నప్రసాదంతో రూ. 19,480, ప్రసాదాల విక్రయంతో రూ. 3,67,960 మిగతావి వివిధ విభాగాల ద్వారా చేకూరాయని ఈవో వివరించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి
కలెక్టరేట్ ఎదుట టీఎస్ ఎమ్మార్పీఎస్ ధర్నా



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన టీఎస్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

భువనగిరి, న్యూస్‌టుడే: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి డారు. ఎస్సీ వర్గీకరణ అఖిలపక్షాన్ని దిల్లీకి కేంద్రం మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌ఛార్జి చిలకమారి గణేశ్ మాదిగ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కులవృత్తులనే నమ్ముకున్న మాల, మాదిగ ఉపకులాల వారికి నెలకు రూ. 2వేల పింఛన్ అందించాలన్నారు. దళితులకు మూడెకరాల భూమి పంపిణీ విషయంలో ప్రభుత్వం యంత్రాంగాన్ని వేగవంతంచేసి భూమి కొనుగోలు చేయాలని కోరారు. రెండు పడక గదుల ఇళ్లను జనాభా దామాషా ప్రకారం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రదర్శనగా వచ్చి ధర్నా నిర్వహించి కలెక్టర్ అనితారామచంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కందుల రామన్ మాదిగ, ఉపాధ్యక్షుడు కొమ్ము ప్రకాష్, స్వామి, నాగరాజు, ప్రధాన కార్యదర్శి గంగాపురం రాములు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైంది

పులిగిల్ల (వలిగొండ), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. పులిగిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన పెండెం లక్ష్మీనారాయణ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వరంగ విద్యావిధానాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. చక్కటి విద్యాబోధనతో విద్యార్థులను భావిభారతపౌరులుగా తీర్చిదిద్దే గురుతరమైన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, ఉపేందర్‌రావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, యాదయ్య, రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

7న ఆయుత ధర్మ దీక్ష

ఆత్మకూర్(ఎం), న్యూస్‌టుడే: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించే ఆయుత ధర్మ దీక్షను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.భాస్కర్ కోరారు. బుధవారం ఆత్మకూర్‌లో ధర్మదీక్ష గోడ పత్రికను ఆవిష్కరించి, సీపీఎస్‌ను రద్దు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అశోక్, కనకయ్య, నాయకులు డి.రవి, సోమయ్య, కె.శ్రీనివాస్, సంధ్య, అనిత, కృష్ణవేణి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

వలిగొండకు చేరిన పాదయాత్ర

వలిగొండ, న్యూస్‌టుడే: మహారాజ్ మహాకాలినడక యాత్ర బుధవారం వలిగొండకు చేరుకుంది. దళిత్‌శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో ఆరు నెలలుగా 5వేల కి.మీ మహాకాలినడక పూర్తి చేసినట్లు యాత్ర సమన్వయకర్త దుర్గాప్రసాద్ తెలిపారు. మహాదిగ విద్యావంతులు తమ పూర్వికుల జ్ఞానాన్ని అధ్యయనం చేయాలని జ్ఞానంతో వ్యక్తిత్వ నిర్మాణం చేసుకుని ఆత్మగౌరవంతో బతకాలని పేర్ల చివరన మహారాజ్, స్త్రీలకు మహారాణి అని నామకరణం చేయటమే పాదయాత్ర ఉద్దేశమని విశారధన్ మహారాజ్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రవీందర్, రమేశ్, అంజయ్య, సురేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.



విశారధన్ మహారాజ్‌కు నుదిట తిలకం దిద్దుతున్న మహిళలు

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ

✧ మండల స్థాయిలో ఎంపిక చేయనున్న కమిటీ

✧ మార్గదర్శకాలు జారీ



పుట్టగూడెంలో అసైన్డ్ భూముల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా పాలనాధికారి అనితా రామచంద్రన్ (పాతచిత్రం)

రాజపేట, న్యూస్‌టుడే: పరాధీనంలోని అసైన్డ్ భూములను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వాటి విషయంలో ముందడుగు వేసింది. చేతులు మారిన అసైన్డ్ భూములు నిరుపేదల చేతిలో ఉంటే తిరిగి వారికి రీ అసైన్డ్ చేసేలా నిర్ణయం తీసుకుంది. దీనిపై మార్గదర్శకాలను జారీచేసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని 16 మండలాల్లో 8,03,036 ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. వీటికి సంబంధించి 7,94,547 సర్వేనంబర్లు ఉన్నాయి. ఇందులో 16,380 ఎకరాలు అసైన్డ్ భూమి ఉండగా, ఇప్పటివరకు వివిధ దశల్లో 10,333 ఎకరాలు పంపిణీ చేశారు. అందులో 7,484 ఎకరాలు లబ్ధిదారుల చేతిలో.. మిగతావి ఇతరుల వద్ద ఉన్నట్లుగా రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు సమాచారం. వందల ఎకరాల అసైన్డ్ భూములు చేతులు మారినట్లు తెలుస్తోంది. నిరుపేదలకు ధీమాను ఇచ్చే ఉద్దేశంతో గత ప్రభుత్వాలు అసైన్డ్ భూములను పంపిణీ చేశాయి. గతంలో నియమించిన అసైన్డ్ కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ భూములను పంపిణీ చేశాయి. అయితే చాలాచోట్ల రాజకీయ నాయకుల ప్రాబల్యం కారణంగా తమ అనుయాయులకు, అధికారుల స్వలాభ ఆపేక్ష కారణంగా అనర్హులకు కట్టబెట్టారనే విమర్శలు ఉన్నాయి.

పాలనాధికారికి పుట్టగూడెం వాసుల మొర

ఇటీవల రాజపేట మండలం పుట్టగూడెంలో నిర్వహించిన భూస్త్రాల నవీకరణ సమావేశానికి జిల్లా పాలనాధికారి అనితా రామచంద్రన్ హాజరయ్యారు. గ్రామ శివారులోని పులిగుట్ట 569 సర్వేనంబర్‌లో సుమారు 433 ఎకరాలుండగా దశలవారీగా 200 మందికి పంపిణీ చేశారని గిరిజనులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రెవెన్యూ అధికారుల చర్యల కారణంగా అనర్హులకు అసైన్డ్ భూములను కట్టబెట్టారని ఆరోపించారు. ఏళ్ల తరబడి కబ్జాలో ఉండటంలేదని, అర్హులైన పేదలు ఎంతోమంది ఉన్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై రీ సర్వే చేయించి అనర్హులకు నోటీసులు ఇచ్చి విచారణ తదుపరి అర్హులైన పేదలకు అందించే విషయం పరిశీలిస్తామన్నారు. లబ్ధి పొందిన అర్హులు సైతం స్థానికంగా ఉండక ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లడం, ఆర్థిక అవసరాలకు తమ భూములను ఇతరులకు విక్రయించిన సంఘటనలు జిల్లాలో అక్కడక్కడా ఉన్నాయి. సాగు యోగ్యంగా లేక, సరైన వనరులు అందుబాటులో లేవని చాలా మంది ఇతరులకు నామమాత్రం ధరలకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

కమిటీ నిర్ణయమే అంతిమం

చేతులు మారిన అసైన్డ్ భూములకు సంబంధించి మండల స్థాయిలో అసైన్డ్ కమిటీ నిర్ణయం తీసుకోనుంది. స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో పనిచేసే ఈ కమిటీ చేతులు మారిన అసైన్డ్ భూముల దరఖాస్తులను పరిశీలించనుంది. అన్ని నిబంధనలు పక్కాగా ఉంటే ఈ కమిటీ ఆమోద ముద్ర వేస్తుంది. తదుపరి వీరికి చట్టబద్ధత కల్పించి సదరు భూమిని రీఅసైన్డ్ చేస్తారు. లేనిపక్షంలో ప్రభుత్వం సదరు భూమిపై తదుపరి చర్యలు తీసుకోనుంది.

నూతన నిబంధనలు ఇవీ..

అసైన్డ్ భూముల విషయమై ఏం చేస్తారనే దానికి ఇన్నాళ్లు సందిగ్ధం ఉండేది. తాజాగా వీటిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా పలు నిబంధనలను జారీ చేసింది. త్వరలో అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ప్రారంభించే అవకాశం ఉంది. లబ్ధిదారుల నుంచి భూమిని కొనుగోలు చేసిన వారు నిరుపేదలై (బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారై) ఉండాలి. కొనుగోలు చేసిన భూమిలో 5 ఎకరాల లోపు మెట్ట, 2 ఎకరాల లోపు సాగు యోగ్యమైన భూమి ఉండాలి. విక్రయించిన వ్యక్తులు తాము ఫలానా వ్యక్తికి విక్రయించామని అసైన్డ్ కమిటీకి స్పష్టంగా తెలపాల్సి ఉంటుంది. 2007కు ముందు భూమిని కొనుగోలు చేసి ఉండాలి. క్రయ విక్రయాలకు సంబంధించి పక్కా ఆధారాలు ఉండి తీరాలి.

నిబంధనలకు విరుద్ధంగా చేతులు మారిన భూములు

అసైన్డ్‌మెంట్ చట్టం ప్రకారం లబ్ధిదారులు తమ భూమిని ఇతరులకు విక్రయించరాదు. నోటిమాట, రాతపూర్వకంగా ఇతరులకు భూమిని బదిలీ చేయరాదు. పైగా ఈఖాయిదా కూడా రిజిస్ట్రేషన్ చేసే వీలులేదు. పూర్వ జిల్లాలో చాలా చోట్ల ఇలాంటి భూములపై పలు లావాదేవీలు జరిగాయి. ఒకరి నుంచి మరొకరికి ఇలా ఐదు మందికిపైగా చేతులు మారినవి చాలా ఉన్నాయి. వీటన్నింటికీ సంబంధించి సర్వేలో అధికారులు ప్రత్యేకంగా పొందుపర్చినట్లు తెలుస్తోంది.

మరింత స్పష్టత వస్తేనే..

క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వం నుంచి మరింత స్పష్టత రావాల్సిన అవసరం ఉందని అధికారుల భావిస్తున్నారు. స్వావానికి అమ్మిన వ్యక్తులు అసైన్డ్ కమిటీ ముందు వచ్చి చెప్పడం అంత సులువైన విషయం కాదు. పైగా అమ్మిన వ్యక్తుల్లో చాలా వరకు మరణించిన వారున్నారు. ఇలాంటి అంశాల్లో ఏ మేరకు చర్యలు తీసుకోవాలన్నది స్పష్టత లేదు. దీంతో ప్రభుత్వం నుంచి తదుపరి మార్గదర్శకాలు వచ్చిన తర్వాతనే క్రమబద్ధీకరణ అంశం కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తుంది.

వివరాలు సేకరిస్తున్నాం..

చెన్నోజు రామమూర్తి, తహసీల్దారు: రాజపేట



భూ దస్త్రాల ప్రక్షాళనలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న సమావేశాల్లో అసైన్డ్ భూముల లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నాం. లబ్ధి పొందినవారు, విక్రయించిన వారి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేపడుతున్నాం. ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. వచ్చిన తదుపరి కార్యాచరణ చేపడతాం.

పాతాళానికి 'గంగ'.. యాసంగికి బెంగ

(మొదటి పేజీ తరువాయి) పరిణాన్ని పూర్తయ్యాయి. తెలంగాణ సర్కారు రైతులకు ఉచితంగా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రానున్న రోజుల్లో మోటార్లు నిరంతరాయంగా నడిచే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి నుంచే రైతులు సరైన విధంగా జాగ్రత్తలు తీసుకోకుంటే యాసంగి పంట చేతికి వచ్చే అవకాశం చాలా వరకు తక్కువేనని అధికార వర్గాలే హెచ్చరిస్తున్నాయి. మరో వైపు తెలంగాణ రాష్ట్రంలో చూస్తే ఉమ్మడి జిల్లాలోనే వ్యవసాయ పంపుసెట్లు అధికంగా ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 3.83 లక్షల పంపు సెట్లు ప్రస్తుతం మనుగడలో ఉన్నాయి. గత మే 27 నుంచి వ్యవసాయానికి ప్రయోగాత్మకంగా చేపట్టిన 24 గంటల విద్యుత్ సరఫరాతో అన్ని మండలాల్లో గతంతో పోలిస్తే దాదాపు రెండు నుంచి మూడు మీటర్లలోపు భూగర్భజలాలు అడుగంటి పోయాయి. నవంబరు రెండో వారం నుంచి డిసెంబరు చివరి వరకు 24 గంటల విద్యుత్ సరఫరా నిలిపేయడంతో పరిస్థితి కొంత ఆశాజనకంగా మారింది. మళ్లీ ఈ నెల మొదటి నుంచి రాష్ట్రమంతా విద్యుత్ సరఫరాను నిరంతరం చేయడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో నీటి సంక్షోభం తారా స్థాయికి చేరుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకరిని చూసి మరొకరు

ఉచితంగా విద్యుత్తు సరఫరా ఉండటంతో రైతులు ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో అవసరం లేకున్నా పంపుసెట్లను 24 గంటల పాటు నడిపిస్తున్నారు. ఒక వేళ అవసరం లేదని మోటారును నిలిపేస్తే బావిలోని నీటి ఊటలు పక్క బోరు పంపులోకి మళ్లుతాయనే భావన రైతుల్లో నెలకొంది. స్టార్టర్లకు ఆటోమేటిక్ పరికరాలను తొలగించాలని ఒక పక్క ప్రభుత్వ అధికారులు ప్రచారం చేస్తున్నా రైతులు మాత్రం ఇప్పటివరకు తొలగించింది నామమాత్రమే. బోర్లలో నీటి లభ్యత లేకుంటే మోటార్లు అనవసరంగా నడిచి పాడయ్యే ముప్పు ఉన్నా రైతులు మాత్రం వారి పంపుసెట్లను ఆపడం లేదు. విద్యుత్ అధికారులు సహా మూడు జిల్లాల అధికార యంత్రాంగం ఆటోస్టార్టర్ల పరికరాల తొలగింపుతో సహా భూగర్భజల మట్టాలపై అవగాహన కార్యక్రమాలను చేపడితేనే ఎంతో కొంత ప్రయోజనం ఉండే అవకాశం ఉంది. లేదంటే వేసవికి ముందే నీటి కటకటను ఎదుర్కొక తప్పదు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ఉమ్మడి రాష్ట్ర వర ప్రదాయిని అయిన నాగార్జున సాగర్‌లో నీటిమట్టం ఆశాజనకంగా ఉండటంతో ఆయకట్టులోని రైతులందరూ వరి పంట సాగు పైనే మొగ్గుచూపుతున్నారు. అధికారులు ఆరుతడి పంటలకు మాత్రమే నీళ్లిస్తామని చెప్పినా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

దళితులపై దాడులు అమానుషం

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో దళితులపై జరుగుతున్న దాడులు అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ కల్లూరి మల్లేశం అన్నారు. దాడులకు నిరసనగా బుధవారం గుట్టలో స్థానిక నాయకులతో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. పూణేలో శాంతియుతంగా చేపట్టిన ర్యాలీపై మతోన్మాదశక్తులు, అగ్రవర్ణాలు పథకం ప్రకారమే ఈ దారుణానికి ఒడిగట్టడం దారుణమన్నారు. వారి నిజస్వరూపం చాటుకున్నారని విమర్శించారు. కాదూరి అచ్చయ్య, బెజుగం నాగరాజు, ఇమామ్, లతీఫ్, వసంత, వెంకటేశ్, రామచంద్రు, నర్సింగరావు, నాగమణి, సాంబేష్, అశోక్‌చారి, ఐలయ్య, హుస్సేన్ తదితరులున్నారు.

అక్షరం మార్పుతో భూములు తారుమారు

(మొదటి పేజీ తరువాయి) సర్వే నెంబర్లు ఒకే విధంగా ఉన్నాయి. ఈ రెండు గ్రామాల మొదటి అక్షరం మారితే చౌటుప్పల్ గ్రామం గట్టుప్పల్‌గా మారిపోతుంది. గట్టుప్పల గ్రామం చౌటుప్పల్‌గా తయారవుతుంది. 1990 ఫిబ్రవరి 22న అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రంలో నల్గొండ జిల్లాలో వక్ఫ్ ఆస్తుల వివరాల ప్రకటనలో గట్టుప్పల్‌కు ముందున్న ఆంగ్ల అక్షరం 'జీ'కి బదులుగా 'సి' ముద్రించడంతో చౌటుప్పల్‌లోని 71.6 ఎకరాల పట్టాభూములు వక్ఫ్ భూముల జాబితాలోకి చేరిపోయాయి. గట్టుప్పల్‌లో వక్ఫ్‌బోర్డు జాబితాలోంచి 71.6 ఎకరాల భూములు మాయమైపోయాయి. చౌటుప్పల్‌లోని పట్టా భూముల్లో నిర్మాణాలు చేసుకున్న ప్రజలు ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్‌ల అధికారులకు మొర పెట్టుకున్నారు. గట్టుప్పల్‌లోని ముస్లింలు సైతం తమ గ్రామంలోని వక్ఫ్ భూములు జాబితాలో కనిపించడం లేదని గగ్గోలు పెట్టారు. రెండు గ్రామాల వారూ రాజపత్రంలో గట్టుప్పలకు బదులు చౌటుప్పల్‌గా నమోదైందని, సవరించాలని కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. 'అక్షర దోషాన్ని' సవరించాలని రెండు గ్రామాల వారు ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ, వక్ఫ్ బోర్డు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

మా మసీదు భూములు పోయాయి

– మహ్మద్ రబ్బాని, ముతవలి, గట్టుప్పల్



గట్టుప్పల్‌లో 1995లో జిల్లా వక్ఫ్‌బోర్డు అధికారులు మసీదు పేరిట 90 ఎకరాల వరకు భూములున్నాయని చెప్పారు. 2001లో నేను ఆ అధికారులను కలిసి భూముల వివరాలు అడిగాను. అందులో 71.6 ఎకరాల భూములు అంతకు ముందున్నవి మాయమయ్యాయి. ఇదేమని అడిగితే గెజిట్‌లో గట్టుప్పల్ బదులు చౌటుప్పల్ అని మారిందని చెప్పారు. వెంటనే మా మసీదు కమిటీ తరపున జిల్లా కలెక్టర్‌కు, వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటికీ పొరపాటును సరిచేయలేదు. 2016 మే నెలలో సమాచార హక్కు చట్టం కింద వక్ఫ్‌బోర్డు కమిషనర్‌కు దరఖాస్తు చేశాం. గట్టుప్పల మసీదు భూముల నక్షాతో సహా వారి పాత దస్త్రాల్లో ఉన్న వివరాలను ఇచ్చారు. వీటి ద్వారా అక్షరం తప్పుతో భూములు తారుమారయ్యాయని తెలుస్తోంది.

భూ దస్త్రాల శుద్ధీకరణలో దరఖాస్తు చేశాను

– సిలువేరు శ్రీనివాస్, బాధితుల సంఘం కన్వీనర్, చౌటుప్పల్

రాజపత్రంలో ముద్రించిన అక్షర దోషంతో చౌటుప్పల్‌లోని 71.6 ఎకరాల పట్టాభూములు వక్ఫ్ భూముల జాబితాలోకి మారిపోయాయి. స్థానికంగా నా ప్లాటు రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడు ఈ విషయం తెలిసింది. ఈ భూముల్లో ఇళ్లు, ప్లాట్లు ఉన్న వాళ్లం 500 మందికి పైగా ఉన్నాం. రిజిస్ట్రేషన్లు కాకపోవడం, బ్యాంకు రుణాలు నిలిచిపోవడంతో అందరం కలిసి బాధితుల సంఘం ఏర్పాటు చేసుకున్నాం. స్థానిక తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్, వక్ఫ్‌బోర్డు కమిషనర్ వరకు కలిసి ప్రభుత్వ యంత్రాంగం ద్వారా జరిగిన పొరపాటును సరిదిద్దాలని విన్నవించుకున్నాం. కొన్ని సంవత్సరాలుగా తిరుగుతూనే ఉన్నాం. ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి భూదస్త్రాల శుద్ధీకరణ కార్యక్రమంలో దరఖాస్తు చేశాం.



పరిశీలించి నివేదిక పంపిస్తాం

– ఎస్.సూరజ్‌కుమార్, ఆర్డీవో, చౌటుప్పల్



చౌటుప్పల్‌లోని బాధితులు నాకు వినతిపత్రం సమర్పించారు. గట్టుప్పల్‌కు బదులుగా చౌటుప్పల్ పేరు నమోదు కావడం వల్ల సమస్యలొస్తున్నాయని తెలిపారు. మా రెవెన్యూ కాస్రా పహాణీలు, గట్టుప్పల్‌లోని దస్త్రాలు, వక్ఫ్‌బోర్డు దస్త్రాలు పరిశీలించి సమగ్రమైన నివేదికను ప్రభుత్వానికి పంపుతాం. భూదస్త్రాల శుద్ధీకరణ నివేదికలో వక్ఫ్ భూముల జాబితా పక్కన 'రిమార్కులు' రాయాలని తహసీల్దార్లకు సూచనలిచ్చాను.

నవ పిల్లర్లు

భవనాలు... నదులపై ఆనకట్టలు. పై వంతెనలు... పెద్ద పెద్ద డ్యామ్‌లు... ఇలా ప్రతి కట్టడంలోనూ సివిల్ ఇంజినీరింగ్ నిపుణుల పాత్ర కీలకం. అందుకే వారిని దేశానికి పిల్లర్లుగా పేర్కొంటారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంజినీరింగ్ కళాశాలల్లోని సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓ ప్రత్యేకత ఉంది. స్థానిక పరిశోధనశాలల్లో ఈ భావి భారత ఇంజినీర్లు చేసే ప్రయోగాలు వారిని ముందు వరుసలో నిలుపుతున్నాయి. అందుకే నిర్మాణ రంగంలోని వారు ఏరికోరి మరీ ఇక్కడి విద్యార్థుల్ని తమ సంస్థలో ఉద్యోగులుగా చేర్చుకుంటున్నారు. మరికొద్ది నెలల్లో పరీక్షలు రాసి భవిష్యత్తు వైపు పరుగులిడుతున్న బీటెక్ ఫైనల్ ఇయర్ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఎంతో ఆశావహ దృక్పథంతో ఉన్నారు. నల్గొండ పరిధిలోని ఇంజినీరింగ్ విద్యార్థులతో 'న్యూస్‌టుడే' కొద్దిసేపు ముచ్చటించింది. ఊపు మీదున్న నిర్మాణ రంగంపై ప్రయోగాలు చేస్తూ ఆధునిక వసతుల కల్పన దిశగా సాగిపోతామని చెబుతున్నారు. ఇంజినీర్ విద్యార్థుల ఆలోచనలు.. ప్రస్తుతం వారికున్న ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం.

–నల్గొండ టౌన్, న్యూస్‌టుడే:

- నిర్మాణ రంగంలో కొత్త ఆలోచనలు
- ఉన్నత ఉద్యోగాల సాధన వైపు సివిల్ విద్యార్థుల అడుగులు





భవనాలు, వంతెనలు ఇలా నిర్మాణ రంగంలో సివిల్ ఇంజినీర్లదే కీలకపాత్ర. వీరిచ్చే ప్రణాళిక, సలహాలు, సూచనలకు అనుగుణంగానే భవనాలు నిర్మితమవుతుంటాయి. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న భారీ ప్రాజెక్ట్‌లో వేటిని తీసుకున్నా ఏళ్లపాటు అలరాడే కట్టడాల వెనుక సివిల్ ఇంజినీర్ల పాత్ర ఎంతో ఉంటుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 30 ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. వీటిలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు 3వేలకు పైగానే ఉన్నారు. ఈ ఏడాది సుమారు వెయ్యి మంది వరకు తమ కోర్సు పూర్తిచేసుకుని ఇంజినీరింగ్ పట్టాతో బయటకు రానున్నారు.

బోలెడు అవకాశాలు

సివిల్ ఇంజినీరింగ్ పూర్తవ్వగానే ఉపాధి కోరుకునే అభ్యర్థులకు నేటి రోజుల్లో అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. పలు కంపెనీ ప్రతినిధులు నేరుగా కళాశాలలకు వచ్చి వారికి నచ్చిన అభ్యర్థులను ప్రాంగణ ఎంపికలో ఎంపిక చేసుకుంటున్నారు. వారికి ముందుగా శిక్షణ ఇచ్చి అనంతరం వెంటనే ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఆయా కంపెనీల్లో ఉద్యోగాన్ని బట్టీ రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కళాశాలల్లో ప్రయోగాలతో విద్యనభ్యసించి, చదువు పూర్తవ్వగానే భవిష్యత్తులో సివిల్ ఇంజినీర్‌గా ఎలా స్థిరపడాలన్నా అంశంపై తర్ఫీదు పొందుతున్నారు. ఇక్కడి సివిల్ విద్యార్థులకు మంచి పేరుంది. వీరు తమ కంపెనీలకు ఉపయోగపడుతారంటూ పలు కంపెనీల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి వారిని ఎంపిక చేసుకుంటుండటం కొసమెరుపు.

సాంకేతికతతో దేశం అభివృద్ధి

–సీహెచ్.శిల్ప, సివిల్ ఫైనల్ ఇయర్



సాంకేతికపరంగా మన దేశం ఇంకా అభివృద్ధి చెందాలి. ముందు పెద్ద చదువులు చదివి సివిల్ రంగంలో ఉన్నత స్థాయికి చేరాలన్నది నా అభిలాష. అమెరికా, జపాన్ వంటి దేశాలు సాంకేతికంగా అభివృద్ధి చెందాయి. ఆయా దేశాలకు దీటుగా మనం తిరుగులేదని నిరూపించాలి. ఆ పనిలో నేనే భాగస్వామి కావాలన్నది నా ఆశ.

నిర్మాణ రంగంపై దృష్టి

–జి.స్వప్న, సివిల్ ఫైనల్ ఇయర్



నా దృష్టంతా బీటెక్ పూర్తిచేయడంపైనే. ఆది పూర్తయ్యాక నిర్మాణ రంగంపై దృష్టి కేంద్రీకరిస్తాను. సాధారణంగా కళాశాలలో ప్రాక్టికల్స్‌కు జరుపుతున్నా పరిశోధనశాలలు ఎక్కడ ఉండవు అనుకుంటాను. మా కళాశాలలో సాయిల్ టెస్టింగ్, కాంక్రీట్ టెస్టింగ్, ఆటోక్యాడ్, సర్వేయింగ్, జీయాలజీ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకుంటున్నాను. మంచి ఉత్తీర్ణత శాతం మార్కులతో పాసై భవిష్యత్తులో నిర్మాణరంగంలో సాఫ్ట్‌వేర్ డిజైనింగ్ వైపు వెళ్లాలని అనుకుంటున్నాను.

సివిల్ విద్యార్థులకు అవకాశాలు పుష్కలం

–మహ్మద్ షాబాజ్, సివిల్ హెచ్‌వోడీ



సివిల్ ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. డిప్లొమా పూర్తవ్వగానే పురపాలికశాఖ కార్యాలయంలో పేరు నమోదు చేసుకుంటే లైసెన్స్ సర్వేయరుగా సర్టిఫికెట్ పొందుతారు. అది ఉంటే భవనాలు, అపార్ట్‌మెంట్లకు ప్లాన్లు ఇవ్వవచ్చు. అంచనాలు వేయవచ్చు. అపార్ట్‌మెంట్స్‌లో ఇంటీరియల్ డెకరేషన్‌లు చేయవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వేయర్లుగా ఉద్యోగం చేయవచ్చు. ఆర్థికంగా ఉంటే ఇటుకలు, టైల్స్ తయారీ పరిశ్రమ వంటివి వీరే నెలకొల్పవచ్చు. కేంద్ర ప్రభుత్వ పరంగా రైల్వే, ఆర్ఆర్‌బీ, మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసు, సీపీడబ్ల్యూడీ (సెంట్రల్ పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంట్)లలో అసిస్టెంట్ ఇంజినీర్లుగా ఉద్యోగాలు పొందవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలైతే ఆర్అండ్‌బీ, సాగునీటిశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ప్రజారోగ్య శాఖ, పురపాలికల్లో సహాయ ఇంజినీర్లుగా విధులు నిర్వహించవచ్చు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చు. బ్యాంకుల తరపున నిర్మాణాల పరిశీలనకు సివిల్ ఇంజినీర్ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ విడుదల చేయనున్న పలు ఉద్యోగ ప్రకటనల్లో సివిల్ విద్యార్థులకు మంచి అవకాశాలున్నాయి.

ఉత్తమ సివిల్ ఇంజినీర్ అవుతా

–లవకుమార్, సివిల్ ఫైనల్‌ఇయర్



ఉత్తమ సివిల్ ఇంజినీర్ గుర్తింపుపొందాలన్నదే నా కల. అందుకే ఈ బ్రాంచ్‌ను ఎంచుకున్నాను. ప్రస్తుతం మన దగ్గర మురుగు కాల్వ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీన్ని పూర్తిగా మార్చివేసి కొత్త డ్రైనేజీ వ్యవస్థను తీసుకురావటంపై దృష్టిసారిస్తున్నాను.

భవనాల నిర్మాణం ఆకట్టుకునేలా..

–షేక్ ఆరీఫ్, సివిల్ ఫైనల్‌ఇయర్



మాకున్న ఆటోక్యాడ్ ల్యాబ్‌లో బిల్డింగ్ డిజైన్ బాగా నేర్చుకున్నాను. దీనిద్వారా మంచి డిజైన్లు, మోడల్స్ రూపకల్పనపై దృష్టి సారిస్తాను. సాగునీటి రంగం అంటే మక్కువ. పల్లెల్లో పొలాలకు నీటిని మళ్లించే డిజైన్లు రూపొందిస్తాను.

మద్యం దొరకదు.. మలినం కనిపించదు..!

- నాలుగేళ్లుగా మద్యపాన నిషేధం అమలు
- వంద శాతం ఇంటి పన్నుల వసూళ్లు
- ఆదర్శంగా నిలుస్తున్న శ్రీరంగాపురం

ఆదర్శం

నడిగూడెం, న్యూస్‌టుడే:

ఒకవైపు ఆధ్యాత్మికతను పెంచుతూ.. మరోవైపు మద్యపాన నిషేధాన్ని నాలుగేళ్లుగా అమలుచేస్తూ శ్రీరంగాపురం ఆదర్శ గ్రామంగా నిలుస్తోంది.. 1300 మంది జనాభా, 900 మంది ఓటర్లు, 330 నివాస గృహాలున్నాయి. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమల్లో ఉంది. స్థానిక యువకులు, గ్రామస్థులు కలిసికట్టుగా దీన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నారు. నాలుగేళ్ల వ్యవధిలో రూ.20 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఒకటి, రెండు వీధులు మినహా ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లే దర్శనమిస్తాయి. గతంలో రెండు పర్యాయాలు గ్రామస్థులు పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకుని ఐక్యతను చాటుకున్నారు. అభివృద్ధికి పునాదులు వేసుకున్నారు. మరోవైపు దాతలు, భక్తుల విరాళాలతో దేవాలయాలు, కళ్యాణ మండపాలు, గోశాల ఏర్పాటుతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. దాతల విరాళంతో గ్రామంలో మొదటగా ఆంజనేయస్వామి దేవాలయం నిర్మించారు. తదుపరి గ్రామస్థులు, భక్తుల విరాళంతో సాయిబాబా మందిరం నిర్మించారు. గోశాల ఏర్పాటు చేశారు. ప్రతి గురువారం ఇక్కడ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్ని పండుగలు, పర్వదినాల్లో ఉత్సవాలు జరుపుతారు. హరితహారంలో భాగంగా గ్రామంలో రహదారులకు రెండు వైపులా, పాఠశాల, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని సంరక్షిస్తున్నారు.



సీసీ రహదారులతో స్వాగతం పలుకుతున్న శ్రీరంగాపురం

రూ.50లక్షలతో కల్యాణ మండపం నిర్మాణం

దేవాలయం ఎదురుగా గ్రామ సర్పంచి కొల్లు రామారావు రూ.50 లక్షలతో కల్యాణ మండపం నిర్మించారు. తక్కువ ఖర్చుతో ఇక్కడి ప్రజలు శుభకార్యాలు, కల్యాణాలు చేసుకునేందుకు విశాలమైన మండపం అందుబాటులోకి వచ్చింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం ఇక్కడ శుభకార్యాలు జరుపుకొంటున్నారు. సామన్యులకు సైతం అందుబాటులో ఉండేలా కనీస నిర్వహణ ఖర్చులు మాత్రమే వసూలు చేస్తున్నారు.



దాతల విరాళంతో నిర్మితమైన సాయి మందిరం

రూ.3కే శుద్ధి చేసిన తాగునీరు

దాతల సహకారంతో శుద్ధి నీటి ప్లాంటును ఏర్పాటు చేశారు. రూ.3కు 20 లీటర్ల మంచినీటిని గ్రామస్థులకు సరఫరా చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మూడేళ్ల నుంచి విజయవంతంగా తాగునీటి పథకం కొనసాగుతోంది. ఈ ఏడాది వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసి గ్రామం ఆదర్శంగా నిలిచింది. సంపూర్ణ పారిశుద్ధ్యం సాధనలో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకుంటున్నారు. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా ప్రకటించేందుకు చేరువలో ఉంది.



సర్పంచి వితరణతో నిర్మితమైన కల్యాణ మండపం

అందరి సహకారంతోనే అభివృద్ధి..

–కొల్లు రామారావు, సర్పంచి



అన్ని వర్గాల ప్రజలు, యువకుల సహకారంతో నాలుగేళ్లుగా గ్రామంలో మద్యపాన నిషేధం అమలుచేస్తున్నాం. అందుకే గ్రామంలో ప్రశాంతత నెలకొనడంతో పాటు అభివృద్ధి, ఆధ్యాత్మికత వైపు దృష్టి సారిస్తున్నాం. వంద శాతం సీసీ రహదారులు, సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా ప్రకటించేందుకు కృషి చేస్తున్నాం.

క్రీడావని


"వారంతా పేదింటి బిడ్డలే.. ఓ మారుమూల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులు ఆటలతో పాటు చదువుల్లోనూ రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతిభ చాటి జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు. అథ్లెటిక్స్‌లోనూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. చదువుల్లో సైతం ప్రథమ స్థానంలో ఉంటూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. మఠంపల్లి మండలం బిల్యానాయక్‌తండా జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు వాలీబాల్, రగ్బీ, లాంగ్‌జంప్, పరుగు పందేల్లో జిల్లా స్థాయిలో ముందంజలో నిలిచి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పేదరికం వెంటాడుతున్నా ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ఆర్థిక సహకారంతో జాతీయ స్థాయి పోటీల్లో తలపడి విజయాలను సాధించేందుకు దోహదపడుతున్నారు."

మఠంపల్లి, న్యూస్‌టుడే:

చదువుల్లో రత్నాలు..

ఆటల్లో ఆణిముత్యాలు

- క్రీడల్లో రాణిస్తున్న బిల్యానాయక్‌తండా విద్యార్థులు
- పేదరికం వెంటాడుతున్నా జాతీయ స్థాయిలో గుర్తింపు



వాలీబాల్ ఆటలో సాధన చేస్తున్న విద్యార్థులు

ప్రతిభను చాటుతోందిలా..

పదోతరగతి చదువుతున్న ధరావత్ వంశీ తరగతిలో మొదటి ర్యాంకు విద్యార్థి. అండర్-21 విభాగంలో గ్రామీణ ఒలింపిక్ అసోసియేసన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఈ జట్టుకు తృతీయ స్థానం లభించింది. పలుమార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయాలను సాధించారు. రగ్బీ రాష్ట్ర జట్టులోనూ పాల్గొన్నారు.

- పదోతరగతి చదువుతున్న బాణోతు దివ్య తరగతిలో 3,4 ర్యాంకుల్లో ఉంటారు. అండర్-17 బాలికల విభాగంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో 2017 డిసెంబర్ 16, 17, 18 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టులో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. దివ్య జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారిణి కూడా కావడం విశేషం. జనవరి మూడో వారంలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించనున్నారు.
- ఇదే పాఠశాలకు చెందిన ఆర్.శిరీష, డి.లలిత రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.
- ఏడోతరగతి చదువుతున్న ధరావత్ చిత్ర డిసెంబర్ 16న సూర్యాపేటలో నిర్వహించిన అండర్ 17 విభాగంలో 80,200 మీటర్ల పరుగు పందెంలో, లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు జనవరి 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నవంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. జట్టుకు ద్వితీయ స్థానం లభించింది.
- గతంలోనూ ఈ పాఠశాల నుంచి డి.మౌనిక, బి.సంధ్య, బి.ఉపేందర్, వి.రాంప్రసాద్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై విజయం సాధించారు.

రగ్బీ క్రీడాకారిణిగా ఎదగాలని..


–డి.దివ్య, విద్యార్థిని



ఇప్పుడిప్పుడే ప్రజాదరణ పొందుతున్న రగ్బీ క్రీడలో రాణించేందుకు నిత్యం సాధన చేస్తున్నాను. మా పీఈటీ ఆటలో మెలకువలను నేర్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరపున ఆడి ద్వితీయ స్థానంలో నిలవడంతో పాటు జాతీయ స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని..

–డి.వంశీ, పదోతరగతి



పదోతరగతిల్లో ఎప్పుడూ నేనే మొదటి ర్యాంకులో ఉంటాను. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వాలీబాల్‌లో సాధన చేస్తున్నాను. మా పాఠశాలలో చదువులతో పాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వడంతో నాకూ ఆసక్తి పెరిగింది. వాలీబాల్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పలుమార్లు ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. తగిన ప్రోత్సాహం ఉంటే జాతీయ క్రీడాకారుడిగా గుర్తింపు పొందాలని ఉంది. వైద్య విద్యను పూర్తి చేసి ప్రజాసేవలో పాలుపంచుకోవాలనుంది.

అథ్లెటిక్స్ అంటే ఇష్టం..

–డి.చిత్ర, ఏడోతరగతి



పరుగు పందెం, లాంగ్‌జంప్ వంటి పోటీల్లో పాల్గొనడమంటే ఇష్టం. ఇటీవల సూర్యాపేటలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్-12 పోటీల్లో 800, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను. గతంలోనూ జిల్లా, డివిజన్ స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాను. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకుని పీఈటీగా స్థిరపడాలని ఉంది.


ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రత్యేక శిక్షణ..

–ఎం.సీతారాంరెడ్డి, పీఈటీ, బిల్యానాయక్‌తండా జడ్పీ ఉన్నత పాఠశాల



క్రీడలపై ఆసక్తిని చూపే విద్యార్థులను ఎంపిక చేసి రగ్బీ, వాలీబాల్ ఆటల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ప్రధానోపాధ్యాయుడు కె.బాబు ప్రోత్సాహంతో విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నాం. రగ్బీ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఉన్న నేను ఆ క్రీడలోనూ విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాను. పేద పిల్లలు కావడంతో పలు సందర్భాల్లో మా ఉపాధ్యాయుల ఆర్థిక సాయంతో పోటీలకు అవసరమైన వస్తువులు అందజేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

సృజనకు పట్టం



- ఆలోచనలు రేకెత్తిస్తున్న ప్రయోగాలు
- రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు
- జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో తొలి రెండు స్థానాల్లో గడ్డిపల్లి అంశాలు

విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చేసే ప్రయోగాలు కొత్త ఆలోచనలు రేకెత్తించి వారి ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో దోహదపడుతున్నాయి. ఆలోచనలు అమల్లోకి తెచ్చి తయారు చేసిన ప్రయోగాలు వారికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చిపెడుతున్నాయి. గడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు ఆకాంక్ష, గౌతమి, అశోక్, నిఖిల్‌లు ఇటీవల విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన(సైన్స్‌ఫెయిర్)లో తమ ప్రతిభను చాటుకున్నారు. సూర్యాపేటలో డిసెంబర్ 20న జరిగిన జిల్లా స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో సామాన్య శాస్త్రంలో ఎయిర్ ఫ్యూరిఫైయింగ్ స్మార్ట్ చెట్టును, గణితంలో క్లినోమీటర్‌ను తయారుచేసి పనిచేసే విధానాన్ని వీక్షకులకు వివరించారు. వీటిలో ఎయిర్ ఫ్యూరిఫైయింగ్ ద్వితీయ స్థానంలో నిలవగా క్లినోమీటర్ జిల్లాలో ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది.

-గడ్డిపల్లి(గరిడేపల్లి), న్యూస్‌టుడే:

జిల్లాలో ప్రథమ స్థానంలో..

చిన్నారి

క్లినోమీటర్‌ను పి.అశోక్, వి.నిఖిల్‌లు తయారుచేశారు. దీన్ని ప్రోటాక్టర్, పీవీసీ పైపు, దారం, బరువుగల లఘులోలకంతో తయారుచేసుకోవచ్చు. క్లినోమీటరను పట్టుకుని చెట్టు నుంచి కొంతదూరం నడిచి నిల్చొని జీరో డిగ్రీ కోణంతో చెట్టును పరిశీలించాలి. చెట్టుమీద ఒక మార్క్ చేసుకోవాలి. తర్వాత చెట్టు నుంచి ముందుకుగాని, వెనుకకుగాని జరుగుతూ కొంతకోణంలో చెట్టు అంచు(చివర)ను గమనించాలి. ఎదుటిభుజం, ఆసన్నభుజాలతో త్రిభుజం ఏర్పడుతుంది. కోణం విలువను క్లినోమీటర్‌లో గమనించవచ్చు. ఎదుటి భుజం చెట్టు మిగిలిన ఎత్తు. ఆసన్నభుజం చెట్టునుంచి వ్యక్తికి మధ్య దూరం. ఆధారాలతో కనుగొన్న టాన్‌తీటాతో ఆసన్నభుజంను గుణిస్తే ఎదుటి భుజం వస్తుంది. అదే చెట్టు మిగిలిన ఎత్తు. వ్యక్తి ఎత్తు, చెట్టు మిగిలిన భాగం ఎత్తు కలిపితే చెట్టు ఎత్తు తెలుస్తుంది. ఇలా పర్వతాలు, చెట్లు, టవర్‌లు, మబ్బులు, ఎత్తయిన వాటిని కొలవడానికి ఉపయోగిస్తారు. దీనిని తక్కువ ఖర్చుతో తయారుచేసుకోవచ్చు. డిసెంబర్ 10, 11, 12లో సూర్యాపేటలోని ఏవీఎం పాఠశాలలో జరిగిన ప్రదర్శనలో ఈ ప్రయోగ ప్రదర్శన ప్రథమ స్థానం పొందింది. రాష్ట్ర స్థాయికి ఎంపికయి వరంగల్‌లోని మడికొండ సాంఘిక సంక్షేమ పాఠశాలలో డిసెంబర్ 21, 22, 23లలో జరిగిన సైన్‌ఫెయిర్‌లో ప్రదర్శించిన విద్యార్థులు పలువురి నుంచి ప్రశంశలు అందుకున్నారు. ఉపాధ్యాయని కృష్ణవేణి వీరికి సహకారం అందించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్లినోమీటర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొత్త ఆలోచనతోనే.. –అశోక్ విద్యార్థి

ఎత్తయిన వాటి ఎత్తు కొలవడానికి సులభమైన మార్గాలను తెలుసుకోవాలనే ఆకాంక్షను ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు సహకరించి క్లినోమీటర్ తయారు చేశాం. అది రాష్ట్ర స్థాయికి ఎంపికయి గుర్తింపురావడంతో మరికొన్ని ప్రయోగాలు చేయాలనే సంకల్పమొచ్చింది.

గుర్తింపు కల్పించింది.. –నిఖిల్. విద్యార్థి.

రాష్ట్రస్థాయిలో క్లినోమీటర్‌కు గుర్తింపు తీసుకురావడం ఆనందంగా ఉంది. ఉపాధ్యాయుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. ఇలాంటివి ప్రోత్సహించి ముందు కొత్త అంశాలను పరిచయం చేయాలి. సృజనాత్మక ఆలోచనలను రేకెత్తించేలా చైతన్యపరచాలి.



జిల్లాలో ద్వితీయ స్థానం పొందిన ఎయిర్ ఫ్యూరిఫైయింగ్ స్మార్ట్ చెట్టు

ఎయిర్ ఫ్యూరిఫైయింగ్ స్మార్ట్ చెట్టు ప్రయోగాన్ని జి.గౌతమి, ఎ.ఆకాంక్షలు తయారుచేసి ప్రదర్శించారు. దీన్ని పీవీసీ పైపులు, వంకబెండ్లు, వాటర్‌ఫ్యూరిఫైయర్ పైపులు, టీ జాయింట్‌లతో తయారుచేశారు. చెట్టు ఆకారంలో నమూనా తయారుచేసి వృథాగా పడేసిన శీతల పానీయం సీసాలతో చిన్న చిన్న తొట్లుగా పెట్టారు. ఈ తొట్లలో గాలిలోని కేన్సర్ కారక, హానికర రసాయనాలను పీల్చుకునే మొక్కలను పెంచారు. కొలియస్, స్నేక్ ప్లాంట్, స్పైడర్ ప్లాంట్, డెసినా, డంబ్‌కేన్, మనీప్లాంట్, క్రైసాంథిమమ్, తులసి, ఆలో విరా, రెడ్ ఎడ్జ్‌డ్ డ్రసీనా మొక్కలు వేశారు. (ఈ మొక్కలను అమెరికా అంతరిక్ష పరిశోధనాసంస్థ నాసా గుర్తించింది.) ఈ మొక్కలు గాలిలోని బెంజిన్, టోలిన్, కార్బన్ మోనాక్సైడ్, ట్రైక్లోరోఇథలీన్, మీథేన్, లాంటి కేన్సర్ కారక వాయువులను గ్రహిస్తాయి. దీనికి స్మార్ట్ ట్రీ అని ఎందుకు పెట్టారంటే చెట్టుకు పెట్టిన మోటారును రిమోట్‌తో ఆన్ ఆఫ్ చేసేలా ఏర్పాటుచేశారు. దాంతో పాటు మోటారును సెల్‌ఫోన్‌తో అనుసంధానించారు. మనం ఎక్కడ ఉన్నా మొక్కలకు నీరందించే విధంగా సెల్‌ఫోన్‌తో రిమోట్ ద్వారా నీరు పెట్టుకోవచ్చు. దూర ప్రాంతాలకు వెళ్లినపుడు ఎక్కువ రోజులు ఇంటికి రానపుడు మోటగారును సెల్ ద్వారా ఆన్ ఆఫ్ చేసి మొక్కలకు నీరు పెట్టుకుంటూ మొక్కలు చనిపోకుండా సంరక్షించుకోవచ్చు. తక్కువ స్థలంలో మట్టి, ఉష్ణోగ్రత, నీళ్లను తక్కువగా ఉపయోగించి ఎక్కువ మొక్కలను ఎలా పెంచుకోవాలని ఈ ప్రయోగం ద్వారా వీక్షకులకు వివరించామని విద్యార్థులు తెలిపారు. ప్రదర్శనలో ఉపాధ్యాయులు చిన్నప్ప, ఎం.పవిత్ర సహకారం అందించారు.

సొంతంగా ఆలోచించాం.. –ఆకాంక్ష. విద్యార్థిని



గత ఏడాది పాఠశాల స్థాయిలోనే ప్రయోగాలు చేయాలనే ఆలోచన వచ్చింది. వర్షం నీరు వృథా చేయకుండా వాడుకునే విధానం, ప్రొక్లెయిన్ తయారీ, సిలిండర్ వాల్వులు పనిచేసే అంశాలను ప్రత్యేక దినోత్సవాలలో ప్రదర్శించా. ఈ ఏడాది మేము తయారు చేసిన స్మార్ట్‌చెట్టు జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు వెళ్లడం ఆనందంగా ఉంది.

ఏదో ఒక ప్రయోగం చేయాలని... –గౌతమి. విద్యార్థిని



కొత్తగా ఏదోఒకటి చేయాలనే సంకల్పంతో బ్లడ్ గ్రూపింగ్ (క్లాసిఫికేషన్ ఆఫ్ బ్లడ్ గ్రూప్)ను, జింకు ముక్కలపై హైడ్రోజన్ వాయువు ఉత్పత్తి కావడం వంటి అంశాలు చేశాను. మొక్కల రక్షణ ప్రాధాన్యతను ఉపాధ్యాయులకు వివరించి స్మార్ట్ చెట్టు ప్రయోగాన్ని ఎంచుకున్నాం.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన పారిశుద్ధ్య కార్మికులకు రక్షక కవచాలు, స్వెట్టర్లు అందజేసి



పారిశుద్ధ్య కార్మికులకు రక్షక కవచాలు అందిస్తున్న ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాయకులు

మట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అందించటంతోపాటు, వారికి ప్రయోజనం చేకూర్చే విధంగా పథకాలను అమలు పరుస్తున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పట్టణాన్ని ప్రథమంగా నిలపాలన్నారు. కార్యక్రమంలో పుర అధ్యక్షురాలు సుర్వి లావణ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు నువ్వుల ప్రసన్న, గోమారి సుధాకర్‌రెడ్డి, పొలిశెట్టి అనిల్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు మిస్టర్ ఇండియా-2018 పోటీలకు జట్టు ఎంపిక


సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే : యాదాద్రి భువనగిరి జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్‌తో కలిసి ఈ నెల 5న మిస్టర్ తెలంగాణ ఓపెన్ బాడీబిల్డింగ్ పోటీలతో పాటు మిస్టర్ ఇండియా-2018 పోటీలకు సీనియర్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు తెలంగాణ బాడీబిల్డింగ్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి ఎస్. మోహన్ పేర్కొన్నారు. భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం పోటీలు జరుగుతాయన్నారు. 55-100 కిలోల విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు పురస్కారంతో పాటు ధ్రువపత్రం, మిస్టర్ తెలంగాణ-2018 పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను మహారాష్ట్రలోని పూణేలో మార్చి నెలలో జరిగే మిస్టర్ ఇండియా-2018 పోటీల్లో పాల్గొనే సీనియర్ జట్టుకు ఎంపిక చేస్తామని మోహన్‌రావు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు వివరాల కోసం.. చరవాణి నంబర్లు 98498 69860, 99481 67453, 96661 99920 లలో సంప్రదించాలన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని క్షేత్ర ప్రచారశాఖ జిల్లా అధికారి కోటేశ్వరరావు తెలిపారు. నల్గొండలోని రాఘవేంద్ర కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అభినవ యూత్ సహకారంతో యువ నాయకత్వ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం డీఎస్‌డీవో మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మిర్యాల యాదగిరి మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగి దేశభక్తిని ప్రదర్శించాలని యువతకు సూచించారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత, అభినవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గంజి రాజేందర్, ఎన్‌వైకే కార్యక్రమ బాధ్యుడు యాదగిరి, డీజీ నామిని, భూపాల్‌రెడ్డి, రుద్రాక్షి నర్సింహ, జిల్లా యువజన అవార్డు గ్రహీత చాపల యాదయ్య, దాసరి సైదులు, రెడ్డిపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

6న ఉద్యోగ మేళా

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ బాలుర, వొకేషనల్ కళాశాలలో టాటా స్ట్రైవ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సహకారంతో శనివారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్న ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో మారం గోనారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 98856 59807 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



నాగార్జునసాగర్, న్యూస్‌టుడే

సాగర్ జలాశయ నీటిమట్టం: 540.50 అడుగులు
ఎడమకాల్వ ద్వారా నీటివిడుదల: 7,089 క్యూసెక్కులు
కుడి కాల్వద్వారా నీటి విడుదల: 9,072 క్యూసెక్కులు
ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదల: నిల్
సాగర్ జలాశయానికి నీటిరాక : 2,479 క్యూసెక్కులు
శ్రీశైలం జలాశయ నీటిమట్టం : 869.70 అడుగులు
శ్రీశైలం జలాశయానికి నీటిరాక : నిల్
ఎస్ఎల్బీసీ ద్వారా నీటివిడుదల : 2,200 క్యూసెక్కులు
సాగర్ జలాశయం నుంచి పూర్తి నీటి విడుదల: 21,876 క్యూసెక్కులు

మత్స్య సంఘాలకు తాత్కాలిక కమిటీలు..?



సూర్యాపేట మత్స్యశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మత్స్యకార్మికులు (పాతచిత్రం)

- సూర్యాపేట జిల్లాలో పాలక మండలి లేని సంఘాలు 75
- ముగ్గురు లేదా ఐదుగురు సభ్యులతో కమిటీ

జిల్లాలోని పలు మత్స్య సహకార సంఘాలకు పాలకమండలి సభ్యుల గడువు పూర్తయి నెలలు గడుస్తోంది. ఇంత వరకు ఎన్నికలు నిర్వహించలేదు. సంఘం కార్యకలాపాలను పర్యవేక్షించడానికి మత్స్యశాఖ అధికారులకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. పని ఒత్తిడి పేరిట కొందరు పర్యవేక్షించటం లేదు. ఫలితంగా ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం అభాసుపాలు అయ్యే పరిస్థితి నెలకొందని ప్రభుత్వం భావించింది. పాలకమండలి లేని సంఘాలకు త్రిసభ్య కమిటీ లేదా ఐదుగురు సభ్యులున్న కమిటీలను ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇప్పటికే జిల్లా మత్స్యశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

–సూర్యాపేట గ్రామీణం, న్యూస్‌టుడే

సూర్యాపేట జిల్లాలోని చాలా మత్స్య సహకార సంఘాలకు పాలకవర్గం లేక మత్స్య కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరుచేసే నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. సహకార సంఘాల చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు త్రిసభ్య లేదా ఐదుగురు సభ్యులున్న కమిటీలు సంఘాల బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలు జరిగే వరకు సంఘంలో ఉన్న సభ్యులందరితో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి వారిలోంచి ముగ్గురు లేదా ఐదుగురి సభ్యులతో కమిటీని ఎన్నుకొంటారు. ఈ ఎన్నికపై సభ్యుల తీర్మానాన్ని పంపిస్తే అధికారులు ధ్రువీకరించనున్నారు. పాలకమండలి పూర్తయిన సంఘాలకు అధికారులే నేరుగా అత్యవసర సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. పాలకమండలి లేవని సుమారు 75 సంఘాల వరకు సూర్యాపేట జిల్లాలో ఉన్నాయి. ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘం బాధ్యతలు, లావాదేవీలను చూసుకోవాల్సి ఉంటుంది.

మొదలుకానున్న రాజకీయ జోక్యం

జిల్లాలో మత్స్య సహకార సంఘాలకు ముగ్గురు, ఐదుగురు సభ్యులున్న కమిటీలను ఎన్నుకోవడంలో రాజకీయం జోక్యం కానుందని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఎక్కువగా సూర్యాపేట, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, చిలుకూరు మండలాల్లో ఉన్న సహకార సంఘాలకు పాలకవర్గం లేదు. వీటిల్లో రాజకీయ జోక్యం జోరందుకోనున్నట్లు సమాచారం బలాబలాలు నిరూపించుకోవడానికి తాత్కాలిక సభ్యుల ఎంపిక కీలకం కానుంది. ఈ మేరకు ఇప్పటి నుంచే నాయకుల చుట్టూ కొందరూ మత్స్యకార సహకార సంఘాల సభ్యులు తిరుగుతున్నారు. ఈ కమిటీల్లో సభ్యులను ఎన్నుకోవడానికి ఇప్పటికే విందులు, డబ్బుల పంపిణీ కొనసాగుతున్నట్లు తెలిసింది.

పాలకమండలి లేని సంఘాలు

సూర్యాపేట జిల్లాలో 133 మత్స్యకార్మిక సహకార సంఘాలు ఉండగా 75 సంఘాలకు పాలకవర్గం లేదు. లేని చోట మత్స్యసహకార సంఘాలకు ఎన్నికలు జరపడానికి జాప్యం అవుతుండటంతో ముగ్గురు లేదా ఐదుగురు సభ్యులతో కమిటీలను ఎన్నుకునే క్రతువు సంక్రాంతి తర్వాత మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట, యర్కారం, తాళ్లఖమ్మంపహాడ్, బాలెంల, బొప్పారం, పాతర్లపహాడ్, నెమ్మికల్, నూతనకల్, చిన్ననెమిలా, మిర్యాల, చందుపట్ల, యండ్లపల్లి, గోరెంట్ల, చిల్పకుంట, చివ్వెంల, వల్లాభాపురం, మాచారం, లింగాల, తుంగతుర్తి, వెంపటి, వెలుగుపల్లి అన్నారం, గుమ్మడవెల్లి, వెలుగుపల్లి, కుక్కడం, ఆర్.కొత్తగూడెం, ఉయ్యాలవాడ, మామిడిపల్లి, కొడూరు, తిరుమలగిరి, రామన్నగూడెం, అడివెంల, రావిపహాడ్, సిరికొండ, నడిగూడెం, మునగాల, మాధవరం, తాడ్వాయి, పాలకీడు, త్రిపురారం, కె.పి.పురం, దోరకుంట, టి.బి.పాలెం, రెడ్లకుంట, బేతవోలు, నేరేడుచర్ల, పెంచికల్‌దిన్న, దిర్శించర్ల, సోమారం, కల్లూరు, వైకుంఠాపురం, యల్లాపురం, గుండ్లపల్లి, గరిడేపల్లి, పోనుగోడు, గడ్డిపల్లి, సర్వారం, టి.మల్కాపురం, కల్వలచెరువు, హుజూర్‌నగర్, లింగగిరి, బూరుగడ్డ, తుమ్మలపెన్‌పహాడ్, చిలుకూరు తదితర సహకార సంఘాలకు పాలకవర్గం లేదు. వీటిల్లోనే తాత్కాలిక కమిటీలను ఎన్నుకోనున్నారు.

సంక్రాంతి తర్వాత త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేస్తాం

సౌజన్య, మత్స్య శాఖ జిల్లా అధికారిణి, సూర్యాపేట

సంక్రాంతి పండుగ తర్వాత పాలకమండలి గడువు పూర్తయిన సంఘాలకు త్రిసభ్య కమిటీని నియమించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. త్వరలోనే పాలకమండలి లేని సంఘాలకు నోటీసులు అందిస్తాం. సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. సభ్యులు, అధికారుల సమక్షంలో ఒక్కొక్క సంఘానికి కమిటీలు ఏర్పాటు చేస్తాం.

మూడురోజుల్లో రూ.6 కోట్ల మద్యం అమ్మకాలు

గతేడాదితో పోలిస్తే 22 శాతం పెరిగిన విక్రయాలు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లాలో డిసెంబరు 30, 31 జనవరి 1న రూ.6కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే నూతన సంవత్సర వేడకలకు మద్యం విక్రయాలు 22 శాతం పెరిగాయి. జిల్లాలోని 67 మద్యం దుకాణాలు, 3 బార్‌షాపుల్లో గతేడాది డిసెంబరు నెలలో లిక్కర్ 59, 978, బీర్లు 54,043 విక్రయాలకు రూ. 30 కోట్ల 22 లక్షల అమ్మకాలు జరిగాయి. 2017 డిసెంబరు నెలలో లిక్కర్ 67, 710, బీర్లు 84,415 విక్రయాలకు రూ.36కోట్ల 76లక్షలు ఆదాయం వచ్చింది. జిల్లాలో ప్రస్తుతం మద్యం అమ్మకం రోజువారీగా సరాసరి రూ.1కోటి 20 లక్షల వ్యాపారం జరగుతుండగా ఒక్క డిసెంబరు 31 రోజున రూ.3కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి.

పెరిగిన విక్రయాలు

మద్యం ధరలు పెరిగినా నూతన సంవత్సర వేడుకల్లో మందుబాబులు ఉత్సాహంగా కొనుగోలు చేశారు. నూతన సంవత్సరానికి ముందు ప్రభుత్వం మందు ధరలను పెంచుతూ కొత్త ధరలను ప్రకటించింది. అయినా పెరిగిన మద్యం ధరలను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా కొనుగోలు చేశారు. సంవత్సరం ఆఖరి రోజు ఆదివారం రావటంతో మరింతగా మద్యం విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. మరుసటి రోజు సోమవారం ప్రభుత్వం సెలవు దినం కావటంతో దీని ప్రభావం రెండోరోజు కూడా కొనసాగింది.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి: డీఈవో

భువనగిరి ఆబాది, న్యూస్‌టుడే: సమాజ అభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని డీఈవో రోహిణి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టీపీయూఎస్ (తపస్) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలన్నారు. మహిళా ఉపాధ్యాయునులు డి.ఉపేంద్ర, హేమలత, మంజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల అనంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాశం కృష్ణమూర్తి, రామకృష్ణారెడ్డి, మహేష్, శ్రీధర్,గీత తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఈవో రోహిణి

అర్చక సమాఖ్య దైనందిని ఆవిష్కరణ

నీలగిరి, న్యూస్‌టుడే: తెలంగాణ అర్చక సమాఖ్య ముద్రించిన 2018 దైనందినిని బుధవారం నల్గొండలోని రామాలయంలో ఆవిష్కరించారు. సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ అర్చకుల సమస్యలు పరిష్కారానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హత ఉన్న అన్ని ఆలయాలను ధూప దీప నైవేద్యం కిందకు తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరారు. సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పెన్నా మోహనశర్మ, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధ్యక్షులు చిలకమర్రి శ్రవణ్‌కుమారాచార్యులు, వీరభద్రశర్మ, గాదేబట్ల శంకరశాస్త్రి, సత్యనారాయణశర్మ, నవీన్‌కుమార్, పద్మనాభాచారి, శ్రీనివాస్‌శర్మ, శఠారిచారి పాల్గొన్నారు.



దైనందినిని ఆవిష్కరిస్తున్న ఉపేంద్రశర్మ తదితరులు

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం

టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి

నల్గొండ వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్గొండలోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాల విభజన తరువాత ప్రతి జిల్లాలో సుమారు 50శాతం ఉద్యోగ ఖాళీలున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లటం కష్టంగా మారిందన్నారు. 'ఆర్డర్ టు సర్వ్' కింద ఆరు నెలలు అని చెప్పినా ఏడాది పూర్తయినా ఉద్యోగులకు విముక్తి కల



ప్రమాణస్వీకారం చేస్తున్న టీఎన్జీవో జిల్లా కార్యవర్గం

గలేదన్నారు. ప్రభుత్వం తాత్కాలిక వ్యవస్థను నడిపిస్తుందని తెలిపారు. పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగులు తక్కువ వేతనంతో పనిచేయాల్సి వస్తోందని చెప్పారు. నూతన పీఆర్‌సీని వేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

నల్గొండ వన్‌టౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో) జిల్లా కమిటీని బుధవారం నల్గొండలో ఎన్నికల అధికారి మందడి ఉపేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.చంద్రారెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడిగా ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ.విశ్వేశ్వర్‌రావు, కార్యదర్శిగా ఎం.శ్రవణ్‌కుమార్, కోశాధికారిగా ఎం.కమలాద్రి, ఉపాధ్యక్షులుగా సీహెచ్ నర్సింహాచారి, వి.లక్ష్మణమూర్తి, వి.మాధవి, వి.దయాకర్‌రెడ్డి, దుర్గామల్లేశ్వరి, కిరణ్‌కుమార్, కె.దయాకర్‌రావు, ఎం.శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులుగా ఇ.పాండునాయక్, ఎండీ జాఫర్, టి.రమాదేవి, వి.విజయకృష్ణ, కె.మోహనస్వామి, ఎ.సురేష్‌కుమార్, అబ్దుల్‌ఖలీల్, కె.సునీత, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జి.శ్రీనివాస్, పబ్లిసిటీ సెక్రటరీగా డి.లింగస్వామి, క్రీడల కార్యదర్శిగా ఎండీ జావిద్, మహిళ కార్యదర్శిగా ఎం.రమాదేవి, సాంస్కృతిక కార్యదర్శిగా పి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

'యువతను నిర్లక్ష్యం చేస్తున్న కేసీఆర్'

మోటకొండూరు, న్యూస్‌టుడే: కేసీఆర్ ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా యువతను నిర్లక్ష్యం చేస్తుందని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో దయ్యాల కుమారస్వామి అధ్యక్షతన బుధవారం జరిగిన ఆ పార్టీ ఆలేరు అసెంబ్లీ కోర్ కమిటీ సమావేశంలో ఆయన



మోటకొండూరులో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, తదితరులు

పాల్గొని మాట్లాడారు. యవతకు ఇవ్వాల్సిన ఉద్యోగాల కోసం పోరాటం చేయటానికి భాజపా నాయకులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 2014 ఎన్నికల్లో మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయిస్తామని చెప్పిన తెరాస నేతలు నాలుగేళ్లు పూర్తికావస్తున్నా.. వాగ్దానం నిలుపుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ కానుగంట్ల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి జంపాల శ్రీనివాస్, మండల అద్యక్షుడు పీసరి తిరుమల్‌రెడ్డి, బోనగిరి శ్యాంసుందర్, చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకువెళ్లాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: కేసీఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ కోసం అఖిల పక్షాన్ని దిల్లీకి తీసుకువెళ్లాలని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు మంద శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం గుట్టలో ఆ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలన్నారు.




గుట్టలో మాట్లాడుతున్న మంద శంకర్

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మంద కృష్ణ మాదిగ చేస్తున్న దీక్షలను భగ్నం చేస్తు పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ దీక్షలకు పలువురు సంఘీబావం తెలిపారు. బర్ల శివయ్య, బూడిద జానీ, పాకల ప్రవీణ్, ప్రేమ్‌కుమార్, బాబు, ప్రభాకర్, మొగులయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సారథి

అందుబాటులో ప్రత్యేక యాప్



కేంద్ర ప్రభుత్వం రూపొందించిన దివ్యాంగుల యాప్

ఆలేరు, న్యూస్‌టుడే: ఉన్నత చదువులు, ఉపకార వేతనాలు, తమకు ఉద్దేశించిన ఇతర సంక్షేమ పథకాలను గురించి దివ్యాంగులు ఇక చింతించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియకపోవడంతో చాలామంది అవకాశాలను కోల్పోతున్నారు. ఈనేపథ్యంలో వారి ఇబ్బందులు తొలగిపోయేలా కేంద్ర ప్రభుత్వం 'దివ్యాంగ సారథి' పేరిట ఒక ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గత సెప్టెంబరు 26న ప్రధాని నరేంద్రమోదీ ఈయాప్‌ను ఆవిష్కరించారు. ఇందులో దివ్యాంగులకే కాకుండా ఆమ్ల దాడి బాధితులతో పాటు వివిధరకాల వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ఉపయోగకారిగా ఉంది.

ఎవరికోసం అంటే..

అంధత్వం, వినికిడి లోపం, మూగ లక్షణాలు ఉన్నవారు, నడువలేని వారు, మానసిక వికలాంగులు, మరుగుజ్జులు, మస్తిష్క పక్షవాతం, ఆమ్లదాడి బాధితులు, తీవ్రమైన నాడీ సంబంధిత రుగ్మతలు, సమస్యలు కలిగిన వారికి ఈయాప్ చాలా ఉపయోగ పడుతుంది.

డౌన్‌లోడ్ చేసుకునే విధానం

స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌ను ఎంచుకుని అందులో దివ్యాంగ సారథి అని ఆంగ్లంలో టైపుచేసి ఇన్‌స్టాల్ అనేచోట క్లిక్ చేస్తే కొద్దిసేపట్లో యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. చరవాణిలో నిక్షిప్తం అవుతుంది. ఇందులో సమాచారం ఆంగ్లం, హిందీ భాషల్లో పొందుపరిచారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న సేవలు, పథకాలు, ఉపకార వేతనాలు తదితర వివరాలతో పాటు వాటికోసం ఎవరెవరిని సంప్రదించాలనే వివరాలు, టెలిఫోన్ నెంబర్లు, సమస్త వివరాలు ఇందులో ఉన్నాయి.

ప్రత్యేక సంస్థల వివరాలు..

- జాతీయ దివ్యాంగ అభివృద్ధి సంస్థ
- అలియావర్‌జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌ది హియరింగ్ హ్యాండీకాప్డ్
- స్వామి వివేకానంద జాతీయ దివ్యాగుల పునరావాస శిక్షణ కేంద్రం
- పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అంగవికలాంగ జాతీయ సంస్థ

పై సంస్థల వివరాలు, వాటిలో చేరేందుకు ఉన్న అవకాశాలు ఈ యాప్‌లో ఉంటాయి. ఆయా సంస్థలకు చెందిన ప్రాంతీయ కేంద్రాల వివరణ, దివ్యాంగుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థల వివరాలు యాప్‌లో అందుబాటులో ఉంచారు.

వీటిని తెలుసుకోవచ్చు

- దివ్యాంగుల కోసం అమలులో ఉన్న రవాణా, ఇతర సౌకర్యాలలో రాయితీలు
- దీనదయాళ్ డిజబుల్డ్ రీహ్యాబిలిటేషన్ పథకం
- దివ్యాంగులైన విద్యార్థులకు ఉన్నతవిద్య, ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక శిక్షణ, ఉపాధి అవకాశాల వివరాలు
- జాతీయ ఉపకార వేతనాలు, ప్రిమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు
- విదేశాలలో చదువుకోవాలనుకునే వారికి ఉన్న అవకాశాల వివరాలు
- దివ్యాంగులకు వివిధ ప్రభుత్వశాఖల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలు, పథకాలు అందుబాటులో ఉంటాయి
- భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థల వివరాలు అందుబాటులో ఉన్నాయి. కృత్రిమ అవయవాలు కావాలంటే ఏమి చేయాలి? ఎవరిని సంప్రదించాలి, ఎంత మొత్తాలను చెల్లించాలనే విషయాలు ఇందులో వివరంగా పొందుపర్చారు.
- ఉన్నత చదువుల కోసం అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించేందుకు అమలులో ఉన్న పథకాల వివరాలు, ఆయా పథకాలకు ఎవరు అర్హులు, దరఖాస్తు విధానం, తదితరాలు అందుబాటులో ఉంచారు.

తెలుగులోనూ ఉంటే బాగుండేది

–టి.చక్రధర్‌రెడ్డి, వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు, యాదాద్రి జిల్లా



దివ్యాంగ సారథి యాప్‌ను రూపొందించడం హర్షించదగిన విషయం. అయితే యాప్‌లో వివరాలన్నీ హిందీ, ఇంగ్లిషులోనే ఉన్నాయి. తెలుగులో కూడా అందుబాటులో ఉంచితే బాగుంటుంది. ఈవిషయమై మా డిమాండ్‌ను జిల్లా పాలనాధికారి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తాం. తెలుగులో ఉంటే తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంత దివ్యాంగులకు మరింత ఉపయుక్తంగా ఉంటుంది.

దివ్యాంగులకు ఉపయుక్తం

–సీహెచ్.శ్రీనివాస్, ఎంపీడీవో, ఆలేరు



కేంద్ర ప్రభుత్వం రూపొందించిన దివ్యాంగ సారథి యాప్ వారికి చాలా ఉపయుక్తంగా ఉంటుంది. ఇంటి వద్ద నుంచే అవసరమైన సమాచారాన్ని తెలుసుకునే వీలుంది. దివ్యాంగులకు అవసరమైన వివరాలతో పాటు అమలులో ఉన్న సంక్షేమ, విద్య, ఉద్యోగ, శిక్షణ తదితర వివరాలు ఇందులో ఉన్నాయి. దివ్యాంగులు ఈయాప్‌ను సద్వినియోగ పర్చుకోవాలి.

దేవాలయ అభివృద్ధికి తోడ్పాటు: మంత్రి

• అన్యాక్రాంతమైన భూములను వెలికితీస్తాం • చెర్వుగట్టు దేవాలయ ఛైర్మన్ ప్రమాణస్వీకారం

చెర్వుగట్టు(నార్కట్‌పల్లి), న్యూస్‌టుడే: సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం చెర్వుగట్టు శ్రీ



చెర్వుగట్టు దేవాలయ ఛైర్మన్ ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయ ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటునందిస్తానని, అన్యాక్రాంతమైన దేవాలయ భూములను వెంటనే పరిశీలించి వెలికి తీయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే మరోసారి దేవాలయానికి విచ్చేసి అభివృద్ధి తదితర సమస్యలపై చర్చిస్తానని హామీనిచ్చారు. గతంలో కొందరు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అంధకారంలో ఉంటారని ఎద్దేవా చేసిన వారి బతుకులు నేడు అంధకారంలోకి వెళ్లాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ దేవాలయ అభివృద్ధిపై దృష్టి సారించడంతోనే మరింత వేగంగా దేవాలయం అభివృద్ధి వైపు దూకెళుతోందన్నారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ రాబోయో రోజుల్లో దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. వెంటనే గట్టుపైకి రెండో ఘాట్‌రోడ్డును, వసతి గదులను ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఘాట్‌రోడ్డు వెంట చెట్లను నాటి చెర్వుగట్టును హరితవనంగా మారుస్తానని చెప్పారు.

ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. 14 మంది డైరెక్టర్లలో గౌళికర్ శ్రీనివాసులు యల్లారెడ్డిగూడేనికి చెందిన నల్లా వెంకన్నను ఛైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా మరో డైరెక్టరు యామా దయాకర్ బలపర్చారు. దేవాదాయ శాఖ ఏసీ సులోచన నల్లా వెంకన్నను ఛైర్మన్ అభ్యర్థిగా ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డిలు నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు, ఛైర్మన్‌ను సత్కరించారు. అంతకు ముందు మంత్రి, ఎమ్మెల్యేకు కోలాట నృత్యాలు, మేళతాళాల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో జేసీ నారాయణరెడ్డి, ఆర్డీవో వెంకటాచారి, ఎంపీపీ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచి మల్ల రమణ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

21న యాదాద్రిలో కవితోత్సవం

చిట్యాల, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్ర పునర్ నిర్మాణంలో భాగస్వాములవుతున్న ఐదు వందల మంది శిల్పులకు ప్రముఖ కవి శిఖ గణేష్ ఆధ్వర్యంలో ఈనెల 21న యాదాద్రిలో కవిత్సోవాన్ని నిర్వహించి అక్షరా నీరాజనాన్ని అందించాలని నిర్ణయించినట్లు కార్యక్రమ నల్గొండ జిల్లా సమన్వయకర్త గంజి భాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 31 జిల్లాలకు చెందిన ప్రముఖ కవులతో పాటు ప్రపంచస్థాయి కవులతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికే జిల్లా నుంచి పలువురు పేర్లను నమోదుచేసుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 21న యాదాద్రిలోని యాదగిరి గార్డెన్స్‌లో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలి: డీఆర్‌వో

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌వో మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జనవరి నెలాఖరు వరకు అన్ని గ్రామాలను ఓడీఎఫ్(బహిరంగ మల విసర్జన రహిత)గ్రామాలుగా మార్చాలన్నారు. హరిత హారం, ఇంకుడుగుంతల నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో వంటగదులను నిర్మించుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఎంపీడీవో జి.బాలకృష్ణ, ఏపీవో కృష్ణమూర్తి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.



One can expect 3 to 5 VSAQs from these 4 lessons in inter exams and 5 questions in competitive exams. Inorder to cover all the basics, one must go through all Chapter and VSAQs along with solved problems. List out all important formulas at one place and be perfect with logarithams & square root based calculations for excellent score.

ప్రతిభ

What is critical temperature?

States of Matter, Stoichiometry, Thermodynamics, Chemical Equilibrium and Acids - Bases

2 Marks Questions

Q: Calculate Kinetic energy (in SI units) of 4 g of methane at –73°C.

A: $K.E = \frac{3}{2}\ nTR$

$= \frac{3}{2} \times \frac{4}{16} \times (-73 + 273) \times 8.314$

$= 1.5 \times 0.25 \times 200 \times 8.314$

$= 623.6$ J

Q: Calculate Kinetic energy of 5 moles of N_2 at 27°C.

A: $K.E. = \frac{3}{2}\ nTR = \frac{3}{2} \times 5 \times (27 + 273) \times 8.314$

$= 1.5 \times 5 \times 300 \times 8.314 = 18706.5$ J

Q: Which of the gases diffuses faster among N_2, O_2 and CH_4? Why?

A: At constant P & T, the rate of diffusion of a gas is inversely proportional to its molecular mass. CH_4 diffuses faster as it has least molecular mass (16 g/ mole).

Q: Calculate RMS speed, most probable speed of CO_2 gas at 27°C.

A: $U_{rms} = \sqrt{\frac{3RT}{M}}$

$= \sqrt{\frac{\frac{3 \times 8.314 \times (27 + 273)}{44}}{1000}}$

$= 4.42 \times 10^2$ m/sec

$U_{mp} = 0.8166 \times U_{rms} = 0.8166 \times 4.42 \times 10^2$

$= 3.36 \times 10^2$ m/sec

Q: State Dalton's law of partial pressures.

A: At constant temperature and volume, the total Pressure exerted by the mixture of non reactive gases is equal to sum of partial pressures of component gases (P_1, P_2)

$P_{total} = P_1 + P_2$

Q: What are standard ambient temperature and pressure (S.A.T.P) conditions?

A: 298.15 K temperature & 1 bar Pressure.

Q: Give the ratio of most probable (M.P), Average (AV) and R.M.S speeds of gas molecules.

A: $U_{M.P} : U_{AV} : U_{R.M.S}$

$= \sqrt{\frac{2RT}{M}} : \sqrt{\frac{8RT}{\pi M}} : \sqrt{\frac{3RT}{M}}$

$= 1.000 : 1.128 : 1.224$

Q: What is critical temperature? Give its value for CO_2.

A: The temperature above which any gas can not be liquified by applying any pressure.

T_C of CO_2 = 30.98°C

Q: What is Surface tension? Give its units in SI System.

A: The downward force acting per unit length perpendicular to the line drawn on the surface of liquid. Units : Nm^{-1}

Q: What is coefficient of viscosity? Give its units in SI system.

A: The Force, when velocity gradient $\left(\frac{du}{dz}\right)$ is unity and the area of contact is unit area (A). Units: NS m^{-2}

$F = n.A. \frac{du}{dz}$

Q: What is "Compressibility factor"?

A: The ratio of actual molar volume of gas to molar volume of an ideal gas. For ideal gas

$Z = 1.$ $\qquad Z = \frac{PV}{nTR}$

Q: What is "Boyle's temperature"?

A: The temperature at which a real gas obeys ideal gas equation over appreciable range of pressure.

Q: Give Vander Waals equation of state.

A: $\left(P + a\frac{n^2}{v^2}\right)(V - nb) = nTR$

a, b = Vander Waals constants

n = no. of moles, P = pressure, V = Volume,

T = absolute temp., R = Universal gas constant

Q: What is "disproportionation reaction"? Give 1 example.

A: The redox reaction in which an element undergoes oxidation as well as reduction.

$2\ H_2O_2 \rightarrow 2\ H_2O + O_2$

Q: State the "Law of multiple proportions".

A: When 2 elements combine to form 2 or more compounds, then the mass of one element that combines with a fixed mass of other element in the ratio of whole number.

eg. CO & CO_2

Q: Give 2 redox reactions related to environment.

A: ★ Use of liquid H_2 as fuel

★ Development of OZONE hole by CFCs.

Q: What do you mean by "Significant figures"?

A: Meaningful digits which are known with certainity. Eg: 4.007 has 4 significant figures.

Q: Calculate the no. of moles present in

a) 540 g. of glucose b) 200 g. of $CaCO_3$

A: (a) $n_{glucose} = \frac{mass}{g.m.mass} = \frac{540}{180} = 3$ moles

(b) $n_{CaCO_3} = \frac{mass}{g.m.mass} = \frac{200}{100} = 2$ moles

Q: The empirical formula (E.F.) of a compound is CH_2O. Its molecular weight is 90. Calculate the molecular formula of the compound.

A: E.F. = CH_2O

E.F.Wt. = 12 + 2(1) + 16 = 30

$n = \frac{M.F.Wt.}{E.F.Wt.} = \frac{90}{30} = 3$

M.F. = $(E.F.)_n = (CH_2O)_3 = C_3H_6O_3$

Q: Assign oxidation number of underlined elements

a) $\underline{Cr}_2O_7^{-2}$ b) $Ca\underline{O_2}$ C) $\underline{O}F_2$ d) $K_2\underline{Mn}O_4$

A: a) $\underline{Cr}_2O_7^{-2}$

$2x + 7(-2) = -2$

$\therefore x = 6$

b) $Ca\underline{O_2}$

$+2 + 2x = 0$

$\therefore x = -1$

(c) $\underline{O}F_2$

$x + 2(-1) = 0$

$x = +2$

d) $K_2\underline{Mn}O_4$

$2(+1) + x + 4(-2) = 0$

$\therefore x = +6$

Q: Calculate normality of H_2SO_4 solution if 50 ml of it completely neutralises 250 ml of 0.1 N $Ba(OH)_2$ solutions.

A: $V_1N_1 = V_2N_2$

$N_1 = \frac{V_2N_2}{V_1} = \frac{250 \times 0.1}{50}$

$= 0.5$ N



Q: Calculate the volume of 0.1 M $KMnO_4$ required to react with 100 ml of $H_2C_2O_4.2H_2O$ solution in presence of H_2SO_4?

A: 2 Moles of $KMnO_4$

= 5 Moles of $H_2C_2O_4.2H_2O$

$\frac{V_1M_1}{n_1} = \frac{V_2M_2}{n_2}$

$V_1 = \frac{V_2M_2n_1}{n_2M_1} = \frac{100 \times 0.1 \times 2}{5 \times 0.1} = 40$ ml

Q: What is the sign conversion of a) work done on the system and b) work done by the system?

A: a) work done on the system = +Ve

b) work done by the system = –Ve

Q: What are "intensive" and "extensive" properties?

A: **Intensive property:** The property of a system which depends upon the total amount of the material. eg: Mass, Volume

Extensive property: The property of a system which doesn't depend upon the total amount of material. eg: Density, Viscosity

Q: The equilibrium constant for a reaction is 10. (T = 300 K). What will be the value of $\Delta G°$?

A: $\Delta G° = -2.303\ RTlog\ K_c$

$= -2.303 \times 8.314 \times 300 \times \log 10$

$= -2.303 \times 8.314 \times 300 \times 1 = -5.744$ K.J

Q: State 3rd law of thermodynamics.

A: The entropy of a pure and perfect crystal is zero at absolute zero temperature.

$\lim_{T \to 0} S = 0$

Q: Define "Enthalpy".

A: The total heat content of a system at constant pressure & temperature.

Q: Define "Entropy", "Standard molar entropy".

A: **Entropy:** The degree of disorderness of molecules of the system.

Standard molar entropy: The entropy of 1 mole of a substance at 1 atom pressure & 25°C.

Q: What is "Gibbs energy"?

A: The amount of energy available from a system which can be converted to useful work at constant Pressure & Temperature.

Q: Enthalpies of formation of CO, CO_2, N_2O and N_2O_4 are –110, –393, 81 and 9.7 K.J mol^{-1} respectively. Find the value of Δ_rH for the reaction $N_2O_4 + 3CO \rightarrow N_2O + 3\ CO_2$.

A: $\Delta_rH = H_{products} - H_{reactants}$

$= [3\ H_{CO_2} + H_{N_2O}] - [H_{N_2O_4} + 3H_{CO}]$

$= [3 \times (-393) + 81] - [9.7 + 3(-110)]$

$= -778$ K.J

Q: What is "homogeneous equilibrium"?

A: The equilibrium in which all the reactants and the products are present in same phase

$N_2\ (g) + 3\ H_2\ (g) \rightleftharpoons 2\ NH_3\ (g)$



Writer:
ANS Sankara Rao
Subject Expert

Q: What is "heterogeneous equilibrium"?

A: The equilibrium in which reactants & products are present in different phase.

$CaCO_3\ (s) \rightleftharpoons CaO\ (s) + CO_2\ (g)$

Q: What is meant by "dynamic equilibrium"?

A: The reversible reaction in which the rate of forward reaction is equal to the rate of backward reaction and both are taking place even at equilibrium state.

Q: Calculate pH of 0.1825% HC*l* aqueous solution.

A: $[H^+] = N = \frac{0.1825}{37.5} \times \frac{1000}{100} = 5 \times 10^{-2}$

$pH = -\log [H^+]$

$pH = -\log [5 \times 10^{-2}] = -[\log 5 + \log 10^{-2}]$

$= -[0.6990 - 2] = 1.3010$

Q: Calculate pH of 10^{-8} M NaOH.

A: $[OH^-] = [OH^-]_{NaOH} + [OH^-]_{H_2O}$

$= 10^{-8} + 10^{-7} = 10^{-7}\ (10^{-1} + 1)$

$= 1.1 \times 10^{-7}$

$pOH = -\log[OH^-] = -\log[1.1 \times 10^{-7}] = 6.96$

$\therefore pH = 14 - pOH = 14 - 6.96 = 7.04$

Q: Calculate pH of 0.05 M $Ba(OH)_2$ solution.

A: $[OH^-] = N = 2 \times 0.05 = 0.1 = 10^{-1}$

$pOH = -\log[OH^-] = -\log[10^{-1}] = -(-1) = 1$

$pH = 14 - pOH = 14 - 1 = 13$

Q: Define pH.

A: Negative logarithm of H^+ ion concentration

$pH = -\log [H^+]$

Q: What is "Solubility Product"?

A: The product of concentration of Cations & Anions present in saturated salt solution.

Units: $(moles/lit)^n$

Q: 50 ml of NH_4OH & 25 ml of 2M NH_4Cl were mixed to make a buffer. What is its pH if its Pk_b is 4.8

A: $pOH = pk_b + \log \frac{M_sV_s}{M_bV_b}$

$= 4.8 + \log \frac{2 \times 25}{0.1 \times 50} = 4.8 + 1 = 5.8$

$\therefore pH = 14 - pOH$

$= 14 - 5.8 = 8.2$

Q: All the bronsted bases are Lewis bases. Explain.

A: Bronsted base is proton acceptor.

$NH_3 + H^+ \rightarrow NH_4^+$. Lewis base is electron pair donor. Where NH_3 can accept a proton (H^+) and donates lone pair of electrons to H^+ ion. So NH_3 is Bronsted base as well as Lewis base.

Q: Classify the following solutions of salts into acidic and basic A*l*C*l*$_3$, Na_2CO_3, $CuSO_4$, CH_3COONa.

A: **Acidic:** $CuSO_4$ & A*l*C*l*$_3$

Basic: CH_3COONa & Na_2CO_3

Q: What are 'London Forces'?

A: Forces of attraction between 2 temporary dipoles. Eg: n-pentane.



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.

ప్రతిభ

ఆహారానికి ఏదీ భద్రత...?

జనరల్ స్టడీస్

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

- భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు
- 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.
- సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కలవరపెట్టేదైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరఫున కేంద్రమంత్రి సురేష్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

- సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్ఠవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.
- డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశాల్లో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరిచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌తో గొంతు కలిపాయి.
- నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

> *అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.*

- సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం ఆర్థాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.
- 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

- అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్చలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.
- ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇది దోహదం చేస్తాయని పేర్కొంది.
- వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్రాన్ గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.
- ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికరక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

> *ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.*

- డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

- 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయి సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయి సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.
- మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

హాయ్! బుజ్జీ!!



రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

తయారీ ఎలా?



1

◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



2

◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



3

◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



4

◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.


పుట్టింది ఎప్పుడంటా?

- 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
- జస్టిన్ స్క్యాబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
- ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

లోపల పువ్వులెలా?

- ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.






దారి కనుక్కోండి!

సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We ____ with our (ముక్కు)
2. We ____ with our (కళ్లు)
3. We ____ with our (చెవి)
4. We ____ with our (నాలుక)
5. We ____ with our (చేతులు)

జవాబులు: స్కూల్ సవాల్: 1.1857 2.పోర్చుగల్ 3.రాయ్‌పూర్ కవలలు: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See 3.Listen 4.Taste 5.Touch



ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు

- మదర్ థెరిసా

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Thumb - థమ్
Subtle - సటల్



కవలలేవి?

ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



వయోజనులు నిత్యం కేంద్రాలకు హాజరుకావాలి

సాక్షరభారత్ డీడీ వెంకటేశ్వర్‌రావు

కొండగడప(మోత్కూరు), న్యూస్‌టుడే: నిరక్షరాస్యులైన వయోజనులు అక్షరాస్యులుగా మారేందుకు నిరంతరం సాక్షరభారత్ కేంద్రాలకు హాజరుకావాలని సాక్షరభారత్ డీడీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం రాత్రి మోత్కూరు మండలం కొండగడపలోని సాక్షరభారత్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు వల్ల విజ్ఞానం వస్తుందని, నిత్యజీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలు విద్యతోనే పరిష్కారమవుతాయని అన్నారు. సాక్షరభారత్ కేంద్రాలలో అక్షరాస్యులుగా మారిన వారు తమకు వచ్చిన చదువును మరిచిపోకుండా ఉండేందుకు కేంద్రాలలోని పుస్తకాలను చదివే ఆలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కేంద్రాలకు వచ్చే దినపత్రికలను చదవడం వల్ల సమాజంపై అవగాహన ఏర్పడుతుందని, దేశంలో నిత్యం ఏం జరుగుతుందో తెలుస్తుందని వెంకటేశ్వర్‌రావు వివరించారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతీ ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ మమత, స్థానిక సర్పంచి ఉమారాణి, ఎంపీటీసీ సభ్యురాలు ఎ.పద్మ, ఎంసీఓ వై. వీరాస్వామి తదితరులున్నారు. అనంతరం వారు మోత్కూరులోని అన్నెపువాడలోని కేంద్రాన్ని పరిశీలించారు.



కొండగడపలో సాక్షరభారత్ కేంద్రంలో వయోజనులతో మాట్లాడుతున్న డీడీ వెంకటేశ్వర్‌రావు తదితరులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడి' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్–2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం

11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 డీజే రిపీట్

01:15 స్టే..పూలిష్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 నా షో నా ఇష్టం రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 పోవే..పోరా

09:00 పటాస్

09:30 టాప్స్

10:00 క్రిరాక్ కిడ్స్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ.9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ.3:45, రా.7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడే వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఘూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బఠానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^0, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360^0, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^0, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360^0, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360^0, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360^0, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

(SVBC) **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

(భక్తి TV) **ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారాస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు, 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

(ZEE తెలుగు) **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

(maa) **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

(GEMINI) **ఉదయం:** 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

(HBO) ఉదయం: 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, మధ్యాహ్నం:12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, సాయంత్రం: 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ రాత్రి: 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

ఆరుతడి పైర్లలో సూక్ష్మనీటి పద్ధతులు



ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. రబీ పంటల్లో నీటి యాజమాన్యం- పంటల పెరుగుదల, దిగుబడి, నాణ్యతలపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారి రవీందర్ తెలిపారు.

వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం తక్కువగా ఉంది. వినియోగించే నీటిలో దాదాపు 60-70 శాతం వృథా అవుతోంది. దీని వల్ల సాగునీటి వృథా, భూసారం క్షీణించడం వంటి సమస్యలు వస్తున్నాయి. అధునాతన నీటి పారుదల విధానాలైన బిందు, తుంపర్ల సేద్య పద్ధతుల వల్ల దిగుబడి పెరగడమే గాకుండా, నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

నీరు ఎక్కువగా లభ్యమయ్యే చోట ఆ నీటిని విచ్చలవిడిగా వాడటం వల్ల సారవంతమైన భూములెన్నో చౌడు భూములుగా మారి పంటల దిగుబడి క్రమేణా తగ్గుతున్నాయి. నేలలు కోతకు గురవుతున్నాయి. ఆశించిన దిగుబడులు సాధించాలంటే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. నీటిని పెట్టిన మొదటి మూడు రోజులలో నేల లోపలి పొరలు నీటితో నిండిపోయి పొరలలో ఉన్న గాలి బయటికి వెళ్ళిపోతుంది. దీనివల్ల నేలలో సామర్థ్యం కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటుంది. మొక్కలకు కావల్సిన పోషకాలు భూమిలో ఉన్నా మొక్కలకు లభ్యం కావు. దీని వల్ల మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. కానీ బిందు సేద్య పద్ధతిలో నీటిని ప్లాస్టిక్ గొట్టాలు, ఇతర పరికరాలతో బిందువుల రూపంలో అన్ని మొక్కలకు సమానంగా మొక్క వేరు భాగానికి కావల్సినంత అందించవచ్చు. ఈ విధానం ద్వారా భూమిలో ఎప్పుడు తేమ మాత్రమే ఉండేలా చేయవచ్చు.

★ మొక్కజొన్న జళ్ళు వేసేటప్పుడు, పాలు పోసుకునేటప్పుడు, గింజ గట్టిపడే సమయంలో నీరు చాలా అవసరం. వేసవిలో 7-10 రోజులకొకసారి నీటితడి ఇవ్వాలి.

★ వేరుశనగలో విత్తిన వెంటనే ఒకతడి, తరువాత 20-25 రోజులకు, ఆ తరువాత పూత, కాత దశలో ప్రతి 10-15 రోజులకు ఒక తడి ఇవ్వాలి.

★ పొద్దుతిరుగుడు పువ్వులో ఆశించిన దిగుబడులు సాధించాలంటే మొగ్గతొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టే దశలలో నీటితడి అవసరం.

★ నువ్వు పంటకు పూత, కాయ పెరుగుదల, గింజకట్టు దశల్లో తడులు తప్పక ఇవ్వాలి.

★ శనగ పంటలో విత్తిన 20-25 రోజులలో తడి ఇవ్వాలి. శనగ పంట ఎక్కువ నీటిని తట్టుకోదు. అవసరాన్ని బట్టి నీటి తడులు అందించాలి.

★ కుసుమ పంటకు తేమ ఉన్న బలమైన నేలల్లో సకాలంలో వేసిన పంటకు నీరు ఇవ్వాల్సిన అవసరం లేదు. తేలిక నేలలకు, ఆలస్యంగా విత్తిన పంటకు ఒకటి, రెండుసార్లు తడులు ఇవ్వాలి. పూత మొదలైన తరువాత నీరు పెట్టవద్దు.

– న్యూస్‌టుడే, జైనథ్ (ఆదిలాబాద్ వ్యవసాయం)

పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం


పాడి పశువులను విధిగా పాకల్లో ఉంచి పోషించడాన్ని ప్రతి రైతు కర్తవ్యంగా భావించాలి. వాతావరణ ప్రభావాల నుండి పశువులను కాపాడే పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం-ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షేడ్ రేకులతో గానీ కప్పి నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్', పశువుల నుండి వెలువడే మూత్రం, పేడ వెళ్లడానికి కాలువలు నిర్మించాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి ప్రస్తుతం మార్కెట్లో లభించే రబ్బర్ మ్యాట్లను పరచడం మంచిది.

తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. నిర్ణీత కాల వ్యవధిలో సున్నం వేయించాలి. పశువుల మలమూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. ఒకే వరుస కానీ, రెండు వరుసలు కానీ పశువులను కట్టి మేపడం, పాలు పిండటం వల్ల పశువులు వాతావరణ తీవ్రతకు గురికావు. వ్యాధుల నివారణ కూడా సులభం అవుతుంది.

షెడ్‌లు కట్టే రైతులను ప్రోత్సహించేలా షెడ్‌లకు బీమా సౌకర్యం కల్పించేందుకు రైతులను ప్రోత్సహించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. దీనిద్వారా పశుగ్రాసాలకు సహజంగా ఎరువు లభిస్తుంది. ఒకటి, రెండు పశువులున్నా పాక నిర్మాణం చేపట్టాలి. అగ్ని ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు కల్పించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

– మధుసూదనరావు, విజయ డెయిరీ, ఆదిలాబాద్

ఉత్తీర్ణత ముందు ప్రమాణాలు దిగదుడుపు



పది, ఇంటర్లో వాసికన్నా రాశికే ప్రాధాన్యం

సర్వత్రా చర్చనీయాంశమైన హైకోర్టు వ్యాఖ్య

నిబంధనలు గాలికి వదిలేస్తున్న విద్యాశాఖ

గుర్రంపోడు, న్యూస్‌టుడే: పది, ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌తో విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయని హైకోర్టు వ్యాఖ్యానించడం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది. విద్యార్థుల ఫలితాల్లో వాసి కన్నా రాశికే అధికారులు ప్రాధాన్యమిస్తుండటంతో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఏర్పడుతోంది. ఏడాదంతా విద్యాబోధన ఎలా సాగినా సరే ఉత్తీర్ణత శాతం మాత్రం బాగా ఉండాలన్న విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో పరీక్షల్లో జరిగే మాస్ కాపీయింగ్‌కు స్వయంగా సూపరింటెండెంట్ నుంచి ఇన్విజిలేటరు వరకూ ఉత్తీర్ణత కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మాస్‌కాపీయింగ్ జరుగుతోందని ఫిర్యాదులొచ్చిన చోట మాత్రం విద్యాశాఖ అధికారులు నామమాత్రంగా తనిఖీలు జరిపి మ..మ.. అనిపిస్తున్నారు. దీంతో జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరిగితే విద్యాప్రమాణాలు మాత్రం దారుణంగా పడిపోతున్నాయని ఉపాధ్యాయులే మధనపడిపోతున్నారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థల పరీక్షల విభాగాల్లో ప్రక్షాళన చర్యలు చేపడుతున్నట్లు ఏటా అధికారులు ప్రకటనలు చేస్తున్నా వాస్తవంలో మాత్రం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలేవీ కనిపించవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా హైకోర్టు స్పందించిన తీరుతో ఇకనైనా మాస్‌కాపీయింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న తీరిదీ..

పరీక్షల కేంద్రాలు ప్రకటించిన నాటి నుంచి విద్యాశాఖ అధికారుల హడావిడి మొదలవుతుంది. పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది ఎంపికలో ప్రమాణాలు, నిబంధనలు పాటించకపోవటంతో విద్యాప్రమాణాలు పడిపోవటానికి మార్గం ఏర్పడుతోంది. పరీక్షా కేంద్రాలకు ముఖ్య పర్యవేక్షణాధికారి ఎంపిక నుంచి ఇన్విజిలేటరు ఎంపిక వరకు హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల సూచనల మేరకే జరుగుతున్నాయి. కనీసం మండలానికి చెందని వారిని ఈ విధుల్లో నియమించాల్సిన విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వారు చెప్పిన వారికే విధులను కేటాయిస్తున్నారు. దీంతో హైస్కూళ్లలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకే ఇన్విజిలేషన్ విధులు ఇస్తున్నారు. ఇక ఆ పాఠశాల విద్యార్థుల పరీక్షల ఫలితాలు మెరుగ్గా ఉండేందుకు వారే(ఇన్విజిలేటర్లు) చీటీలు అందిస్తూ మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఇక తనిఖీలు జరిపే నెపంతో మండల విద్యాధికారుల నుంచి ముఖ్య పర్యవేక్షణ అధికారులు కూడా కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తుండటంతో తనిఖీలు నామమాత్రం కావటం, దొరికిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవటం నిత్యకృత్యంగా మారింది. దీంతో విద్యార్థుల్లో కూడా తాము ఉత్తీర్ణులయ్యేందుకు ఉపాధ్యాయులే ఏదో ఒకటి చేస్తారన్న ధీమా పెంచుకుని చదువుపై శ్రద్ధ చూపటం లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సీసీ కెమెరాలు ఉంటేనే..



పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తేనే పరీక్షా కేంద్రాల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు సూచిస్తున్నారు. గత ఏడాది పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించగా ఫలితాలు తగ్గే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు, విద్యాశాఖలో అధికారులు వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. ఈసారైనా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రాసి తగ్గినా వాసి పెరిగే అవకాశాలున్నాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మండల కేంద్రాల్లో ప్రస్తుతం నాలుగుడుగుల డెస్క్ బెంచీ మీద ఇద్దరు విద్యార్థులు కూర్చునేందుకు అనుమతిస్తున్నారు. కానీ వారిద్దరూ పక్కపక్కన ఉండటంతో వారిద్దరూ కాపీయింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని సీనియర్ ఉపాధ్యాయుడొకరు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ స్కూల్ ఉంది. వాటిల్లో సీసీ కెమెరాలు ఇప్పటికే ఉన్నాయి. వాటిల్లో ఒకే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయటం బాగుంటుందని మరో చోట రెండో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయటం వల్ల అక్కడ సీసీ కెమెరాలు లేని భవనాల్లో పరీక్షలు మాస్‌కాపీయింగ్‌కు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ఈనాడు-ఈటీవీ **తెలంగాణ** నిర్వహిస్తున్న

ముత్యాల ముగ్గుల పోటీ జనవరి 2, 2018 విజేతలు

1. డి. అనిత, హైదరాబాద్; 2. జ్యోతి, ఖమ్మం; 3. కె. మాధవీలత, హన్మకొండ; 4. వి. విజయలక్ష్మి, హైదరాబాద్; 5. వి. ఉష, చెన్నై; 6. టి. సరళ, మంచిర్యాల్; 7. ఏ. రాధిక, గోదావరిఖని; 8. జె. నవ్యశ్రీ, ఖమ్మం; 9. ఏ. శ్రీలక్ష్మి, అడశర్లపాడు, ఖమ్మం; 10. వై. జయ, బెల్లంపల్లి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: రైతులకు మద్దతు ధర అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే ఆర్. రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం హాకా ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల శ్రీనివాస్‌యాదవ్, జడ్పీటీసీ సభ్యుడు ఆలంపల్లి నర్సింహ, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కేసాని లింగారెడ్డి, సర్పంచి అందుగుల ముత్యాలు, ఎంపీటీసీ సభ్యుడు చేరిపల్లి కైలాసం, ఆత్మ రాష్ట్ర కమిటీ సభ్యుడు అబ్బనబోయిన శ్రీనివాస్‌యాదవ్, హాకా జిల్లా మేనేజర్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

మద్దతు ధర రూ.5,450 పొందాలి

రైతులు తాము పండించిన పంటను మధ్యవర్తులకు విక్రయించకుండా స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర క్వింటాకు రూ. 5,450 పొందాలని హాకా జిల్లా మేనేజర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్గొండ జిల్లాలోనే మొదటి సారిగా కొండమల్లేపల్లిలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తమ వెంట పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం నకలు ప్రతులను తెచ్చుకోవాలని కోరారు. త్వరలో నల్గొండ, హాలియా, చండూరు మార్కెట్లలో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి రాజేందర్, కొనుగోలు కేంద్రం ఇన్‌ఛార్జి సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

మూడు వారాల కూలి ఇవ్వలేకపోయారా..?

కోరట్ల నర్సరీని సందర్శించిన రాష్ట్ర ప్రత్యేక అధికారిణి ప్రియాంక వర్గీస్



మొక్కలు ఎండిపోవడానికి గల కారణాలను తెలుసుకుంటున్న ప్రియాంక, గౌరవ్ ఉప్పల్

చందంపేట, న్యూస్‌టుడే: 'తెలంగాణ రాష్ట్రాన్ని హరితహారంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పాన్ని నీరుగారుస్తున్నారు... రాష్ట్రమంతటా నర్సరీ కేంద్రాలు ఓ ఎత్తయితే.. నల్గొండలో మరో ఎత్తున్నాయి. ఇక్కడ మొక్కలు ఎండిపోవడానికి అశ్రద్ధే కారణమని, ఇందుకు సంబంధించిన అధికారులపై చర్యలు తప్పవ'ని హరితహారం రాష్ట్ర ప్రత్యేక అధికారిణి ప్రియాంక వర్గీస్ హెచ్చరించారు. నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని కోరట్ల గ్రామంలో గల నర్సరీ కేంద్రంలో మొక్కలు భారీ సంఖ్యలో ఎండిపోవడంతో డిసెంబర్ 26న 'ఈనాడు' ప్రధాన సంచికలో 'ఎండిన లక్ష్యం' చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన సీసీఎఫ్(చీఫ్ కన్జవేటర్ ఆఫ్ ఫారెస్ట్) వినోద్‌కుమార్ అదే నెలలో 27న నర్సరీని సందర్శించారు. బుధవారం జిల్లా కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్‌తో కలిసి ఆమె ఆ నర్సరీ కేంద్రాన్ని పరిశీలించారు. మొక్కలు ఎందుకు ఎండిపోయాయి, వాటిని తొలగించి కొత్త మొక్కలు ఎందుకు నాటలేదని అటవీ శాఖ అధికారులను ప్రశ్నించారు. నిధులు లేక కూలీలు పని మానేయడంతో మొక్కలు ఎండిపోయాయని స్థానిక అధికారులు సమాధానమిచ్చారు. నెలవారి వేతనాలు ఒకరోజు ఆలస్యమైతే ఆ రోజు భోజనం చేస్తారా.. ఉపవాసం ఉంటారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మేం వస్తున్నామని తెలుసుకొని నాటకాలు ఆడబోయారని నర్సరీ కేంద్రాన్ని చూస్తే తెలిసిపోతోందని, మొక్కలకు నీరు పోసేందుకు ఇద్దరు కూలీలకు కూలి ఇచ్చే మూడు వారాల నిధులు జిల్లాలో లేవా.., మొక్కలు ఎండిపోకుండా నెట్‌ను ఎందుకు ఏర్పాటు చేసుకోలేదని డీఎఫ్‌వో శాంతారాంను ప్రశ్నించారు. హెచ్ఎండీఎల్ విత్తనాలు ఇతర జిల్లాల వారు కొనుగోలు చేసుకొని విత్తారు. ఈ పని మీరెందుకు చేయలేదని అన్నారు. మొక్కలు, సంచులను పరిశీలించి.. ఎర్రమట్టి బదులు మొరం మట్టిని వాడటంతో ఎండకు ఎండిపోయాయని అభిప్రాయపడ్డారు. ఈనెల 15లోగా మరో సారి తనిఖీకి వస్తానని, ఎండిన మొక్కలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం గాగిల్లాపురం గ్రామ సమీపంలోని నర్సరీ కేంద్రంలో మొక్కలను సంరక్షించిన అటవీశాఖ సిబ్బందిని అభినందించారు. కోరట్ల నర్సరీ కేంద్రం బీట్, సెక్షన్ అధికారులకు వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్

హరితహారం కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. జిల్లాలో 154 నర్సరీ కేంద్రాలుండగా కోరుట్ల తరహా కేంద్రాలు ఎక్కడ లేవన్నారు. చందంపేట మండలంలో కొనసాగుతున్న నాలుగు నర్సరీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను ఎంపీడీవో, తహసీల్దార్‌కు అప్పగిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లో కూలీలకు వేతనాలు పంపిణీ చేస్తామన్నారు. వారి వెంట ఆర్డీవో గుగులోతు లింగ్యానాయక్, నల్గొండ, నాగార్జునసాగర్ డీఎఫ్‌వోలు సుదర్శన్‌రెడ్డి, శాంతారాం, రవి, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ రవిశంకర్, ఎఫ్‌ఆర్వో సర్వేశ్వర్, తదితరులు ఉన్నారు.

నేరాల అదుపునకు పటిష్ఠ చర్యలు: డీసీపీ



నిఘా కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్న డీసీపీ రాంచంద్రారెడ్డి

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: నేరాల అదుపునకు పోలీసుశాఖ తరుపున పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ రాంచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని దస్త్రాలను, నిఘాకెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదుతో కేసులు నమోదు చేయటంతోపాటు క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. కమిషనరేట్ ఏర్పాటు తర్వాత ప్రజలకు త్వరితగతిన సేవలు అందటంతో పోలీసులపై కూడా ప్రజలకు విశ్వాసం పెరిగిందన్నారు. మహిళలు కేవలం సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం అందించినా షీటీంలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో నిఘా కెమెరాల ప్రభావం వల్ల గొలుసు దొంగతనాలకు పాల్పడే దుండగులు శివారు ప్రాంతాలైన పోచంపల్లి, బొమ్మలరామారం, బీబీనగర్ ఎంచుకుంటున్నారని చెప్పారు. ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి దుండగులను పట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో లైసెన్స్ మేళా..

మండలంలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, మండలంలో లైసెన్స్ లేని వారికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లోనే లైసెన్స్ మేళాను నిర్వహించనున్నట్లు డీసీపీ రాంచంద్రారెడ్డి తెలిపారు. ఈ నెల 10వరకు మండలంలో లైసెన్స్ లేని వారు పేరును నమోదు చేసుకుంటే సాధారణ రుసుము ద్వారా శిక్షణ డ్రైవింగ్ లైసెన్స్‌ను అందిస్తామన్నారు. పోచంపల్లిలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ఇద్దరు ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఏసీపీ రమేష్‌జాదవ్, ఎస్సై రాఘవేందర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మునుగోడు

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

వెల్మకన్నె(మునుగోడు), న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ పార్టీ ఫిరాయింపులకు తెరాస, భాజపా ప్రోత్సహిస్తుందని సీపీఐ మండల కార్యదర్శి సురిగి చలపతి అన్నారు. బుధవారం వెల్మకన్నెలో ఆపార్టీ గ్రామశాఖ ఏడవ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. సీపీఐ పార్టీ సభ్యత్వం పునరుద్ధరణ చేసుకొని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం నూతన గ్రామశాఖ కార్యదర్శిగా భీమనపల్లి రమేష్, సహాయ కార్యదర్శిగా దోటి చెన్నయ్యతో పాటు పలువు రిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బొమ్మరబోయిన లాలు, తదితరులు పాల్గొన్నారు.

జనగాం గ్రామశాఖ అధ్యక్షునిగా యాదయ్య

జనగాం(సంస్థాన్ నారాయణపురం), న్యూస్‌టుడే: మండలంలోని జనగాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గడ్డం యాదయ్యను బుధవారం ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ నయాంషరీఫ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఎన్నికకు సహకరించిన పాల్వాయి స్రవం తికి యాదయ్య కృతజ్ఞతలు ప్రకటించారు. ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే. బడేసాబ్, మండల అధ్యక్షుడు ప్రజ్ఞానాయక్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: లక్ష్యాన్ని ఛేదించేందుకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని చౌటుప్పల్ ఆర్డీవో ఎస్. సూరజ్‌కుమార్ తెలిపారు. ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని బుధ వారం ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొల్ల



సమావేశంలో మాట్లాడుతున్న చౌటుప్పల్ ఆర్డీవో సూరజ్‌కుమార్

శివశంకర్ జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా సూరజ్ కుమార్ మాట్లాడుతూ కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు. శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి బొంగు లావణ్య, వార్డు సభ్యుడు గోశిక కరుణాకర్, శ్రీఅక్షర స్టడీ సర్కిల్ డైరెక్టర్ మల్లేశ్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

సమాజంతో పాటు మహిళ లోకానికి సావిత్రి బాయి పూలే చేసిన సేవలు మరువలేనివని, నేటి తరం ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, మేధావులు కొనియాడారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని పలు కూడళ్లలో పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు.

– న్యూస్‌టుడే, బృందం



గుజ్జలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో సీపీఎం నాయకులు



చౌటుప్పల్‌లో సావిత్రిబాయిపూలేకు నివాళి అర్పిస్తున్న జన విజ్ఞాన సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడు తాటికొండ రమేశ్, తదితరులు



నాంపల్లిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీ మాస్ నాయకులు



మర్రిగూడ మండలం ఖుదాభక్షుపల్లిలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు




మునుగోడు చౌరస్తాలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

సీఎం సహాయ నిధి చెక్కు మంజూరు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ బంగారుగడ్డకు చెందిన ఒట్టికోట శిరీషకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.20వేలు మంజూరయ్యాయి. బుధ వారం ఈ సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. కార్య క్రమంలో షాదీఖానా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, తెరాస నాయకులు బొడిగె ఆనంద్, రాకేశ్‌లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే

చండూరు, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభా కర్‌రెడ్డి అన్నారు. గట్టుప్పలకు చెందిన తిరందాసు నర్సింహ, ఆయన భార్య శారదలకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 12వేలు, రూ. 10వేల చెక్కులను, చండూరుకు చెందిన తాడిశెట్టి నర్సమ్మకు రూ. 54వేలు, పుల్లెంలకు చెందిన ముక్కాముల లక్ష్మయ్యకు రూ. 10వేల చెక్కును బుధవారం హైదరాబాదులోని ఆయన నివా సంలో అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా నియో జకవర్గంలోని పేద కుటుంబాలకు ఆర్థికసాయం అందజే స్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ తోకల వెంకన్న, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నామని గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు బండారు చంద్రయ్య, కోడి వెంకన్న, చెరుకు రాజు, దోర్నాల విష్ణు, పెద్దగాని రాఘవేంద్ర, బొడిగ వెంకటేశం పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరు తున్నారని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. మండలంలోని కచిలపురానికి చెందిన పలువురు యువకులు బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో తెరాసలో చేరారు. పార్టీలో చేరిన వారిలో జెట్టి గణేష్, బోయపల్లి నర్సింహగౌడ్, ఏర్పుల సురేష్, కొండల్, లింగయ్య, నీరుడు కృష్ణ, కందుల రవి, బోయపల్లి జగన్, పందుగ రాజశేఖర్‌తో పాటు పలువురు చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ బండ పురుషోత్తంరెడ్డి, మండల అధ్య క్షుడు బొడ్డు నర్సింహగౌడ్, గురిజ సతీష్‌గౌడ్, ఏర్పుల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో 66 శాతం బీసీలుంటే



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కేవలం 17 శాతం మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 17 మంది ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 మంది అసెంబ్లీ స్థానాలకు ఒక్కరూ కూడా బీసీలు లేరని తెలిపారు. చట్టసభల్లో రిజ ర్వేషన్ కావాలంటే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటపల్లి వెంకటేశంగౌడ్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కులకచర్ల శ్రీనివాస్, నాయకులు పాలకూర్ల శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

(నిన్నటి ధరలు) కిలో ఒక్కంటికి రూ.ల్లో

చౌటుప్పల్(గ్రామీణం), న్యూస్‌టుడే: మార్కెట్ ధరల ప్రకారం.. టమాట 10, వంకాయ 20, దొండ 30, ఆలుగడ్డ 20, దోస 25, బెండ 40, గోకర 40, బీర 50, కాకర 40, సొర 10, క్యారెట్ 60, క్యాబేజీ 40, పచ్చిమిర్చి 40, చామగడ్డ 40, కీర 30, చిక్కుడు 40, పొట్లకాయ 40, మునగ 150, బిన్నీస్ 40, కంద 50, క్యాప్సికమ్ 60, బీట్‌రూట్ 30.

సంక్షిప్త వార్తలు

చండూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ అడిగే అర్హత పాల్వాయి స్రవంతిరెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ నాయకుడు, చండూరు మాజీ సర్పంచి కోడి గిరిబాబు బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆయన వెంట దోటి వెంకటేశ్‌యాదవ్, కట్ట అంజయ్య తదితరులున్నారు.

మర్రిగూడ, న్యూస్‌టుడే: వివేకానందుని జయంతి వేడు కలను పురస్కరించుకొని ఈనెల 5న విద్యార్థులకు వ్యాసర చన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుందని సహ స్ర వేదిక సేవాసంస్థ ప్రతినిధి అరుణ్‌సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మర్రిగూడ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర అధ్య క్షుడిగా ఎర్రోల రాములు నియామకంపై తెరాస మండల ప్రధాన కార్యదర్శి లపంగి నర్సింహ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మర్రిగూడలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఆయన వెంట తెరాస పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

సినిమాలు

చౌటుప్పల్
అంజిరెడ్డి: హలో
శ్రీనివాస: ఎంసీఏ

బహుజన అభినందన యాత్ర ప్రారంభం



పస్నూరులో బహుజన యాత్ర ప్రారంభిస్తున్న పాండురంగ ప్రజాసింగం

పస్నూరు(నాంపల్లి), న్యూస్‌టుడే : బీఎస్పీ నాంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో పస్నూరులో బుధవారం 'మనం బహుజనం' అభినందన యాత్రను ఆపార్టీ మండల అధ్య క్షుడు ఆకారపు పాండురంగ ప్రజాసింగం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ పార్టీ ద్వారానే బహుజనుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బలహీన వర్గాల మహిళల విద్యాభివృద్ధికి కృషిచేసిన సావిత్రీబాయి పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల ఉపాధ్యక్షుడు కిన్నెర పాండు, కాశిమళ్ల కృష్ణయ్య, ఆకారపు రామస్వామి, వర్ష వెంకటయ్య, గుండ్ల వెంకన్న, ఆనంద్, మైబయ్య, జాషువా, సోమయ్య పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కొయ్యలగూడెం(చౌటుప్పల్‌గ్రామీణం), న్యూస్‌టుడే: కొయ్యలగూడెనికి చెందిన గుండ్ల సుధాకర్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి అపహరించుకుపోయారు. మంగళవారం బాధితుడు లేచి చూడగా ఇంటి ఎదుట నిలిపిన వాహనం కనిపించకుండా పోయింది. రోజంతా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై చిల్లా సాయిలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మునుగోడు

ధర్మదీక్ష గోడ పత్రిక ఆవిష్కరణ

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: ఈనెల 7న గజ్వేల్‌లో జరుగు ఆయుత ధర్మదీక్షను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టీఎస్ సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో ఆయుత ధర్మదీక్షకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాంకుడోతు బుజ్జి, ఎంపీడీవో సరస్వతి, సీపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని అనాథాశ్రమానికి శ్రీజ్ఞానేశ్వరానందస్వామి ఆశీర్వాదంతో హిందూ ధర్మ ప్రచార సమితి రాష్ట్రశాఖ ద్వారా 60 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. బుధవారం ప్రచార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలిశెట్టి లక్ష్మీశేఖర్, ప్రతినిధులు అనాథాశ్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పోకల రామకృష్ణ, వలిశెట్టి శారద, పోకల మాధవి, రాపర్తి ఆనంద్, కోసిగి శ్రీనివాస్, బొడ్డు మల్లికార్జున్, కొక్కుల ఎల్లయ్య, బొజ్జ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

అల్లాపురం(చౌటుప్పల్‌గ్రామీణం), న్యూస్‌టుడే: సేంద్రియ పద్ధతులను అవలంభించి వ్యవసాయరంగంలో అధిక దిగుబడులను సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారిణి అనురాధ తెలిపారు. అల్లాపురంలో బుధవారం నిర్వహించిన పరాంపరగత్ కృషి వికాస్ యోజన(పీకేవీవై) పథకం అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. భూ సంరక్షణకు రసాయనిక ఎరువుల వాడకంను తగ్గించాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం రైతులకు వేప పిండి, లైటుట్రాప్స్, వర్మిబెడ్స్, జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి రాజేశ్వరి, ఏఈవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు నుంచి కిందపడి గీత కార్మికుడు మృతి

ఇడికుడ(చండూరు), న్యూస్‌టుడే: ఇడికుడ పంచాయతీ పరిధిలోని తాస్కానిగూడేనికి చెందిన కొంపల్లి అంజయ్య(50) తాటిచెట్టు పైనుంచి కిందపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. పోలీసులు, బంధువులు వివరాల ప్రకారం... మూడ్రోజుల క్రితం అంజయ్య తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడి గాయాలపాలయ్యారు. హైదరాబాదులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా బుధవారం ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

నేడు ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభ

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లోని నవోదయ హాలులో ఈనెల 4న ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభ జరుగనుంది. జిల్లాలోని మండలాల నుంచి విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు హాజరు కానున్నారని ఆ సంఘం జిల్లా కో-కన్వీనర్ కొండూరు వెంకటేశ్ తెలిపారు. మహాసభలకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు.

తాతామనువళ్ల అరెస్టు

తంగడపల్లి(చౌటుప్పల్‌గ్రామీణం), న్యూస్‌టుడే: మంత్రలు చేస్తున్నారనే నెపంతో తంగడపల్లికి చెందిన తాత మనవళ్లపై మంగళవారం ఉదయం గ్రామస్థులు దాడిచేసిన విషయం తెలిసిందే. కాగా.. పోలీసులు అనుమతి లేకుండా మరొకరి ఇంట్లో చొరబడి దుస్తులను అపహరించారని, మంత్రాలు చేస్తామని బెదిరించారని 452, 508 సెక్షన్ల కింద తాతమనవళ్లపై కేసు నమోదు చేశారు. మనవడు మైనర్ కావడంతో నల్గొండలోని బాలుర సంరక్షణ కేంద్రానికి తరలించారు. మల్లయ్యను రామన్నపేట కోర్టులో హాజరుపరిచారు.

మంద కృష్ణమాదిగ అరెస్టుకు నిరసన

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాది అరెస్టుకు నిరసనగా చౌటుప్పల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ కార్యకర్తలు బుధవారం ప్రదర్శన జరిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడుతున్న మంద కృష్ణను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెంచల శ్రీనివాస్, తూర్పింటి రవి తదితరులు పాల్గొన్నారు.

భాజపా సీనియర్ నాయకుడు మృతి

మర్రిగూడ, న్యూస్‌టుడే: మర్రిగూడ మండలం కమ్మగూడేనికి చెందిన భాజపా సీనియర్ నాయకుడు జెక్రియాస్ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా పలువురు భాజపా నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

వంటగదుల నిర్మాణంలో.... వీడని నిర్లక్ష్యం

☛ ఆరుబయట వంటలతో తప్పని ఇబ్బందులు ☛ అదనపు గదుల కోసం ఎదురుచూపులు



ఇడికుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీకి రేకును అడ్డంగా వేసి వంట చేస్తున్న కార్మికురాలు

చండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో వంట గదుల నిర్మాణానికి ఇటీవల ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరయ్యాయి. కాని నేటికీ గదుల నిర్మాణంలో మాత్రం పురోగతి లేదు. సర్పంచులు, ఎస్ఎంసీ ఛైర్మన్లు గదుల నిర్మాణంలో ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు స్థలాల కొరత ఇబ్బందిగా మారింది. ఆరుబయట వంటలతో తరగతి గదులు మసిబారిపోతున్నాయి. వర్షాకాలంలో సమస్యలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆర్ఎమ్ఎస్ఏ, స్థానిక సంస్థలతో రూ.75వేలతో వంటగదులను నిర్మించారు. ఇవి సామగ్రి భద్రపరచడానికి తప్ప వంట చేయడానికి ఉపయోగపడడం లేదు. దీంతో ఉపాధిహామీ నిధుల నుంచి పెద్దగదులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి: మండల పరిధిలో 36 పాఠశాలలుండగా కస్తాల, ఇడికుడ, జోగిగూడెం, తాస్కానిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో వంట గదుల నిర్మాణానికి ఇటీవల ఉపాధిహామీ నిధుల నుంచి రూ. 2లక్షల చొప్పున మంజూరయ్యాయి. కాని నేటికీ నిర్మాణాలు ప్రారంభం కాలేదు. కస్తాల ప్రాథమిక పాఠశాలలో స్థలం కొరత ఉండగా మిగిలిన చోట స్థలాలున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి తోడు ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ ఛైర్మన్ల అలసత్వంతో నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వంటగదులు లేకపోవడంతో ఆయా పాఠశాలల్లో చెట్ల కింద, రేకుల కింద వంటలు చేస్తున్నారు.

ఆర్ఎమ్ఎస్ఏ గదుల కంటే పెద్దగా ఉంటాయి: ఆర్ఎమ్ఎస్ఏ నిధుల నుంచి నిర్మించిన వంట గదులకంటే ఉపాధిహామిలో నిర్మించబోయే గదులు పెద్దగా ఉంటాయి. 4.5 మీటర్లు. పొడవు, 3.5 మీటర్లు. వెడల్పుతో రెండు గదలు నిర్మిస్తారు. వంట చేయడంతో పాటు వంట సామగ్రి, బియ్యం వంటివి అందులోనే భద్రపరుచుకోవచ్చు. వంట చేసేందుకు దిమ్మలను కూడా నిర్మిస్తారు. సర్పంచులు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు నిర్మాణ బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మిగిలిన పాఠశాలల్లో ఎదురుచూపులు: ఉపాధిహామీ నిధులతో వంట గదులను పెద్దగా నిర్మిస్తుండటంతో వంట గదులు సమస్యగా ఉన్న పాఠశాలల్లోనూ ఉపాధిహామీ నిధుల నుంచి నిర్మిస్తారని ఎదురుచూస్తున్నారు. చండూరు ఉన్నత పాఠశాలలో సమస్య తీవ్రంగా ఉంది. వంటగది ఎంత మాత్రం సరిపోవడం లేదు. అదనంగా నిధులు కేటాయిస్తే ఇప్పుడున్న గదికి అనుసంధానంగా గదులు నిర్మించేందుకు వీలుంటుంది.

నిర్మాణాలను ప్రారంభించేందుకు చర్యలు:

– శైలజ, ఎంపీడీవో, చండూరు.

వంట గదుల నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని గుర్తించి త్వరగా ప్రారంభమైయ్యేలా తగిన చర్యలు తీసుకుంటాం. ప్రజాప్రతినిధులు, ఛైర్మన్లు ముందుకురాని చోట మంజూరి రద్దుచేసి వేరొక పాఠశాలను ఎంపిక చేయాలని పై అధికారులకు నివేదిక పంపిస్తాం.

స్త్రీనిధి రుణాలపై మహిళలకు అవగాహన



సరంపేటలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మర్రిగూడ, న్యూస్‌టుడే: సరంపేటకి చెందిన 12 మహిళా సంఘాలకు రూ.30 లక్షలు మంజూరు కావడంతో వాటి ఉపయోగంపై మహిళలకు ఐకేపీ అధికారులు బుధవారం సరంపేటలో అవగాహన కల్పించారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్లను పూర్తి చేసుకోవాలని, మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి కె.రాజు నాయక్, ఏపీఎం అశోక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను వీడండి



మునుగోడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న ఉప్పులేటి నరేష్


మునుగోడు, న్యూస్‌టుడే: మూఢ నమ్మకాల అపోహలతో కలత చెంది ఇబ్బందులు గురికావొద్దని ఎస్సై రాములు అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జనమైత్రిలో భాగంగా మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ మారుతున్న కాలంలో మూఢ నమ్మకాలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకన్న గౌడ్, కానిస్టేబుల్ జానకీరామ్, గోపగోని శ్రీనుగౌడ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

అక్షర స్కూలులో 'రెడ్-డే'

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ విద్యానగర్‌లోని అక్షర స్కూలులో బుధవారం 'రెడ్-డే' నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎరుపు రంగు దుస్తులు ధరించి ఈ ఉత్సవానికి హాజరై కనువిందు చేశారు. విద్యార్థులు ఎరుపు రంగులో ఉండే పండ్లు, కూరగాయలు, పూలు, వస్తువులు సేకరించి ప్రదర్శించారు. ప్రకృతిపై, ఎరుపు రంగుపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి విద్యలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని పాఠశాల డైరెక్టర్ మంజుల వివరించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు వెన్‌రెడ్డి రాజు, ట్రినిటీ స్కూలు ఛైర్మన్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్య తీసుకోవాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ మండల పరిధిలో హెచ్ఎండీఏ ఆమోదం లేకుండా ఏర్పాటైన వెంచర్లపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కాయితి రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, కొండ యాదగిరి తదితరులు బుధవారం హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులుకు వినతి పత్రం సమర్పించారు. డిసెంబర్ 23న జరిగిన చౌటుప్పల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అక్రమ వెంచర్లపై చర్చించామని, సభ్యులందరూ వీటిపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎండీఏ, కలెక్టర్‌లను కోరుతూ తీర్మానించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మండల సభ తీర్మానం ప్రతిని వినతిపత్రంతో పాటు కమిషనర్‌కు అందజేశారు. మౌలిక సదుపాయాలకు పంచాయతీకి పది శాతం భూమిని కేటాయించడం లేదని ఫిర్యాదు చేశారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి హెచ్ఎండీఏ అనుమతిలేని వెంచర్లలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరుగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



హెచ్ఎండీఏ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చౌటుప్పల్ ఎంపీపీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కాయితి రమేశ్ తదితరులు

శివదీక్షలు పరమ పవిత్రం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: శివదీక్షలు పరమ పవిత్రమైనవని గురుస్వామి ఆదిమూలం శంకరగురు తెలిపారు. చౌటుప్పల్ భవానీనగర్‌లోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం పలువురు భక్తులు శివదీక్షలు స్వీకరించారు. 41 రోజుల పాటు దీక్ష కొనసాగించి శ్రీశైల శ్రీమల్లికార్జున స్వామిని దర్శించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గురుస్వాములు బొడిగె వెంకటేశం, బండి స్వామి, వాటి రమేశ్, జూలు శంకరయ్య, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

6న ఎంపీటీసీ అభ్యర్థుల జాబితా ప్రకటన

మునుగోడు, న్యూస్‌టుడే: కిష్టాపురం ఎంపీటీసీ ఉపఎన్నికల పోటీలో బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను ఈనెల 6న ప్రకటిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల బరిలో ఉండేందుకు అభ్యర్థులు వేసిన నామినేషన్ దాఖలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడుగురు అభ్యర్థులు 11 నామినేషన్లు వేయగా ఎలాంటి తప్పులు లేకుండా అన్ని సక్రమంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే గురువారం ఆర్డీవో కార్యాలయంలో అప్పీలు చేసుకోవాలని సూచించారు. ఈనెల 6న మధ్యాహ్నం ఉపసంహరణ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి సీతాకుమారి, ఈవోపీఆర్డీ ఆవుల రాములు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్

ఏఎస్సైకి సన్మానం

కట్టంగూరు, న్యూస్‌టుడే: క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులు పదవి విరమణ చేసినప్పటికీ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలుస్తారని సీఐ క్యాస్ట్రో అన్నారు. కట్టంగూరు ఏఎస్సై యూసుఫ్‌జానీ పదవి విరమణ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం యూసుఫ్‌జానీని సన్మానించారు. నకిరేకల్ సీఐ సుబ్బిరామిరెడ్డి, కట్టంగూరు, నకిరేకల్, నార్కట్‌పల్లి, కేతేపల్లి ఎస్సైలు రంజిత్, నర్సింహారావు, గోవర్ధన్, రజనీకర్ తదితరులు పాల్గొన్నారు.

‘భాజపా పాలనలో దళితులపై పెరిగిన దాడులు’

రామన్నపేట, న్యూస్‌టుడే: భాజపా పాలనలో దళితులపై దాడులు పెరిగాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విమర్శించారు. రామన్నపేటలో బుధవారం జరిగిన పార్టీ మండల సమావేశంలో మాట్లాడారు. మందకృష్ణను అరెస్టు చేయటం అప్రజాస్వామికమన్నారు. యాదాసు యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, మామిడి వెంకట్‌రెడ్డి, కూరెళ్ల నర్సింహాచారి, కందుల హన్మంతు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

యర్రానిగూడెం(కట్టంగూరు), న్యూస్‌టుడే: యర్రానిగూడెం, ఈదులూరులోని మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచులు బండారు సుమలత, ఐతగోని నారాయణ, ఎంపీటీసీ సభ్యులు వెంకటనర్సయ్య, ఆర్ఐ విజయ, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, వీఆర్వో కృష్ణయ్య పాల్గొన్నారు.

వెలిమినేడు,న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన కడారి మహేందర్ ఇటీవల మృతిచెందారు. ఆయన భార్య లింగమ్మకు యాదవసంఘం ఆధ్వర్యంలో రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద దేశబోయిన బిక్షమయ్య, ఎంపీటీసీ సభ్యుడు నెలికంటి నర్సింహ, బైకాని నాగరాజు, చీమల వీరేశం, చిర్రబోయిన సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపూరు: సింగిల్విండో సభ్యులు గోపగోని మారయ్య, పాలెం నారాయులు ఇటీవల మృతిచెందారు. మృతులు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున డీసీసీబీ అందజేసిన నగదును గుండ్రాంపల్లి సింగిల్విండో అధ్యక్షుడు అంతటి శ్రీనివాస్, ఏపూరు సర్పంచి గడకారి సైదులు, వైస్ ఎంపీపీ పాలెం మల్లేషు వారి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

చిట్యాల: మందకృష్ణ అరెస్టును నిరసిస్తూ చిట్యాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మేడి శంకర్, ఎరసాని గోపాల్, యాకారి నరేందర్, రుద్రవరం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలోని సాయిద్వారకాపురి కాలనీలో ఏర్పాటు చేసిన దంత వైద్యశాలను బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో తెరాస నల్గొండ నియోజకవర్గ బాధ్యుడు కంచర్ల భూపాల్‌రెడ్డి, సర్పంచి గుండెబోయిన శ్రీలక్ష్మి, ఎంపీపీ బట్టు అరుణ, జడ్పీటీసీ సభ్యుడు శేపూరి రవీందర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకి (రామన్నపేట), న్యూస్‌టుడే: వెల్లంకిలో చేనేత కార్మిక సంఘం కమిటీ అధ్యక్షుడిగా అంకెం పాండు ఎన్నికయ్యారు. ఈనెల 2న జరిగిన సంఘం మహాసభలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పున్న దత్తాద్రి, ఉపాధ్యక్షుడిగా గంజి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా గుర్రం వెంకన్న, సహాయ కార్యదర్శిగా ఈపూరి శంకరయ్య ఎన్నికయ్యారు.

కేతేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో పనిచేసే మేట్లను తొలగించడం సరైంది కాదని ఉపాధి మేట్ల సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి వెంబడి రమేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సకాలంలో కూలీ డబ్బులు వచ్చే విధంగా బిల్లుల తయారీలో మేట్ల పాత్ర కీలకమన్నారు. ఉపాధి మేట్లను తొలగిస్తే క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.

నకిరేకల్, న్యూస్‌టుడే: వేలిముద్రల సమస్యను చూపుతూ నెలల తరబడి ఆసరా పింఛన్లు చెల్లించడం లేదని ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తపాలా కార్యాలయం వద్ద వృద్ధుల సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. వృద్ధులను కార్యాలయానికి తిప్పకుండా సిబ్బందే వారి ఇళ్లవద్దకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో పోరాట సమితి నాయకులు కె.సత్యనారాయణచారి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, బి.శ్రీనివాస్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు, న్యూస్‌టుడే: పత్తి క్వింటాకు రూ.6వేలు మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం యర్రసానిగూడెం స్టేజీ సమీపంలో ప్రైవేటు పత్తి మిల్లులోని రైతులతో మాట్లాడారు. క్వింటా పత్తికి సీసీఐ చెల్లిస్తున్న రూ.4,300 ధర రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు.

స్వచ్ఛమేవ జయతే

☆ బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలే లక్ష్యం ☆ జనవరి 26లోపు వందశాతం పూర్తి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నార్కట్‌పల్లి, న్యూస్‌టుడే:

బహిరంగ మల, మూత్ర విసర్జనను వందశాతం నిర్మూలించడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ముందుకు సాగుతోంది. దీనికి గానూ 2014 సంవత్సరంలో స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా 12 మిలియన్ల మరుగుదొడ్లను నిర్మించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు. నార్కట్‌పల్లి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు విజయానికి అడుగు దూరంలో ఉండటం విశేషం. మండలంలో మొత్తం 19 పంచాయతీలకు ఇప్పటికే 8 పంచాయతీల్లో పూర్తిచేసి అవార్డులు సైతం సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 పంచాయతీల్లోనూ జనవరి 26 వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో నిత్యం శ్రమిస్తున్నారు. మండలంలో మొత్తం 30761 లక్ష్యం ఉండగా 30178 పూర్తిచేశారు. 483 ప్రగతిలో ఉన్నాయి, కేవలం 100 మాత్రమే ప్రారంభించాల్సి ఉంది. దీంతో 84 శాతం పూర్తిచేసి ముందంజలో ఉన్నారు.

గ్రామం	లక్ష్యం	పూర్తైనవి	ప్రగతిలో ఉన్నవి
అక్కెనపల్లి	344	329	15
మాండ్ర	218	208	10
చిన్నతుమ్మలగూడెం	203	184	18
ఔరవాణి	165	146	18
తొండల్‌వాయి	310	268	37
లింగోటం	120	115	14
యల్లారెడ్డిగూడెం	283	220	59
బెండల్‌పహాడ్	81	62	16
నెమ్మాని	172	131	40
నార్కట్‌పల్లి	299	175	113
అమ్మనబోలు	390	179	138

విడతల వారీగా: మొదటగా మండలంలోని గ్రామాలను జనాభా ప్రాతిపదికను విభజించారు. తక్కువ జనాభా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి విజయం సాధించారు. అనంతరం మేజర్ పంచాయతీల వైపు దృష్టి సారించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహనతో ముందుకెళ్తూ నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో విజయవంతమవుతున్నారు.

☆ పంచాయతీకి ఒక అధికారిని దత్తత అధికారిగా నియమించుకొని నిత్యం పర్యవేక్షణ చేపడుతున్నారు.

☆ బహిరంగ మల, మూత్ర విసర్జన ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

నిధుల మంజూరు ఇలా: జాతీయ ఉపాధి హామీ, నిర్మల్ భారత్, స్వచ్ఛభారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లకు నిధులు మంజూరు చేస్తున్నారు. నిర్మల్‌భారత్ కింద లబ్ధిదారుడు రూ.900 చెల్లిస్తే ప్రభుత్వం రూ.9100 చెల్లిస్తుంది. ఉపాధి హామీ, స్వచ్ఛభారత్‌లో రూ.12వేలు చెల్లిస్తారు. వీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సొమ్ముతో మరుగుదొడ్లను నిర్మించుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

అనుకున్న లక్ష్యం చేరుతాం:

– గుర్రం సురేష్, ఎంపీడీవో

అధికారులు, ప్రజాప్రతినిధులు అనుకున్న విధంగా ముందుకెళుతున్నాం. లక్ష్యాన్ని వందశాతం పూర్తిచేసి జిల్లాలోనే నార్కట్‌పల్లి మండలాన్ని ఆదర్శంగా మారుస్తాం.

నిత్యం అవగాహన కల్పిస్తున్నాం:

– పుల్లెంల అచ్చాలుగౌడ్, సర్పంచి, నార్కట్‌పల్లి



గ్రామంలో ప్రతి ఒక్కరు మరుగుదొడ్డు నిర్మించుకోవాలని ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్నాం. మరుగుదొడ్డతో కలిగే నష్టాలపై వారికి తెలియజేస్తున్నాం. దీనికి తోడు మరుగుదొడ్డకు ఉపయోగించే సామగ్రికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందేలా ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం అందించే నిధులు సైతం వెంటనే అందిస్తున్నాం. మొండిగా వ్యవహరించే వారికి ప్రభుత్వ పథకాలను ఆపి నిర్మించాలని నిర్ణయించుకుంటున్నాం. జనవరి 26 లోగా వందశాతం నిర్మిస్తాం.

జనవరి 26 లోగా పూర్తిచేస్తాం:

– కొండూరి శంకరయ్య, యల్లారెడ్డిగూడెం సర్పంచి



గ్రామంలో నిత్యం తిరుగుతూ ప్రజలకు తెలియజేస్తున్నాం. జనవరి 26 లోగా వందశాతం పూర్తిచేసి అవార్డును అందుకుంటాం. అధికారులు సహకరించడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. ఆర్థికంగా ఇబ్బందులున్న వారికి సామగ్రిని ఇప్పించి పూర్తి చేస్తున్నాం. వినూత్న కార్యక్రమాలు చేపట్టి పట్టుదలతో ముందుకెళుతున్నాం.

అభివృద్ధిలో గ్రామపంచాయతీలే కీలకం


ఆకారంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యురాలు సునీత

శాలిగౌరారం, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకమని శాలిగౌరారం జడ్పీటీసీ సభ్యురాలు అయితగోని సునీతవెంకన్నగౌడ్ అన్నారు. ఆకారం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఎస్ఎహెచ్‌జీ, సీబీవో గ్రూపు సభ్యులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యం, నీటిసంరక్షణ, పౌష్టికాహారం, శక్తి సంరక్షణ, నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి వలిశెట్టి చంద్రకళ, ఎంపీటీసీ వలిశెట్టి ఇందిర, ఉపసర్పంచి కారింగుల పాండు, గ్రామకార్యదర్శి సుజాత, రవి తదితరులు పాల్గొన్నారు.

బొప్పారం(కేతేపల్లి),న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించేందుకోసం ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తమవంతు సహకారం అందించాలని కేతేపల్లి మండల పంచాయతీరాజ్ శిక్షణ కార్యక్రమాల అధికారి(సీఆర్పీ) కె.మహేందర్ పేర్కొన్నారు. బొప్పారంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సాగునీటి నిల్వలకు అమలు చేస్తున్న వాటర్‌షెడ్ పథకాల వివరాలను రైతులకు తెలియజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో కాసనగోడు ఎంపీటీసీ సభ్యుడు కందుల మోహన్‌కుమార్, బొప్పారం సర్పంచి కల్లాని లింగయ్య, సీఆర్పీ ఎ.మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భోగారం (రామన్నపేట), న్యూస్‌టుడే: బోగారంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మండల పరిషత్తు ఉపాధ్యక్షురాలు బద్దుల ఉమ, సర్పంచి రాపోలు శివరంజని అన్నారు. గ్రామంలో పంచాయతీ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణం పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు కాల్వలతో పాటు సీసీరోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కూనూరు మల్లేశం గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలుండాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: పొదుపు సంఘాలకు రుణాలు ఇచ్చే బ్యాంకులు సంఘాల్లోని మహిళలందరికీ తమ బ్యాంకుల్లో వ్యక్తిగత ఖాతాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్(ఎల్‌డీఎం) సూర్యం కోరారు. బుధవారం నకిరేకల్



నకిరేకల్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం సూర్యం

మండల పరిషత్‌లో నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల సంయుక్త బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడారు. వివిధ ప్రభుత్వ పథకాల కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరు కోసం విధించిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. నకిరేకల్ వీటీ కాలనీ ఎస్‌బీఐ మేనేజర్ ఎం.మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్‌సెటీఐ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డీపీఎం రామలింగయ్య, డీఆర్‌డీఏ రామకృష్ణ, నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం ఎంపీడీవోలు బి.యాకూబ్‌నాయక్, డి.జయమ్మ, జి.హరీష్‌కుమార్, ఈవోపీఆర్డీ జావీద్‌అలీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారి కాశయ్య, ఏపీఎంలు చంద్రశేఖర్, జానకి, వెంకన్న, కె.మట్టయ్య, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నకిరేకల్

కాలమానిని ఆవిష్కరణ

రామన్నపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని రామన్నపేటలో ఎంపీడీవో కె.జానకిరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్షుడు ఏళ్ల అనంతరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఏళ్ల అనంతరెడ్డి మాట్లాడారు. పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి శంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు అందించాలి

నార్కట్‌పల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వరలక్ష్మి పత్తిమిల్లులో పనులు చేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులకు కనీస వేతనాలు అందించాలని ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి యాజమాన్యాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు. బుధవారం మిల్లును పరిశీలించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



పత్తిమిల్లులో కార్మికులతో మాట్లాడుతున్న ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి

దీనిపై కార్మిక శాఖ అధికారులకు తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, బొల్ల శ్రీనివాసులు, సామ నరేందర్‌రెడ్డి, కల్లూరి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు చిరస్మరణీయం

కొప్పోలు(కేతేపల్లి),న్యూస్‌టుడే: అమరుల ఆశయాలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చిన వెంకులు పేర్కొన్నారు. కొప్పోలుకి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు జటంగి పెంటయ్య(89) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆయన మృతదేహంపై పార్టీ పతాకం వేసి నివాళి అర్పించారు. చినవెంకులు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ప్రజల్లో తగిన గుర్తింపు, ఆదరణ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కమిటీ సభ్యుడు సీహెచ్ లూర్థుమారయ్య, నాయకులు కప్పల లింగయ్య, గండు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు

శాలిగౌరారం, న్యూస్‌టుడే: శాంతియుతంగా ధర్నాచేస్తున్న మంద కృష్ణను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట



శాలిగౌరారంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొప్పుల కిరణ్, ఎర్ర రాములు, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జి ఈర్లపల్లి మల్లయ్య, సంఘం మండల అధ్యక్షుడు గుర్కు శివ డిమాండ్ చేశారు. మంద క్రిష్ణ మాదిగను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సంఘం నాయకులు రామన్నపేటలో బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షను సర్పంచి నకిరేకంటి మొగిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లయ్య, శివ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నకిరెకంటి శ్రీశైలం, మేడి స్వామి, నర్సింహా, మారయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

నకిరేకల్: **వెంకటేశ్వర** - ఎంసీఏ
రామకృష్ణ - 2 కంట్రీస్
చిట్యాల: **సుజన** -ఎంసీఏ




చిట్యాల గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న తెరాస నాయకులు



రామన్నపేటలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్సై బి.నాగన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్



నార్కట్‌పల్లిలో తెరాసవి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహిస్తున్న యువకులు



కట్టంగూరులో

సావిత్రిబాయి పూలే జయంతి

నకిరేకల్, న్యూస్‌టుడే: తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని బుధవారం నకిరేకల్‌లో నిర్వహించారు. ప్రధాన కూడలిలో పెట్రోలియం డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దైద రవిందర్, బాలికల గురుకుల పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా కన్వీనర్ వి.వాణిశ్రీ, పన్నాలగూడ కూడలిలో టీమాస్‌ఫోరం జిల్లా కమిటీ సభ్యురాలు కందాళ ప్రమీల, బీసీ బాలికల వసతిగృహంలో తెలంగాణ ఇంటిపార్టీ రాష్ట్ర ప్రతినిధి చెరుకు లక్ష్మి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెరాస పట్టణ అధ్యక్షుడు కొండ వెంకన్న, కడపర్తిలో సీపీఎం మండల కార్యదర్శి ఆకుల భాస్కర్, నోములలో వ్య.కా.స జిల్లా ప్రతినిధి లగిశెట్టి శ్రీనివాసులు తదితరులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు.



నకిరేకల్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు దైద రవిందర్



నకిరేకల్‌లో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చెరుకు లక్ష్మి



తాళ్లవెల్లంలలో ...

పేదల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే

నకిరేకల్, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా కృషిచేస్తున్న కేసీఆర్‌కు అండగా నిలవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. బుధవారం నకిరేకల్‌లో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేసి మాట్లాడారు. లబ్ధిదారులు ఇబ్బందులుపడకుండా ఉండేందుకు వారి ఇళ్లవద్దకెళ్లి చెక్కులు అందజేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో తెరాస నాయకులు పూజర్ల శంభయ్య, సోమా యాదగిరి, పెండెం సదానందం, ఉపసర్పంచి మంగినపల్లి రాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండ వెంకన్న, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్‌లో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

మండలాపురం(నకిరేకల్), న్యూస్‌టుడే: మండలాపురంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారు టి.ఆదెమ్మకు రూ.75వేల చెక్కును ఎమ్మెల్యే వీరేశం అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు పి.సరిత, సహకార సంఘం డైరెక్టర్ వేర్పుల సైదులు, టి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట, న్యూస్‌టుడే: 24 గంటలు విద్యుత్తు సరఫరా చేసి కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రామన్నపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రణాళిక బద్ధంగా వ్యవహరించారన్నారు. విద్యుత్తు సరఫరాపై ప్రతిపక్షాలు తప్పుడు విమర్శలు చేస్తున్నాయన్నారు. మండల తెరాస అధ్యక్షుడు గంగుల రాజిరెడ్డి, ఎంపీటీసీ ఆకవరపు మధుబాబు, మత్స్యశాఖ డైరెక్టరు జినుకల ప్రభాకర్, డీసీఎంఎస్ డైరెక్టరు జెల్లా వెంకటేశం, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ బందెల రాములు, పట్టణ తెరాస అధ్యక్షుడు రామిని రమేశ్, ఎండీ నాసర్ పాల్గొన్నారు.

నకిరేకల్, న్యూస్‌టుడే: తాటికల్ లోకరక్షకుని ప్రార్థనా మందిరం నూతన సంవత్సర కాలమానిని బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎన్.సత్యం, వి.హానోక్, రెవ.లక్ష్మణ్‌జాకబ్, బి.ప్రేమ్‌దాస్, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ఎం.సుజాత, సర్పంచి సీహెచ్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన సంవత్సర కాలమానిని బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వేణుమాధవ్, నకిరేకల్ అధ్యక్షుడు వి.సైదులు, కార్యదర్శి కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

వెలిమినేడు(చిట్యాల),న్యూస్‌టుడే: డిసెంబర్ 24న వెలిమినేడు శివారులో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాయర నందిని (25) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందారని చిట్యాల ఏఎస్సై జి.సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. నందిని గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన వారు. హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంకులో తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.